# నవ్యాంధ్రతో నా నడక

ఐ.వై.ఆర్.కృష్ణారావు

**NAVYANDHRATHO NAA NADAKA**
**I.Y.R. Krishna Rao**

**నవ్యాంధ్రతో నా నడక**

**ఐ వై ఆర్ కృష్ణారావు**

ముద్రణ
నవంబర్**, 2018**

మూల్యం : రూ. **75/-**

ప్రింటర్స్
**రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

Copies available for purchase in all **Visalandhra** and **Prajasakti book** stalls, Amazon, Kindle and from M/s Foundation for Social Awareness, Flat 306, Tulip residency near TS Civilsupplies Bhavan, Somajiguda, Hyderabad-500082. Ph : 6302079381
e-mail : fsasocial2017@gmail.com
Postal copies can also be ordered from above address.
Also visit @iyrkrao Twitter account
IYR Krishna Rao Facebook page
Foundation for Social Awareness youtube account.

పబ్లిషర్స్
**ఫౌండేషన్ ఫర్ సోషల్ అవేర్‌నెస్**
ఫ్లాట్ నం. 306, తులిప్స్ రెసిడెన్సీ
సివిల్ సప్లై భవన్ దగ్గర
6-3-655, సోమాజిగూడ,
హైదరాబాదు - 500 482.

 

విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకోసం
గట్టిగా పోరాడిన అధికారులు చందనాఖాన్, మురళీసాగర్‌లకు
ఈ పుస్తకం ప్రేమతో అంకితం

# ప్రజలు కోరుకునేది



**– ఎం. గోపాలకృష్ణ**
మాజీ ప్రత్యేక కార్యదర్శి, ఆం.ప్ర. ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్ర, ప్రభుత్వ పాలనకు సంబంధించి ప్రస్తుతం ఉన్న రచనలకు అదనంగా ఇవ్వాళ అత్యవసరమైన మరింత సమాచారాన్ని ఈ పుస్తకం అందిస్తుంది. ఆంధ్రరాష్ట్రం భారతదేశంలో భాషాప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రం. 1953 అక్టోబర్ 1న కర్నూలు తాత్కాలిక రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. తరువాత మరెన్నో భాషాప్రయుక్తరాష్ట్రాలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం భాషను ప్రజల ఐక్యతకు ప్రాథమికమైన ఆధారంగా చూడడమే దీనికి కారణం. అయితే స్థానికమైన రాజకీయ సంస్కృతిక ఆకాంక్షలను, సామాజిక ఆర్థిక అవసరాలను తీర్చడంలో విఫలమైనప్పుడు అదే ఒక విభాజికశక్తిగా రూపొందింది.

ఆంధ్రరాష్ట్రం కర్నూలు నుండి 1956 లో హైదరాబాదుకు రాజధాని మారే క్రమంలో గొప్ప మార్పు పొందింది. హైదరాబాదు తెలుగు మాట్లాడే ప్రజల విశాలాంధ్ర, ఆంధ్రప్రదేశ్ అనే ఉమ్మడి రాష్ట్ర రాజధానిగా రూపుదిద్దుకుంది. 2014 లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో అది మళ్లీ మిగిలిపోయిన పాత ఆంధ్రరాష్ట్రం అయిపోయింది (పేరు మాత్రం ఆంధ్రప్రదేశ్).

ఈ గ్రంథ రచయిత శ్రీ ఐవైఆర్. కృష్ణారావు 1979 బాచ్‌కు చెందిన ఐ.ఏ.ఎస్. అధికారి. విభజన అనంతర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయన కీలకమైన ఈ పునర్వ్యవస్థీకరణ కాలంలో పనిచేశారు. జనవరి 2016 లో పదవీ విరమణ చేశారు. ఐవైఆర్ అనేక ఉన్నతపదవులను నిర్వహించారు. తన నిజాయితీకీ, సమగ్రతకూ నేలవిడచి సాముచేయని దృష్టికోణానికీ ప్రసిద్ధుడు. అంతేకాక నిర్మొహమాటంగా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే వ్యక్తి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు పునర్వ్యవస్థీకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు. విభజన సమయంలో జరిగిన ఎన్నో విషయాలకూ, ఒత్తిడులకూ, ప్రయత్నాలకూ ఆయన సాక్షి. కృష్ణారావుగారు మార్చి 2018 లో 'అమరావతి ఎవరి రాజధాని?' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని ఫౌండేషన్ ఫర్ సోషల్ అవేర్‌నెస్ సంస్థ ప్రచురించింది. ప్రపంచవ్యాప్తంగా రాజధానీ నగర ఎంపికలో అవలంబించిన పద్ధతులనూ, సైద్ధాంతిక నేపథ్యాన్నీ ఆయన ఈ పుస్తకంలో విహంగవీక్షణం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి ఎంపిక, దాన్ని ఒక అద్భుతమహానగరంగా నిర్మించే ప్రణాళిక భారతప్రభుత్వం ఏర్పరచిన శ్రీ శివరామకృష్ణన్ కమిటీ సిఫారసులకు వ్యతిరేకమే కాకుండా, ఈ ఎంపిక వల్ల ప్రభావితులైన వ్యక్తుల అంగీకారాన్ని సంపాదించే విషయంలో ప్రభుత్వం అవలంబించిన సూత్రాలు, ఆచరణలు కూడా తప్పు దారి తొక్కినవే. కృష్ణారావుగారు రాజధాని స్థలంకోసం ప్రభుత్వభూమి విస్తారంగా అందుబాటులో ఉన్న దొణకొండను సూచించారు. ప్రభుత్వం దాన్నికూడా అంగీకరించలేదు. అనేక లోపాలు, సందేహాలు ఉన్నప్పటికీ అమరావతిని ఎంపిక చేసుకోవడం ఒక వివాదాస్పద అంశమైంది. దీనికి ఒక కారణం రాజధానీ నిర్మాణానికి కావలసిన విస్తృతమైన నిధుల సమస్య. రెండవది పర్యావరణ సమస్యలు. అత్యవసరంగా దృష్టిసారించాల్సిన సామాజిక ఆర్థిక సమస్యలెన్నో ఉన్నందువల్ల ఈ విషయం ప్రజల్లో ప్రాధాన్యతను సంతరించుకుని చర్చనీయాంశమైంది. అందువల్ల సమస్యలు, వాటి పరిష్కారాలు, సంఘటనలు, చర్చనీయాంశాలు మరొక్కసారి చర్చించుకోవలసిన అవసరముంది. అంగీకారయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనవల్సి ఉంది.

ఆయన ప్రధానకార్యదర్శి ఎలా అయిందీ? ఐఎఎస్ అధికారులు, ఉమ్మడి సంస్థలు, ఉద్యోగులను రెండు రాష్ట్రాల మధ్య విభజించే సమయంలో ఆయన ఎదుర్కొన్న సమస్యలేమిటి? అన్న విషయం ఈ పుస్తకంలో వివరంగా ఉంది. విద్యుత్ పంపిణీ విషయంలోనూ విద్యుత్ కొనుగోలు ఒప్పందాల విషయంలోనూ తలెత్తిన సవాళ్లను కూడా ఈ పుస్తకం పేర్కొన్నది. జరగకూడని ఎన్నో సంఘటనలను జరగకుండా నిరోధించే అవకాశం ఉండింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో పదేళ్ల వరకూ ఉండడానికీ, సెక్షన్ 8 కింద అవకాశం ఉన్నప్పటికీ ఆంధ్రప్రాంతం నుండి వచ్చి హైదరాబాదులో స్థిరపడిన వారి రక్షణకి ఇది ఏర్పాటు కలిగించినప్పటికీ ఉమ్మడి గవర్నరుకు ఒక ప్రత్యేక పాత్రను ఇచ్చినప్పటికీ ఆకస్మికంగా ఆంధ్రప్రదేశ్

అధికారులను, ఉద్యోగులను సరైన ఎటువంటి ఏర్పాట్లూ లేకుండానే హైదరాబాదు నుండి విజయవాడకు మార్చడం సంబంధిత, ప్రభావిత వ్యక్తులందరి విమర్శకు గురయింది. తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడు రేవంత్ రెడ్డి 'ఓటుకు నోటు' కేసులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సందేహాస్పద పాత్ర విషయంలో మీడియా రిపోర్టుల ప్రభావం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తొందరపడి విజయవాడకు మారడానికి కొంత కారణమై ఉంటుందని ఆయన ఊహించారు.

రాజనీతిజ్ఞత, మిత్రత్వం ప్రధానమైన అవసరంగా ఉన్న సమయంలో రెండు రాష్ట్రాల మధ్యా రాజకీయ, సామాజిక, సంస్కృతిక, పాలనాపర సత్సంబంధాలు లేకపోవడం విషయాలను మరింత సంక్లిష్టం చేసింది. అనేక సమస్యలను పరస్పర విశ్వాసంతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో రెండు రాష్ట్రాలూ తేలికగా పరిష్కరించుకోగలిగేవి. ఉభయ రాష్ట్రాలకూ ఐఎఎస్ అధికారుల ఉమ్మడి కేడర్ కొన్ని సంవత్సరాలపాటు కొనసాగి ఉంటే అనేక సమస్యలు ఉభయులకీ అంగీకారయోగ్యంగా పరిష్కారమై ఉండేవి.

ముఖ్యమంత్రికీ, ప్రధానకార్యదర్శికీ మధ్య తగినంత విశ్వాసమూ, పారదర్శకతా, సత్సంబంధం కొరవడినందుకు రచయిత బాధ పడ్డాడు. 'అంతా నాకు తెలుసు', 'మా వాళ్లు నాకు చెప్పారులే' వంటి ముఖ్యమంత్రి ధోరణి రచయిత దూరమవడానికీ, మూగబోవడానికీ కారణమయినట్లు కనిపిస్తుంది. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు అందితే జుట్టు, అందకపోతే కాళ్లూ పట్టుకునే ధోరణిని, ఎంతకైనా దిగజారే ధోరణిని కూడా ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అయుత చండీ యాగానికి తనను ఆహ్వానించిన తెలంగాణ ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖామంత్రి తగిన మర్యాద చూపించిన సన్నివేశాన్ని ఇక్కడ ఆయన పోలికగా ఉదహరించారు.

ఇటీవలి కాలంలో ప్రధాన కార్యదర్శి కార్యాలయం, సివిల్ సర్వీసుల అధ్యక్షుడుగా కేబినెట్ సెక్రటరీ కార్యాలయం రాజకీయ అధికార వర్గానికి రాష్ట్ర/దేశ సంబంధమైన అన్ని విషయాలలో సలహాలిచ్చే అధికారం తగ్గిపోయింది. ఆధికారికంగా నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఓ), ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ) పలుకుబడి అధికమైపోతూ ఉంది.

2014 జూన్‌లో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకార సమయంలో ప్రధాన కార్యదర్శి తనకు నిర్దేశించిన అధికార దుస్తులను కాక,

సాంప్రదాయిక ఆంధ్ర వస్త్రాలైన ధోవతి, లాల్చీ అంగవస్త్రం ధరించాడు. అప్పుడు ముఖ్యమంత్రి ఎవరు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్నారన్న విషయంలో ఫొటోలు సందేహం కలిగించవచ్చునని వ్యాఖ్యానించారట.

అక్టోబర్ 2014 లో విశాఖపట్నం నగరానికి విస్తృతమైన నష్టం కలిగించిన హుద్‌హుద్ తుపాను విధ్వంసానికి మొత్తం రాష్ట్ర అధికార యంత్రాంగం ముఖ్యంగా జిల్లా అధికార యంత్రాంగం అద్భుతంగా ప్రతిస్పందించిన తీరును, వారి అసాధారణ కృషిని ఈ పుస్తకం కీర్తించింది. పౌరులు అప్పటికప్పుడు స్పందించి ఇచ్చిన సహాయసహకారాలు, భారతప్రభుత్వం చేసిన సహాయం నిజంగా చెప్పుకోదగినవి.

లాండ్ ఎడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమీషనర్‌గా ఉన్న కాలంలో అత్యంత విలువ కలిగిన నగరభూముల కేసుల్ని తాను నిర్వహించిన సందర్భంలో ఎదుర్కొన్న కొన్ని అరుచికరమైన సన్నివేశాలను కూడా రచయిత ఈ పుస్తకంలో వివరించారు. రాజకీయ నాయకులు భూమాఫియాతో కుమ్మక్కై విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని లాభం పొందిన సందర్భాలివి.

రచయిత బిసి నాయకుడు కంచ ఐలయ్యకు సంబంధించిన ఉదంతాన్ని పదవి చివరి రెండు నెలలలో ఎదుర్కొన్న సమస్యలను ఈ పుస్తకం రాశారు.

పదవీ విరమణ చేసిన తరువాత కృష్ణారావుగారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఆయన సమస్యలను గుర్తించడానికి ప్రయత్నించారు. సమాజంలోని పేదవర్గాలు ఎదుర్కొంటున్న సామాజిక ఆర్థిక సమస్యలకూ, ఉద్యోగావకాశాల లేమి సమస్యకూ పరిష్కారాలు కనుగొనడానికి ప్రయత్నించారు. పేదల సంక్షేమం కోసం ఒక సహకార సంస్థను నెలకొల్పడంతో సహా వివిధ మార్గాలు అన్వేషించారు. 2007 లో ఆలయ అర్చకులకు సంబంధించి ఆమోదింపబడిన చట్టం విషయంలో చట్టం ఆమోదింపబడినప్పటికీ నియమాలు ఏర్పరచకపోవడం, వాటిని నోటిఫై చేయకపోవడం, అర్చకులు నైతికస్థైర్యం కోల్పోవడానికి ఎలా కారణమైందో వివరిస్తూ అందుకు ఆయన విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారుల సహాయసహకారాలు, ప్రోత్సాహంతో ప్రత్యర్థి బ్రాహ్మణ నాయకుల కుట్రల వల్ల తనను చైర్మన్ పదవి నుండి ఎలా బయటికి పంపించారో ఆయన వివరించారు.

స్వార్థప్రయోజనాలు కలిగిన వ్యక్తుల కారణంగా పరిపాలనా వ్యవస్థలో

విభిన్న అంతరవులు, ప్రక్రియలు పాడైపోయాయో సివిల్ సర్వెంట్ల పాత్ర ఏ విధంగా రాజకీయ నాయకులు, వారికి సనినహితంగా ఉన్నవారి చేత అణగదొక్కబడి కుంచించుకుపోయిందో ఈ పుస్తకం వివరిస్తుంది. అభివృద్ధి దిశను గురించి కుల, మత శక్తులు ఎలా బలపడుతున్నదీ, అవి లక్ష్యాన్నీ, ప్రక్రియనీ, ప్రజలను కూడా తప్పు త్రోవ పట్టించి, సామాజిక ఆర్థిక న్యాయాన్నీ, అభివృద్ధినీ ప్రభావితం చేస్తున్నాయో దానిగురించీ ఈ పుస్తకం అనేక సముచితమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఈ పుస్తక రచనలో పాటించిన క్లుప్తతకు, స్పష్టతకూ పరిగెత్తే కథనశైలికీ రచయితను మనం అభినందించాలి. ఈ గ్రంథం చాలా సూటిగానూ, స్పష్టంగానూ మాట్లాడుతుంది. విభజనానంతర ఆంధ్రప్రదేశ్ గతంలో ఎన్నో మార్పులు పొందింది. ఇప్పుడు పునర్జననం పొందింది. ఈ రాష్ట్రం అనుభవించిన వేదనలు, కష్టాలు తెలుసుకోవడానికి ఈ పుస్తకం ఒక మంచి సాధనం. సివిల్ సర్వెంట్లందరూ, మేనేజ్‌మెంట్ విద్యార్థులు, రాజకీయనాయకులు, అకడమీషియన్లు, సంఘ సేవకులు సమాజంలోని సరిగ్గా ఆలోచించే ప్రజలందరూ ఈ పుస్తకాన్ని చదవాలి. ప్రతి గ్రంథాలయంలోనూ ఈ పుస్తకం స్థానం సంపాదించుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ నిరంతర సామాజిక, ఆర్థిక పరిణామం, దాని ఉన్నత, వేగమంతమైన, దృఢమైన, మెరుగైన భవిష్యత్తుకు కీలకం. ఉత్తమ పరిపాలన మాత్రమే సంపద్వంతమైన, పురోగమనశీలమైన సూర్యోదయ రాష్ట్రానికి పునాది వేయగలుగుతుంది. దీనికి నిజమైన భాగస్వామ్య, ప్రజాస్వామ్యం కావాలి. ప్రజలయొక్క, ప్రజల చేత, ప్రజలకోసం ప్రజాస్వామ్యమనే నిర్వచనానికి లక్ష్యంగా నిలవాలి.

జనం కోరుకునేదేమంటే, “జీవితంలో కాస్త దుఃఖం తగ్గాలి, కాస్త ఆనందం పెరగాలి”.

★ ★ ★

# పరిచయం



**–అజయ్ కల్లం**

శ్రీ ఐవైఆర్ కృష్ణారావు కొత్తరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఏర్పడే దశలో ప్రధాన కార్యదర్శి కాబోయేముందు జరిగిన అనేక విషయాలకు ప్రత్యక్షంగాకాని, పరోక్షంగాకాని భాగస్వామిగాను, రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రధాన కార్యదర్శిగా తాను నిర్వహించిన పాత్రను వివరించే గ్రంథం ఇది. ఖమ్మం జిల్లాలో ఐటిడిఏలో పనిచేసినప్పటి నుండి ఐవైఆర్ నాకు తెలుసు. ఆయన మొహమాటం లేకుండా సూటిగా మాట్లాడే ప్రభుత్వాధికారి. అదే ఆయన బలమూ, బలహీనతా కూడా. ఇలా ముక్కుసూటిగా మాట్లాడే అధికారులు రాజకీయ అధికారయంత్రాంగానికి అప్పుడప్పుడూ అసౌకర్యంగా అనిపిస్తుంటారు. ఆయన కొత్తరాజధాని కోసం ఎంపిక చేసిన స్థలం గురించి బాహాటంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలు రియల్ ఎస్టేట్ ముఠాలకు, ప్రధానంగా వ్యక్తిగత ఆసక్తులు, ప్రయోజనాలున్న ప్రజాప్రతినిధులనబడే వాళ్లకు ఆందోళన కలిగించడంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఈ రాష్ట్రవిభజనకు దారితీసిన కొన్ని పరిస్థితులను దగ్గర నుండి చూసే అవకాశం నాకు కూడా కలిగింది. ఆ కీలకమైన రోజుల్లో ఆంధ్ర ప్రాంత నాయకుల ప్రవర్తన విషయంలో ఐవైఆర్ అభిప్రాయాలతో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాను. దాదాపు అన్ని రాజకీయ పార్టీల నాయకులూ ప్రాంత ప్రయోజనాలను కాపాడడం కోసం పనిచేయడం కంటే రాజకీయంగా సరైన నిర్ణయం పైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. వారిలో ఎక్కువమంది అసలు విభజన జరుగుతుందని ఎన్నడూ నమ్మలేదు. రాజ్యాంగ పదవులలో అత్యున్నత స్థానంలో ఉన్న కొందరు జనాంతికంలో రెండు రకాలుగా మాట్లాడడం కూడా దీనికి  కారణం కావచ్చు. వాళ్ళు చాలా తరచుగా విభజనకు వ్యతిరేకంగా ప్రైవేటులో తమ అభిప్రాయాలను ప్రకటించడమూ, విభజనకు

అవసరమైన రాజ్యాంగ ప్రక్రియ దాదాపు అసాధ్యమన్నంత క్లిష్టమైనదని ఆంధ్రనాయకులకు నమ్మకంగా చెప్పడమూ చేస్తూ వచ్చారు. ఈ నమ్మకమైన మాటలు సత్యమని విశ్వసించి ఆంధ్రప్రాంత నాయకులు తమ ప్రాంతం కోసం సవరణలు మొ॥న వాటి ద్వారా డిమాండ్లు చేయడం, విభజన ప్రతిపాదనకు అంగీకారం తెల్పినట్లవుతుందని భావించి చట్టంలోని వివిధ అంశాలపట్ల తమ అభ్యంతరాలను, ఆందోళనను తెలియజేయకుండా దూరంగా ఉన్నారు. అయినా కొందరు ప్రభుత్వాధికారులు శ్రమించి అనేక సవరణలు సూచించారు కాని, ఢిల్లీ వాటిని పట్టించుకోలేదు.

కుటుంబ ఆధిపత్యం, నియంత్రణలోని కాంగ్రెస్ పార్టీ ఈ అవకాశాన్ని కొంత చులకనగానే ఉపయోగించుకుంది. చారిత్రకంగా కాంగ్రెస్ పార్టీ రెండురకాల నాయకుల్ని ప్రోత్సహించింది. మొదటి తరం నాయకుల వారసత్వ సంతానం ఒకరకమైతే, వేళ్లు లేని వీరవిధేయులు రెండోరకం. వీరు సొంతంగా డిపాజిట్లు కూడా తెచ్చుకోలేరు కాని క్షేత్రస్థాయిలో వీరిని మేధావులుగా ముద్ర వేస్తారు. ఆంధ్రప్రదేశ్ విభజన విషయంలో ఇటువంటి ట్రిక్కునే ఉపయోగించారు. ఒక విధేయ మంత్రికి ఈ పని అప్పగించారు. ఆ మంత్రి కొందరు తుంటరి హోంశాఖ అధికారులతో ఈ ప్రక్రియను సమన్వయం చేశారు. ఈ తుంటరి అధికారులు వ్యక్తిగతంగా లాభపడే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. తుది ఫలితం ఏమంటే ఆంధ్ర ప్రాంతానికి నష్టం కలిగిస్తూ, దాదాపు ఏకపక్ష ఏర్పాట్లతో ఒక అప్రామాణిక చట్టం. అటువంటి అంశాలలో ఒకటి సరిహద్దుల నిర్ణయం. ఆంధ్రరాష్ట్రంలో తమ ఏకీకరణకు ముందు 1-11-1956 నాడు ఉన్నట్లుగా తమ ప్రాంతాన్ని వేరు చేయమని తెలంగాణ నాయకులు బాహాటంగా కోరారు. అటువంటి సమయంలో గతంలో ఆంధ్రప్రాంతంలో ఉన్న ప్రాంతాలను తెలంగాణలో ఎందుకు కలిపారు? ఇది కావాలనే చేశారు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సమస్యలు సంపాదించడానికీ, విభజనను నిరుత్సాహపరిచే తమ ఆత్రుతలో విభజనవల్ల తెలంగాణ ఎదుర్కొనే సమస్యలను ముఖ్యంగా విద్యుత్తు విషయంలో ఎదుర్కొనవలసి వచ్చే కష్టాలను తరచుగా తమ ఆందోళనలను వెలిబుచ్చడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కొందరు ముఖ్యమైన నేతలు పరోక్షంగా సహాయం చేశారు. పైన పేర్కొన్నట్లుగా ఢిల్లీలోని ఆ పాత్రలూ, మంత్రి, హోం మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు ఆంధ్రప్రభుత్వమూ, నేతలూ అందించిన ప్రతి సమాచారాన్ని, అంశాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని తెలంగాణ ఆసక్తులను కాపాడడం కోసం ఉపయోగించుకున్నారు.

ఐవైఆర్ తర్వాత హోంశాఖ అవలంబించిన సహకార నిరాకరణ సందర్భాలనకేకం పేర్కొన్నారు. అధికారుల విభజన ప్రక్రియలో సరైన న్యాయం జరగలేదన్న విషయాన్ని స్పష్టం చేశారు. ఫలితార్థ మేమంటే మొత్తం ప్రక్రియలో రాజ్యాంగనైతికతకు పూర్తిగా నీళ్లొదిలేశారు. విభజన అంశాలపట్ల, వాటి పరిష్కారాల పట్ల భారత ప్రభుత్వం ఎటువంటి ఆసక్తీ చూపలేదు. ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి తెలంగాణలో రాజకీయ ప్రయోజనాలధికం కావడం వల్ల చట్టంలోని ఏర్పాట్లలోని పరస్పర వైరుధ్యాల గురించి పట్టించుకోనే లేదు. విభజనానంతరం దురదృష్టవశాత్తు రెండు రాష్ట్రాలకూ అనైతిక నేతలే లభించారు. వీళ్లు భవిష్యత్ ద్రష్టలుగా ఉండడానికి బదులు కాకమ్మ కథలు చెప్పి ప్రజారంజకులయ్యారు. బాహాటంగా పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించారు, అవి నీతి సాగించారు, వృథా ఖర్చులు చేసి రెండు రాష్ట్రాలనూ అప్పుల ఊబిలోకి నెట్టారు. వీళ్లకు ప్రజాభిప్రాయం మీద ఎన్నడూ గౌరవం లేదు, సంప్రతింపులు, సలహాల మీద నమ్మకం లేదు, తమ శక్తినంతా మీడియాను తమవైపు తిప్పుకోవడం పైనే ప్రధానంగా కేంద్రీకరించారు.

ప్రభుత్వ స్థాయిలో ఏం జరుగుతుంది, ఎలా జరుగుతుంది అన్నది ఆ ప్రభుత్వంలో భాగంగా ఉన్న ఐవైఆర్ విస్పష్టరీతిలో చెప్పారు. ఆయన జ్ఞాపకశక్తి ప్రశంసనీయం. జనం ఈ పుస్తకాన్ని చదివి, ఇందులో చెప్పిన విషయాలను గుర్తిస్తారనీ, మన ప్రభుత్వ సంస్థలను ఎలా వినియోగిస్తారో ఇంకా సరిగ్గా చెప్పాలంటే ఎలా దుర్వినియోగపరుస్తారో అవగాహన చేసుకుంటారనీ ఆశిస్తాను. రాబోయే నెలలు, సంవత్సరాలలో తమ తమ రాష్ట్రాల భవిష్యత్తును రూపొందించు కోవడంలో నిజాయితీ, వినయం, న్యాయబుద్ధి, నిష్పక్షపాత బుద్ధి కలిగిన సరైన ఆదర్శవ్యక్తులను ఎంపిక చేసుకొనే వివేకాన్ని ఉభయరాష్ట్రాల పౌరులకూ భగవంతుడు ప్రసాదించుగాక.

★ ★ ★

# కృతజ్ఞతలు

ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత వివిధ సమస్యల పరిష్కారంలో నా పాత్రను దగ్గరగా పరిశీలిస్తూ ఉన్న మిత్రుడు ఒకరు ఆ కీలక ఘట్టంలో ప్రత్యక్ష సాక్షిగా వున్న నేను నా అనుభవాలను జనంతో పంచుకుంటే బాగుంటుంది అని సూచించారు. ఇది మంచి ఆలోచనే అనుకున్నాను. నా పదవి విరమణ అనంతరం వెంటనే నా వ్యక్తిగత కార్యదర్శి శేషగిరికి కొన్ని వివరాలు డిక్టేట్ చేసాను. అయితే వెంటనే నేను మరో పదవీ బాధ్యత చేపట్టవలసి వచ్చింది. ఒకసారి ఈ బాధ్యతనుంచి కూడా బయటపడిన తరువాత భూపాలనా ప్రధాన కమీషనర్‌గా ఉన్నప్పటి నుండీ బ్రాహ్మణ కార్పొరేషన్ నుండి బయటికి వచ్చేంతవరకు జరిగిన విషయాలను కూడా చేర్చి దీన్ని విస్తరించాలనుకున్నాను. అందువల్ల ఈ పుస్తకంలో నేను CCLA గా వున్నప్పుడు ఎదుర్కొన్న చాలా ముఖ్యమైన భూమి కేసులలో నా అనుభవాలు కూడా చోటుచేసుకున్నాయి. అట్లాగే బ్రాహ్మణ కార్పొరేషన్ నుండి నేను బయటికి రావలసిన వాస్తవ పరిస్థితులను కూడా ఈ పుస్తకం వివరిస్తుంది. నన్ను బ్రాహ్మణ కార్పొరేషన్ నుండి తొలగించిన వెనువెంటనే పత్రికా విలేఖరుల సమావేశంలో దానికి కారణాలను వివరించే అవకాశం కలిగినప్పటికీ మరెన్నో విషయాలు ఆనాడు చెప్పనివి ఈ పుస్తకంలో చెప్పే అవకాశం లభించింది.

రాష్ట్ర విభజన సమస్యలు సంఘర్షణాత్మకంగా మారినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించిన ఇద్దరు అధికారులు స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పర్యాటక శాఖ శ్రీమతి చందనాఖాన్, కార్మికశాఖ అదనపు కమీషనర్ శ్రీ మురళీసాగర్ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో అద్భుతమైన శ్రద్ధను, వ్యక్తిగతమైన కష్టనష్టాలను ఎదుర్కొని తమ విధులకు అంకితమై పనిచేసారు. వారికి ఈ పుస్తకాన్ని అంకితం చేశాను.

ఈ పుస్తకం స్వభావ రీత్యా ఒక ప్రత్యేక కాలానికి సంబంధించిన స్వీయచరిత్ర కూడా కాబట్టి ఆ సమయంలో నేను వ్యవహరించవలసి వచ్చిన వ్యక్తుల గురించి, వారి స్వభావం, ధోరణుల గురించి తెలియజేస్తుంది.

రాష్ట్ర విభజన సమయంలో ఎదుర్కొన్న సమస్యల గురించి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని లోపాల గురించి, విభజనానంతర సమస్యల గురించి, వాటి పరిష్కారం గురించి పాఠకులు మెరుగైన అవగాహన కలగడానికి ఈ పుస్తకం

ఉపయోగపడుతుందని నేను ఆశిస్తున్నాను. అలాగే బ్రాహ్మణ కార్పొరేషన్ నుండి నేను వైదొలగవలసిన పరిస్థితుల మీద ఇది మరింత వెలుగును ప్రసరిస్తుంది.

నా సీనియర్ సహోద్యోగి శ్రీ ఎమ్. గోపాలకృష్ణ, ఐఏఎస్ (రిటైర్డ్) గారిని నా పుస్తకానికి ఒక ముందుమాట రాయమని కోరినప్పుడు ఆయన పుస్తకమంతా చదివి ముందుమాట రాసారు. వారికి నా హార్దిక కృతజ్ఞతలు. 1987-89 మధ్య కాలంలో నేను ఖమ్మం జిల్లా కలెక్టరుగా వున్నప్పుడు శ్రీ అజయ్ కల్లం గారు ఐటిడిఏ కి పిఓ గా వున్నారు. అప్పటినుండి మా పరిచయం. ఆయన మరో ముందుమాట రాయడానికి అంగీకరించారు. ఆయనకు నా కృతజ్ఞతలు. సిల్వర్ జూబిలీ కళాశాలలో నాతో పాటు చదువుకున్న ఒకే హాస్టల్‌లో వున్న మిత్రుడు శ్రీ వై.ఎస్. మూర్తి ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దడంలో శ్రమపడ్డారు. 'Whose Capital Amaravathi' అన్న నా పుస్తకానికి కూడా ఆయనే సంపాదకత్వం వహించారు. ఆయనకు నా కృతజ్ఞతలు. నా అన్ని ప్రయత్నాలలోనూ నాతో వున్న నా వ్యక్తిగత కార్యదర్శి శేషగిరికి ప్రత్యేక కృతజ్ఞతలు.

★ ★ ★

# విషయ క్రమం...


| | |
|---|---|
| 1. ఛీఫ్ సెక్రటరీ ఎలా అయ్యాను? | 17 |
| 2. ప్రత్యూష్ సిన్హా పక్షపాత వైఖరి | 27 |
| 3. సెక్షన్ 8కి కాలదోషం ఎందుకు పట్టింది? | 31 |
| 4. సంస్థలు, ఉద్యోగుల విభజనలో సవాళ్లు | 37 |
| 5. ఇతర విభజన అంశాలు | 57 |
| 6. హుద్ హుద్‌లో తల మునకలు | 63 |
| 7. 'అవర్ పీపుల్ బ్రీఫ్డ్ మి' | 67 |
| 8. ఆంధ్రా ప్రయోజనాలకు దెబ్బ | 72 |
| 9. కేసిఆర్‌తో సంబంధాలు | 79 |
| 10. ఎప్పుడు, ఎలా, ఎందుకు చెడింది? | 82 |
| 11. గీత దాటిన మూర్తి | 104 |
| 12. రాజధాని రాజకీయం | 111 |
| 13. ఆంధ్రప్రదేశ్‌కు అవతరణ దినోత్సవం లేదా? | 122 |
| 14. చంద్రబాబు పని శైలి | 125 |

# 1

## చీఫ్ సెక్రటరీ ఎలా అయ్యాను?

ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో 2012 డిసెంబర్ ప్రాంతంలోనే నేను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) పదవి స్వీకరించేందుకు తగిన వాతావరణం ఏర్పడింది. అప్పుడు ప్రధాన కార్యదర్శిగా ఉన్న మిన్నీ మాథ్యూ 2013 జనవరిలో పదవీ విరమణ చేయాల్సి ఉన్నది. రాష్ట్రంలో ఉన్న సీనియర్ అధికారులలో ఒకడిని కావడం వల్ల నేను ఈ పదవిని స్వీకరించేందుకు అర్హుడినయ్యాను. కాని ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి నన్ను చీఫ్ సెక్రటరీగా నియమించేందుకు అంత ఆసక్తి ప్రదర్శించ లేదు. దీనికి ఒక నేపథ్యం ఉంది.

కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే నాటికి నేను టిటిడి కార్యనిర్వహణాధికారిగా ఉన్నాను. దాదాపు రెండేళ్లు ఆ పదవిలో పనిచేశాను. 2009లో నేను టిటిడి కార్యనిర్వహణాధికారి పదవి చేపట్టాను.

2010 నవంబర్ లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన మరుసటి రోజు నుంచీ నన్ను టిటిడి నుంచి తప్పిస్తారని ప్రచారం జరిగింది. సరిగ్గా ఆయన ముఖ్యమంత్రి అయిన ఏడు నెలలకు జూన్ 16న నన్ను ఆ పదవి నుంచి తప్పించారు.

కిరణ్ కుమార్ రెడ్డి స్పీకర్‌గా ఉన్నప్పుడు అడిషనల్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా ఉన్న తిప్పిరెడ్డి వెంకట శివకుమార్ రెడ్డిని కొండ క్రింది నుంచి పైకి తేవడానికి ప్రయత్నించారు.. కిరణ్ స్వయంగా నాతో ఫోన్‌లో మాట్లాడారు. ఒక శాసన సభ స్పీకర్ ఫోన్ చేస్తే దానికి విలువ ఇవ్వాలి. అందునా చిత్తూరు ఆయన స్వంత జిల్లా. కాని అదే సమయంలో శివకుమార్ రెడ్డిపై ఆరోపణలున్న రీత్యా

ఆయనను కొండ పైకి తీసుకు వస్తే సమస్యలుంటాయని నాకు తెలుసు. ఈ విషయం స్వయంగా స్పీకర్‌కు చెప్పాలని నేను భావించాను.

హైదరాబాద్ కు వెళ్లినప్పుడు కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నాను. శివకుమార్ రెడ్డిపై ఆరోపణలున్నందువల్ల ఆయనను పైకి తీసుకురావడం అంత మంచిది కాదని నేను ఆయనకు వివరంగా చెప్పాను. కిరణ్ కుమార్ రెడ్డి ఏమీ మాట్లాడలేదు. నా మాటలు ఆయన అర్థం చేసుకున్నారనే అనుకున్నాను. సమస్య పరిష్కారం అయిందనే ఉద్దేశంతో తిరుమల తిరిగి వెళ్లాను. కాని కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ విషయం మనసులో పెట్టుకుంటారని కానీ, కక్ష సాధింపు ధోరణితో ప్రవర్తిస్తారని కానీ అనుకోలేదు.

నన్ను టిటిడి కార్యనిర్వహణాధికారి పోస్టు నుండి బదిలీ చేసి, నేను ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన సీనియర్ అధికారినని తెలిసినప్పటికీ ఆయన నన్ను తక్కువ ప్రాధాన్యం గల కార్మిక శాఖలో నియమించారు. దీనితో నేను కిరణ్ కుమార్ రెడ్డిని స్వయంగా కలుసుకుని నా అసంతృప్తి వ్యక్తం చేశాను. 'గతంలో నేను వృత్తి పరంగా తీసుకున్న నిర్ణయాలను మీరు మనసులో పెట్టుకున్నారేమో..' అని కూడా అన్నాను. కిరణ్ నేను చెప్పింది మౌనంగా విన్నారు. 'సరే ఈ విషయం పరిశీలిస్తాను' అన్నారు. ఒక రెండు నెలలు పెండింగ్ లో పెట్టి మార్కెటింగ్ అండ్ కోపరేషన్ కు ప్రత్యేక సీఎస్ గా నియమించారు. నా సీనియారిటీకి ఇది కూడా తగిన ప్రాధాన్యం గల పోస్టు కాదు. ఏమైతేనేమి, మొత్తం మీద ఆయనతో నాకు అంత సత్సంబంధాలు లేవనే చెప్పాలి.

అందుచేత ఒకసారి ఆయనను కలిసి విషయం నివృత్తి చేసుకుంటే మంచిదని మినీమాథ్యూ పదవీ విరమణకు నాలుగు నెలలు ముందే ఆయనను కలిసాను. నా తరఫున ఆయనను విశ్వవిద్యాలయంలో నా జ్యూనియర్ అయిన ఒక మంత్రి కూడా కలిసారు. ఆయనను కలిసిన తర్వాత ఆ మంత్రి నాకు చెప్పింది ఏమిటంటే తిరుపతి సంఘటనే కాకుండా ఆయన దృష్టిలో తన అవసరాలకు మీరు సరిగా ఉపయోగపడరు అనే భావన కూడా ఉందని పేర్కొన్నారు. కాని కొంత మెత్తపడ్డారని మిమ్మల్నే నియమించవచ్చని చెప్పారు. నవంబర్ వరకూ ఆయన నా పట్ల సుముఖంగా ఉన్నట్లు కనిపించింది. తనకు సన్నిహితంగా ఉన్న ఒక మంత్రితో కూడా ఆయన నా గురించి సానుకూలంగా మాట్లాడినట్లు తెలిసింది. కాని ఏం జరిగిందో కాని

ఆయన ఢిల్లీ నుంచి పిలిపించి మరీ పి. కె. మహంతీని ఛీఫ్ సెక్రటరీగా నియమించాలని నిర్ణయించారు. అదే విధంగా పి.కె. మహంతి జనవరి నెలాఖరుకు రాష్ట్ర సర్వీసుకు తిరిగి వచ్చాడు. కాని చివరి క్షణంలో మినీ మాథ్యూ పదవీ కాలాన్ని మరో మూడు నెలలు పొడిగించారు. ఆ సమయంలో మహంతీని భూ పరిపాలన ఛీఫ్ కమిషనర్ (సిసిఎల్ఏ) గా నియమించారు.

మినీ మాథ్యూ గారి మూడు నెలల పదవీ పొడిగింపు ముగిసిన తరువాత మే నెల మొదటి రోజు ప్రసన్న కుమార్ మహంతీ ఛీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. దీనితో ఆయన స్థానంలో నేను ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ఛీఫ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించాను. సాధారణ సాంప్రదాయం ప్రకారం లాండ్ అడ్మినిస్ట్రేషన్ ఛీఫ్ కమీషనర్ పదవి నిర్వహించినవారు తదుపరి ఛీఫ్ సెక్రటరీ అవుతారు.

ఈలోపు తెలంగాణకు సంబంధించి రాజకీయ పరిణామాలు వేగవంతం అయ్యాయి. 2013 జులై 30న సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేసింది. ఆ మరుసటి రోజు నుంచీ రాష్ట్ర విభజనకు సంబంధించి చట్టాన్ని రూపొందించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. ఛీఫ్ సెక్రటరీగా ఉన్న మహంతి హైదరాబాద్‌నుంచి, అప్పుడు హోంమంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్న రాజీవ్ శర్మ ఢిల్లీ నుంచి పూర్తి స్థాయిలో విభజన ఘట్టంలో పాలు పంచుకున్నారు. తర్వాత సీనియర్ అధికారుల్లో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ ఈ విభజన కార్యక్రమం నుంచి ఛీఫ్ సెక్రటరీ నన్ను దూరం పెట్టారు.. ఆ సమయంలో నేను సిసిఎల్ఏ పదవిలో ఉన్నాను. అందువల్ల నాకు చట్టం గురించి, దాని ముసాయిదా గురించి తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. అనేక పరిణామాలు, వాడి, వేడి వాతావరణంమధ్య 2014 ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు ఆమోదం పొందింది. సరిగ్గా ఆ సమయంలో మహంతీ టర్మ్ పూర్తయి నేను ఛీఫ్ సెక్రటరీ అయ్యేందుకు మళ్లీ అవకాశాలు వచ్చాయి. ఫిబ్రవరిలో 28 రోజులే కనుక బిల్లు ఆమోదం పొందిన ఎనిమిది రోజుల్లో ఆయన పదవీ విరమణ జరుగనున్నది.

తనకు (extension) పొడిగింపు మీద ఆసక్తి లేదని మార్చి 1న పదవీ విరమణ చేయనున్నానని పికె మహంతీ బహిరంగంగా కూడా ప్రకటించారు. కిరణ్ కుమార్ రెడ్డి గారు మహంతి పదవీ విరమణ తరువాత నిన్నే ఛీఫ్ సెక్రటరీ

చెయ్యాలనుకుని నిర్ణయించారని ముఖ్యమంత్రి కార్యదర్శి అజేయ కల్లాం వచ్చి ఒకసారి కలిస్తే మంచిదని సూచించారు. నేను వెళ్ళి ఫిబ్రవరి 16 ప్రాంతంలో కలిశాను.

'సార్, నెలాఖరులో మహంతీ పదవీ విరమణ చేయనున్నారు..' అని గుర్తు చేశాను.

'తెలుసు' అని ఆయన చెప్పారు. తన వద్దే ఉన్నప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ కల్లం వైపు చూసి 'మనం కృష్ణారావు గారికి ఇప్పుడు ఆర్డర్ ఇద్దామా, తర్వాత ఇద్దామా?' అని అడిగారు.

అజయ్ కల్లం నావైపు చూసి.. 'ఎప్పుడైనా ఇవ్వవచ్చు. మహంతీ నెలాఖరులో వెళుతున్నారు కదా.. అప్పటి వరకూ సమయం ఉంది..' అని అన్నారు.

మహంతీ తర్వాత నేను ఛీఫ్ సెక్రటరీ కావడం ఖాయమన్న విషయం అందరికీ తెలిసిపోయింది.

అజయ్ కల్లం తర్వాత నాకు ఫోన్ చేసి సిఎం నన్ను ఛీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ఆ రోజే ఆర్డర్ ఇద్దామని భావించారని, కాని ఛీఫ్ సెక్రటరీ నెలాఖరులో ఇద్దామన్నారని తెలిపాడు. ఇది జరిగిన మూడు, నాలుగు రోజులలో కిరణ్ కుమార్ రెడ్డి రాజీనామా చేయడం, గవర్నర్ పాలన మొదలు కావడం జరిగింది. గవర్నర్‌తో నాకు సత్సంబంధాలు ఉన్నందువల్ల ఇక ఛీఫ్ సెక్రటరీ పదవికి ఎలాంటి ఆటంకాలు ఉండవని భావించాను. కేంద్రం రాష్ట్ర గవర్నర్ అభిప్రాయం అడుగుతుందని నాకు తెలుసు.

ఫిబ్రవరి 28న మహంతికి ఛీఫ్ సెక్రటరీగా చివరి రోజు. ఆయన నాకు బాధ్యతలు అప్పగిస్తారని అందరూ అనుకున్నారు. చివరి వారం కావడంతో మహంతికి వీడ్కోలు విందులు కూడా మొదలయ్యాయి. ఫిబ్రవరి 25న జూబ్లీ హిల్స్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో జరిగిన మహంతి వీడ్కోలు విందుకు నేను కూడా హాజరయ్యాను.

విందునుంచి తిరిగి వచ్చిన తర్వాత ఏఐసిసి ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దిగ్విజయ్ సింగ్ నుంచి ఫోన్ వచ్చింది. గతంలో ఎప్పుడూ

నేను దిగ్విజయ్ సింగ్ ను కలుసుకోలేదు. మరి ఎందుకు చేశారో తెలియదు కాని, 'మిస్టర్ కృష్ణారావ్, మీరే ఛీఫ్ సెక్రటరీ అవుతున్నారు. కంగ్రాచ్యులేషన్స్' అని దిగ్విజయ్ సింగ్ చెప్పారు.

'థాంక్స్ సర్' అని జవాబిచ్చాను. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచే ఫోన్ వచ్చిందంటే ఇంకేమని భావించాలి?

కాని కథ అనూహ్యంగా మలుపు తిరిగింది. ఫిబ్రవరి 26న మహంతీ ఢిల్లీ వెళ్లారు. ఎందుకు వెళ్లి ఉంటారో వేరే చెప్పనక్కర్లేదు. ఈ సమయంలో తనను మారిస్తే విభజన ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఆయన వారికి నచ్చచెప్పి ఉంటారు.

ఫిబ్రవరి 27 శివరాత్రి. నా శ్రేయోభిలాషి, సర్వీసులో నాకు సీనియర్ అయిన ఎం. వి. ఎస్. ప్రసాద్ గారు శంషాబాద్‌లో శారదా చంద్రమౌళీశ్వర దేవాలయానికి ధర్మకర్త. ఆయన ఆహ్వానం మేరకు ఆ రోజు సాయంత్రం నేను దేవాలయానికి వెళ్లాను. అక్కడ కూడా నాకు తెలిసిన వారు కనపడి అభినందనలు తెలిపారు. దేవాలయం నుంచి ఇంటికి తిరిగిరాగానే ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. ప్రధానమంత్రి కార్యాలయంలో నా బ్యాచ్ మేట్ ఆర్. రామానుజం కార్యదర్శిగా ఉన్నారు. ఆయన తమిళుడైనప్పటికీ మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన అధికారి.

'సారీ కృష్ణారావు, నిర్ణయం నీకు వ్యతిరేకంగా జరిగింది. పి. కె. మహంతీకి మూడు నెలలు ఎక్స్‌టెన్షన్ ఇవ్వడానికి నిర్ణయించారు.' అని ఆయన చల్లగా చెప్పారు. ఆయనేం చెబుతున్నారో ఒక్క క్షణం అర్థం కాలేదు.

'అదేమిటి రామానుజం, రేపు ఒక్క రోజే సమయం ఉంది కదా.. మహంతీని కొనసాగించాలన్నా సమయం ఎక్కడుంది?' అని నేను అడిగాను.

'ఆ విషయంలో జాగ్రత్తలు తీసుకున్నాం. పిఎంఓలో చర్చ జరిగింది. కేబినెట్ సెక్రటరీతో మాట్లాడారు. ఫైల్ రేపు ఉదయానికల్లా రెడీ అవుతుంది' అని రామానుజం చెప్పారు.

'ఓకే దెన్. ఏం చేస్తాం మరి..' అని జవాబిచ్చాను.

నాలో ఒక అంతర్గత లక్షణం ఉన్నది. నా మనస్సు గాయపడితే ఊరికే ఉండిపోయే మనస్తత్వం నాకు లేదు. చివరి వరకూ వచ్చి ఛీఫ్ సెక్రటరీ పదవి చేజారిపోవడం నాకు భావోద్వేగాన్ని కలుగజేసింది. వెంటనే ఫోన్ చేసి గవర్నర్‌గారి అపాయింట్‌మెంటు అడిగాను. ఫిబ్రవరి 28 ఉదయం నేను గవర్నర్ నరసింహన్‌ను కలిశాను.

ఆయన నన్ను చూడగానే ఏదో తప్పు జరిగిందన్న భావనతో కనిపించారు.

'ఏం సార్ ఇలా జరిగింది..' అని అడిగాను.

'దీన్ని మనసుమీద తీసుకోకండి కృష్ణారావు గారూ.. ఇవాళ కాకపోతే రేపు ఛీఫ్ సెక్రటరీ అవుతారు..' అని ఆయన నాకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.

నేనేమీ మాట్లాడకుండా తిరిగి వచ్చాను.

(ఫిబ్రవరి 26న ఢిల్లీలో మహంతి అంతర్గత భద్రత కార్యదర్శిని కలిసి ఛీఫ్ సెక్రటరీగా కొనసాగేందుకు తన అభీష్టాన్ని వ్యక్తం చేశారు. తదనుగుణంగా గవర్నర్ ఫిబ్రవరి 27న తన ఆమోదాన్ని తెలిపారు. దీనితో ఫిబ్రవరి 28 మధ్యాహ్నం 2 గంటలకు సిబ్బంది, శిక్షణ శాఖ మంత్రి వి. నారాయణ స్వామి ఫైల్ క్లియర్ చేయడం, ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సాయంత్రం 4. 30కి ఫైల్ పై సంతకం పెట్టడం, ఈ విషయాన్ని సాయంత్రం 5. 30కి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయడం జరిగింది. మహంతీ పదవీ కాలాన్ని నాలుగునెలల పాటు పొడిగిస్తూ ఆర్డర్ ను రాత్రి 10. 45కు జారీ చేశారు. మహంతీ ఛీఫ్ సెక్రటరీగా మర్నాటి నుంచీ మళ్లీ బాధ్యతలు స్వీకరించారు.)

ఏమైనప్పటికీ నాకు ఈ పదవి ఇచ్చే విషయంలో జరిగిన అవమానం మింగుడుపడలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయంలో నిరసన తెలుపుతూ లేఖ రాసి పది రోజులు సెలవులో వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపాను. మహంతీ పదవీ కాలం పొడిగింపుకు కేంద్రం తెలిపిన కారణాలు అఖిల భారత సర్వీసుకే అవమానకరమని నేను ఈ లేఖలో తెలిపాను.

'ఒక అధికారి పదవీకాలాన్ని పొడిగించాలంటే ఆ అధికారి అసాధారణ ప్రతిభ గలవాడై ఉండాలి. అదే సమయంలో ఆయన స్థానంలో అర్హుడైన వ్యక్తి

లభించకపోయే పరిస్థితి ఏర్పడాలి. అని రూల్సు చెపుతున్నాయి. కాని ప్రస్తుత నిర్ణయానికి ఈ రెండు కారణాలూ కనపడడం లేదు.' అని లేఖలో చెప్పాను. మళ్లీ పదవి చేపట్టిన మహంతీకే ఈ లేఖను సంధించాను. ఉమేశ్‌కుమార్‌కూ, దినేశ్ రెడ్డికి మధ్య కొనసాగుతున్న కేసులో మహంతీ నిర్వహించిన పాత్ర గురించి సుప్రీంకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానాలు చేసిన విషయాన్ని కూడా నేను ఈ లేఖలో ప్రస్తావించాను. రాష్ట్ర విభజనకు చెందిన విషయాలను రాష్ట్రానికి చెందిన వ్యక్తి కాకుండా ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి సమర్థంగా పరిష్కరిస్తారనుకోవడం ఆల్ ఇండియా సర్వీసులకే అవమానకరమని నేను లేఖలో వ్యాఖ్యానించాను.

మహంతీ పదవీ కాలాన్ని పొడిగించడంపై రాష్ట్ర హైకోర్టులో కూడా ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఒకటి దాఖలు అయింది.. చంద్రమౌళీశ్వర్ రావు, దివాకర్ బాబు అనే ఇద్దరు వ్యక్తులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి కొత్త ఛీఫ్ సెక్రటరీ నియామకం విషయంలో తన నిస్సహాయత వ్యక్తం చేసినందువల్ల గవర్నర్ జోక్యం కోరామని, ఆయన ప్రస్తుత ఛీఫ్ సెక్రటరీ పదవీ కాలాన్ని పొడిగించాలని నిర్ణయించారని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. విభజన క్రమం కొనసాగుతున్నందువల్ల ప్రస్తుత ఛీఫ్ సెక్రటరీ పదవీ విరమణ చేస్తే గందరగోళం తలెత్తుతుందని వాదించింది. చివరకు ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టి వేసింది.

ఈ లోపల ఎన్నికలు జరిగాయి. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చారు. నాకు ఛీఫ్ సెక్రటరీగా బహుశా అవకాశం ఇక రాదేమో అనిపించింది. ఆయన అస్మదీయులకు అందలమిస్తారు కాని నాకు ఛీఫ్ సెక్రటరీ పదవి ఇస్తారా అనుకున్నాను. రమేశ్‌కుమార్ గవర్నర్ దగ్గర ప్రత్యేక ఛీఫ్ సెక్రటరీగా ఉన్నారు. ఆయన కూడా ఛీఫ్ సెక్రటరీ కావడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నారని కొందరు మిత్రులు తెలిపారు.

చంద్రబాబునాయుడు తమ సామాజిక వర్గానికి ఛీఫ్ సెక్రటరీ పదవి ఇవ్వాలా లేక డీజీపీ పదవి ఇవ్వాలా అన్న విషయంపై తెలుగుదేశంలో అంతర్గత చర్చలు జరుగుతున్నాయని తెలిసింది. అదే సమయంలో ఆయన వర్గానికి చెందిన ఆపరేషన్స్ వింగ్ డీజీపీ జాస్తి వెంకట రాముడు డీజీపీ కావాలన్న ఆసక్తితో ఉన్నారు. చివరకు

అంతర్గత తర్జన భర్జనలు జరిగిన తర్వాత ఛీఫ్ సెక్రటరీగా తమ సామాజిక వర్గానికి చెందని అధికారిని, డీజీపీగా తమ సామాజిక వర్గానికి చెందిన అధికారిని నియమించాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. అప్పుడు నా పేరు మళ్లీ ముందుకు వచ్చింది. అదే సమయంలో ఐ. వి. సుబ్బారావు కూడా ఛీఫ్ సెక్రటరీ పదవి ఆశించారు. ఆయన కూడా చంద్రబాబుకు ఫోన్ చేశారు.

జెవి రాముడు నాకు మంచి స్నేహితుడు. ఆయన నేను ఛీఫ్ సెక్రటరీగా ఉంటేనే బాగుంటుందని కాబోయే సిఎంకు చెప్పారు. జెవి రాముడు పదవీ కాలం మరో రెండునెలలు మాత్రమే ఉన్నది. ఆయన పదవీకాలం రెండేళ్లు పొడిగించాలని నిర్ణయించారు. రాష్ట్ర విభజన రీత్యా చేయాల్సిన బృహత్తర కర్తవ్యాలు ఎన్నో ఉన్నాయి. మేమిద్దరమూ మంచి స్నేహితులం కనుక పరిపాలన సవ్యంగా, సమర్థంగా సాగుతుందని చంద్రబాబు భావించి ఉండవచ్చు. నేను సమర్థ అధికారినన్న అభిప్రాయం కూడా ఆయనకు ఏర్పడి ఉండవచ్చు.

చివరకు ఒక రోజు చంద్రబాబు సలహాదారు ఎం. సాంబశివరావు సిసిఎల్ఏ కార్యాలయంలో ఉన్న నాకు ఫోన్ చేశారు. 'మిమ్మల్ని ఛీఫ్ సెక్రటరీగా నియమించాలని చంద్రబాబు గారు నిర్ణయించారు.. వచ్చి సిఎంను కలుసుకోండి.' అని చెప్పారు.

జూన్ 1 న మహంతి పదవీ కాలం ముగిసింది. జూన్ 1న ఉమ్మడి రాష్ట్ర ఛీఫ్ సెక్రటరీగా ఆయన నుంచి పదవీ బాధ్యతలు చేపట్టాను. జూన్ 2న నేను ఆంధ్రప్రదేశ్ డిజిగ్నేటెడ్ సిఎస్ హోదాలో పనులు మొదలు పెట్టాను. ఎందుకంటే చంద్రబాబు నాయుడు జూన్ 7 వరకూ ప్రమాణ స్వీకారం చేయలేదు.

గవర్నర్ గారి పాలనలో విభజనకు అవసరమైన సన్నాహక పనులెన్నో జరిగాయి. ఫైళ్లను వేర్వేరు చేశారు. పెద్ద ఎత్తున వాటిని కాపీ చేయించి ఇరు రాష్ట్రాలకు ప్రతులను అంద జేశారు. గవర్నర్ నిర్వహించాల్సిన పాత్రను నిర్దేశించారు. గవర్నర్‌కు ఇద్దరు సలహాదారులను నియమించారు. తాత్కాలింగా సిబ్బంది విభజన జరిగింది. ట్రాన్స్ కో, జెన్ కో ను కూడా విభజించారు. సచివాలయాన్ని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ మధ్య విభజించారు. ఉద్యోగుల విభజన ప్రారంభమైంది.

తాత్కాలిక ప్రాతిపదికగా రెండు సెక్రటేరియట్‌లలో ఉద్యోగులను విభజించారు. హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్‌లు పనిచేయడం మొదలు పెట్టారు. ఐఏఎస్ అధికారుల విభజన ప్రారంభమైంది. ఐఏఎస్, అఖిల భారత సర్వీసు అధికారుల విభజన విషయంలో ప్రత్యూష్ సిన్హా నేతృత్వంలో తగ్గ విధానాల రూప కల్పన కూడా పూర్తయింది. షెడ్యూల్డు 10, 11 సంస్థల విభజన ఇంకా ప్రారంభం కాలేదు. కాని షెడ్యూలు 9 క్రింద ఉన్న సంస్థల ఆస్తులు, అప్పుల విభజనకు షీలా భిడే నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. షెడ్యూల్డు 10 సంస్థలకు అలాంటి విధానాన్ని దేన్నీ అనుసరించలేదు. ఉద్యోగుల విభజనను శాశ్వత ప్రాతిపదికన జరిపేందుకు కమలనాథన్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. విభజనకు ముందు జరిగిన వీటన్నింటిలో నాకే పాత్రా లేదు.

జూన్ 1 మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ ఛీఫ్ సెక్రటరీగా నేను బాధ్యతలు స్వీకరిస్తే జూన్ 2 ఉదయం రాజీవ్ శర్మ తెలంగాణ ఛీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. విభజనకు సంబంధించిన అంశాలపై ఇక్కడ ఏ పరిజ్ఞానం, అనుభవం లేని నేను, అక్కడ పూర్తి పరిజ్ఞానం, అనుభవం ఉన్న రాజీవ్ శర్మ ఉన్నారు. ఇందుకు కారణం రాజీవ్ శర్మ కేంద్ర హోంశాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్నారు. విభజన బిల్లును ఆయనే రచించారు. చట్టంలోని అన్ని సెక్షన్ల గురించి ఆయనకు తెలుసు. అంతేకాక రాష్ట్రానికి చెందిన ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులను రెండు రాష్ట్రాల మధ్య విభజించేందుకు ఏర్పడిన ప్రత్యూష్ సిన్హా కమిటీలో ఆయన భారత ప్రభుత్వం సభ్యుడుగా ఉన్నారు. విభజన క్రమంలో ఆయన పూర్తి స్థాయిలో పాత్ర పోషిస్తున్నారు. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌లో సీనియర్ అధికారి గా ఉన్నా నన్ను విభజన ప్రక్రియకు దూరంగా ఉంచారు. అంతా కొత్తగా ఉన్నది. తెలుసుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. కొత్త బాధ్యతలకు నన్ను సన్నద్ధం చేయాల్సి ఉన్నదని తెలిసినా మహంతి పట్టించుకోలేదు.

నేను ఛీఫ్ సెక్రటరీ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే మొదటి ఆరునెలలు విభజనకు సంబంధించిన అనేక అంశాలను పరిశీలించడం, విశ్లేషించడం తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలతో వాటిపై పోరాడడంతోనే సరిపోయింది.

మొదటివారం అంతా మేము రాష్ట్ర కాబినేట్ ప్రమాణస్వీకారానికి కావలసిన ఏర్పాట్లు చేయడంలో తలమునకలైనాము. నాగార్జున విశ్వవిద్యాలయానికి ముందున్న సువిశాల ప్రాంగణాన్ని ఈ మహోత్సవం జరపడానికి స్థలంగా నిర్ణయించాము.

ఏర్పాట్లు పెద్దపెట్టున చేశాము. చాలా జనవాహిని వస్తారని అంచనా వేశాము. ముఖ్యమంత్రిగారు స్వయంగా ఫోను చేసి చాలమందిని ఆహ్వానించారు. తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితగారికి ఫోన్ చేస్తే ఆమె ఎత్తలేదు. అది వేరే విషయం. జూన్ 7న ప్రమాణ స్వీకారం సాయంత్రం ముహూర్తం నిర్ణయింపబడింది.

నాకు తెలిసిన కొందరు మీరు టిటిడి కార్యనిర్వహణాధికారిగా వున్న సమయంలో చక్కగా లాల్చీ పంచా ధరించేవారు. ఆ వస్త్ర ధారణ మీకు నప్పింది. ప్రమాణ స్వీకార సమయంలో కూడా ఆ వస్త్రధారణతో రండి బాగుంటుందని సలహా యిచ్చారు. నాకు నచ్చి పాటిద్దామని అనుకున్నాను. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతం ముఖ్యమంత్రిగారు వచ్చి అక్కడనే ఉన్న లింగంపల్లి ఎస్టేటులో విడిది చేశారు. నాలుగు గంటల ప్రాంతంలో లాల్చీపంచె ధరించి వారి దగ్గరకు వెళ్ళాను. వారు నన్ను ఎగాదిగా చూచారు. నేను ఈ వస్త్రధారణ నూతనంగా ఉంటుందని వేశానన్నాను. వారు నా సమస్య అది కాదు. మీరు ఆ డ్రెస్‌లో ఉండి నేను ఫాంటు షర్ట్‌లో ఉంటే చూచే జనాలు మిమ్మల్ని నేను పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తున్నాననుకుంటారని అన్నారు.

ప్రమాణస్వీకార సమయానికి ముఖ్యమంత్రి కుటుంబసభ్యులు, ఇతరులు చాలామంది వచ్చారు. కొంత కట్టడి చెయ్యడం సమస్య అయింది. జనసందోహంలో కొందరు వి.ఐ.పి.లు చిక్కుకున్నారు. మొత్తంమీద ప్రమాణ స్వీకారం కొంత రసాభాసగా ముగిసింది.

# [ 2 ]

# ప్రత్యూష్ సిన్హా పక్షపాత వైఖరి

జూన్ 2 నాటికే విభజనకు సంబంధించిన కొన్ని చర్యలు ప్రారంభమయ్యాయి. సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు మహంతీ ఛీఫ్ సెక్రటరీగా ఉన్న కాలంలోనే అఖిల భారత సర్వీసు అధికారుల విభజనకు ప్రాతిపదికను స్థూలంగా నిర్ణయించారు.

ఐఏఎస్ అధికారుల విభజనకు సంబంధించి మౌలిక సూత్రాలు మహంతి ఛీఫ్ సెక్రటరీగా ఉన్న కాలంలోనే ఖరారు అయిన తీరు ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా లేదు. వారు జిల్లాల సంఖ్య ఆధారంగా విభజన జరగాలని నిర్ణయించారు. ఆంధ్రాలో 13 జిల్లాలు, తెలంగాణలో 10 జిల్లాలు ఉన్నాయి కనుక ఆ నిష్పత్తిలో విభజన ప్రారంభించారు. నిజానికి ఈరకమైన విభజన సరైంది కాదు. ఐ.ఏ.ఎస్. కేడరు సంఖ్యలో జిల్లా పోస్టులు చాలా తక్కువ. ఎక్కువ పోస్టులు సచివాలయంలో డైరెక్టరేట్లలో ఉంటాయి. కనుక జిల్లాల సంఖ్య ఆధారంగా విభజన చేయడంలో ఔచిత్యం లేదు. 13:10 నిష్పత్తిలో కాకుండా మరో ప్రాతిపదిక పాటించి ఉంటే సముచితంగా ఉండేది. ఏమైనా ఈ నిర్ణయం తెలంగాణకు అనుకూలంగా జరిగినట్లు నాకు అనిపించింది.

నేరుగా రిక్రూట్ అయిన ఇన్‌సైడర్ అధికారులు, ప్రమోటయిన అధికారులను వారి వారి ప్రాంతీయత ఆధారంగా కేటాయించాలని నిర్ణయించారు. ఒక రాష్ట్రానికి కేటాయించిన పోస్టుల సంఖ్య కంటే ఎక్కువ మంది అధికారులు ఆ రాష్ట్రానికిఈ విధానంలో కేటాయించబడితే వారిని జూనియర్ ఆఫీసర్లతో మొదలుపెట్టి తిరిగి రెండవ రాష్ట్రానికి పోస్టులు వ్యక్తులు సరిపోయేదాకా తిరిగి కేటాయిస్తారు. వారు

ఇతర రాష్ట్రానికి వెళ్లాల్సి ఉంటుంది.. ఇది ఛత్తీస్ ఘడ్ తదితర రాష్ట్రాల విభజన సమయంలో అవలంబించిన ప్రాతిపదిక. ఇక్కడ కూడా నేటివిటీని ప్రాతిపదికగా తీసుకున్నారు. స్థానిక అధికారుల విభజన పెద్ద సమస్య కాలేదు. ఎందుకంటే అది నేటివిటీ ఆధారంగా జరిగింది. అదనంగా ఉన్న వారు ఇతర రాష్ట్రానికి వెళ్లడమో, లేక వారు అభ్యర్థన చేసుకుంటే సర్దుబాటు చేయడమో జరిగింది. ఇక అవుట్ సైడర్స్‌కు సంబంధించి రోస్టర్ ప్రకారం వెళ్లాల్సిందే. రోస్టర్ అనేది సంక్లిష్ట ప్రక్రియగా మారింది. రిజర్వేషన్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చింది. రోస్టర్‌ను ఎక్కడి నుంచి ప్రారంభించాలి అన్నది ప్రధానమైన ప్రశ్న. లాటరీ ప్రకారం వెళ్లాలని చివరకు నిర్ణయించారు. నేను ఛీఫ్ సెక్రటరీ అయిన తర్వాత హాజరైన ప్రత్యూష్ సిన్హా కమిటీ రెండో సమావేశంలోనో, మూడో సమావేశంలోనో రోస్టర్ అంశం ప్రస్తావనకు వచ్చింది. రోస్టర్ ప్రకారం లాటరీ తీసినప్పుడు లాటరీలో తెలంగాణ వచ్చింది. దీనితో తొలి అధికారి తెలంగాణకే వెళతారని అందరూ అనుకున్నారు. అక్కడినుంచే అందరూ లెక్కలు వేసుకుని తాము ఏ ఏ రాష్ట్రానికి వెళతామో నిర్ణయించుకున్నారు. అలాగే జరిగి ఉంటే రాజీవ్ శర్మ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన అధికారి అవుతారు.

కాని తర్వాత జరిగిన కమిటీ సమావేశంలో తేలిందేమంటే లాటరీలో తెలంగాణ వస్తే, నియామకాలు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రారంభిస్తారన్న విషయం. గతంలో ఇతర రాష్ట్రాల విభజన జరిగినప్పుడు ఒక రాష్ట్రం లాటరీలో వస్తే మరో రాష్ట్రం నుంచి నియామకాలు జరగాలని నిర్ణయించారట. ప్రత్యూష్ సిన్హా కమిటీ పాత కమిటీ సమావేశాల మినిట్స్ తీసి దాని ప్రకారం వెళ్లింది. ఈ విషయం తెలియని అధికారులు చాలా మంది నియామకాలు కూడా తెలంగాణనుంచే ప్రారంభమవుతాయని భావించి లెక్కలు వేసుకుని, తామెక్కడెక్కడికి వెళుతున్నామో తామే నిర్ణయించుకుని అలా జరగకపోవడంతో నిరాశ చెందారు. అంతా గందరగోళం నెలకొన్నది..

ఐఏఎస్ అధికారుల నియామకం విషయంలో తేడా తెచ్చిన మరో అంశం పి. కె. మహంతీని పదవిలో ఉన్న అధికారిగా భావించాలా, లేక, పదవీ విరమణ చెందిన అధికారిగా భావించాలా అన్నది. ప్రత్యూష్ సిన్హా కమిటీ మహంతీని పదవిలో లేని అధికారిగా భావిస్తే లెక్కల్లో తేడా వచ్చి రాజీవ్ శర్మ తెలంగాణలోనే

ఉంటారు. మహంతీని రిటైర్డ్ అధికారిగా భావించకపోతే రాజీవ్ శర్మ ఆంధ్రాకు వెళ్లాల్సి వస్తుంది. ఈఅంశంలో పి. కె. మహంతీని ప్రత్యూష్ సిన్హాపరిగణనలోకి తీసుకోలేదు. ఇది వివాదాస్పదమని చాలా మంది భావించారు. పికె మహంతీని పరిగణనలోకి తీసుకోవడానికి బలమైన న్యాయపరమైన కారణాలున్నాయని, కనీసం అటార్నీ జనరల్ అభిప్రాయం తీసుకోకుండా మహంతీ పేరును పరిగణించకపోవడం సరైంది కాదని చాలా మంది భావన.

ప్రత్యూష్ సిన్హా ఉద్దేశ పూర్వకంగా ఒక పక్షానికి అనుకూలంగా వ్యవహరించడం స్పష్టంగా కనపడింది. కమిటీలో నేను కాక ప్రత్యూష్ సిన్హా, తెలంగాణ చీఫ్ సెక్రటరీ రాజీవ్ శర్మ ఉన్నారు. వారిద్దరూ ఒకటే కావడంతో నేను ఎన్నో వాదనలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ప్రత్యూష్ సిన్హా కమిటీకి ఎన్నో ఉత్తరాలు కూడా రాశాను. ప్రత్యూష్ సిన్హా కమిటీలో వాగ్వివాదాలు సీరియస్ గా జరిపిన మరో అంశం జీవిత భాగస్వామి కూడా అధికారి అయినప్పుడు ఆమె / ఆయన సీనియారిటీని ఎలా పరిగణించాలన్నది. జీవిత భాగస్వామి వృత్తిని నిర్వహించినప్పటినుంచీ సీనియారిటీని పరిగణించాలా లేక పెళ్లి తర్వాత కేటాయించిన రాష్ట్రంలో సీనియారిటీని పరిగణించాలా అన్న దానిపై చర్చలు సాగాయి. కంబైన్డ్ లిస్ట్‌లో జీవిత భాగస్వామి పై స్థాయిలో ఉండవచ్చు. జీవిత భాగస్వామి తన భర్త లేదా భార్యకు కేటాయించిన రాష్ట్రానికి వస్తే చివరి అధికారి స్థాయికి వస్తారు. కంబైన్డ్ లిస్టు ప్రకారం కేటాయిస్తే ఒక రాష్ట్రానికి వస్తారు. పెళ్ళి అయిన తరువాత రాష్ట్రం మారిన సీనియారిటీ పరిగణనలోకి తీసుకుంటే వేరే రాష్ట్రంలోకి వెళతారు. జీవిత భాగస్వామి రాష్ట్రంలో చేరిన తర్వాత నుంచి సీనియారిటీని పరిగణించాలని ప్రత్యూష్ సిన్హా మొదట నిర్ణయించారు. తదనుగుణంగా సీనియారిటీని పరిగణనలోనికి తీసుకొని జాబితాను తయారు చేశారు.

తర్వాత కంబైండ్ మెరిట్‌తో సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని జాబితాను సవరించారు. దీని వెనుక కొందరు బలమైన అధికారుల ప్రమేయం ఉన్నదని నాకు తెలుసు. ఇది ప్రధానంగా ఆందోళన కలిగించింది. కేడర్ అనేది ప్రభుత్వం ఖరారు చేసింది కనుక రాష్ట్ర సీనియారిటీ ప్రకారం వెళ్లాలని నేను వాదించాను. ఆయన దానికి అభ్యంతరం వ్యక్తం చేశారు.

దీనితో నేను కచ్చితంగా చెప్పాను. 'ఈ విషయంలో మీరు వైఖరి తీసుకున్నట్లయితే మనం రోస్టర్ పద్ధతి కూడా పునఃపరిశీలించాలి. మీరు మహంతీని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? మహంతి పదవిలో ఉన్నట్లు పరిగణించితే మొత్తం రోస్టర్ మారిపోతుంది. మీ నిర్ణయాన్ని నేను విభేదిస్తున్నాను కనుక ఈ వివాదాన్ని నిబంధనల ప్రకారం అటార్నీ జనరల్‌కు నివేదించాలి కదా.' ఆ పనిచేద్దాం. అన్నాను.

ఇలా అనేక అంశాలపై కమిటీ సమావేశాల్లో వాగ్వివాదాలు జరిగాయి. చివరకు ఈ అంశాలపై నేను నా నిరసన నోట్ ను కూడా ప్రత్యూష్ సిన్హాకు సమర్పించక తప్పలేదు. అది ఆయనకు నచ్చలేదు.

ఏమైనప్పటికీ ఐఏఎస్ అధికారుల విభజన రెండు రాష్ట్రాల మధ్య న్యాయపూరితంగా, సమానంగా జరగలేదు. తెలంగాణ పక్షానికే అనుకూలంగా జరిగింది. మిగతా అన్ని విషయాల్లో జనాభా నిష్పత్తిని ప్రాతిపదికగా తీసుకుని కేవలం ఐఏఎస్ అధికారుల విషయంలోనే జిల్లాల నిష్పత్తిలో తీసుకున్నప్పుడే ఏపీకి నష్టం జరిగింది. నేను పదవీ బాధ్యతలు స్వీకరించే నాటికే మార్గదర్శక సూత్రాలు నిర్ణయం కావడంతో నేను చేసేది ఏమీ లేకుండా పోయింది. అనుసరించిన ప్రాతిపదిక, కొందరు అధికారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఆ తర్వాత వరుసగా తీసుకున్న నిర్ణయాల వల్ల ఏపీ ప్రయోజనాలు దెబ్బతిన్నాయి. అంతేకాక హైదరాబాద్ తెలంగాణ రాజధాని కావడంతో చాలా మంది తెలంగాణలో ఉండేందుకు ఇష్టపడడం, వారి ప్రయోజనాలను ప్రత్యూష్ సిన్హా కాపాడడం కూడా ఏపీకి నష్టం కలిగించింది.

కేంద్ర అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్ (క్యాట్) కూడా ప్రత్యూష్ సిన్హా తీసుకున్న నిర్ణయాలను, అనుసరించిన ప్రాతిపదికను తీవ్రంగా తప్పు పట్టింది. అప్పటికే ఐఏఎస్ అధికారుల విభజన అంశం ఏదో రకంగా సెటిల్ అయి, అంతా తమ తమ స్థానాల్లో పనిచేయడానికి వెళ్లడంతో క్యాట్ అభిశంసన పర్యవసానాలేమీ జరగలేదు. సమయం సమస్యలను చాలామటుకు పరిష్కరించింది. కాని అధికారుల విభజన హేతుబద్ధంగానూ, పారదర్శకంగాను జరుగలేదన్న విషయం రికార్డు అయింది. నా అభిప్రాయాలే సరైనవని తేలింది.

# [ 3 ]

# సెక్షన్ 8కి కాలదోషం ఎందుకు పట్టింది?

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 8 కి చివరకు కాలదోషం పట్టింది. ఇందుకు కారణం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే అని విషయాలను లోతుగా పరిశీలించిన వారెవరికైనా తెలుస్తుంది. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా నిర్ణయించినందువల్ల సెక్షన్ 8కి ప్రాధాన్యత ఏర్పడింది. ప్రధానంగా ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి హైదరాబాదులో స్థిరపడిన వారి ప్రాణధన ఆస్థిపరిరక్షణకు ఉద్దేశించబడిన సెక్షన్ సెక్షన్ 8.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం హైదరాబాద్ పదేళ్ల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా ఉండాలి. ఉమ్మడి రాజధానిలో పరిపాలనకు సెక్షన్ 8 వీలు కల్పిస్తుంది. ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల స్వేచ్ఛను, ఆస్తులను కాపాడే బాధ్యతను గవర్నర్‌కు అప్పగించారు. ముఖ్యంగా శాంతి భద్రతలు, అంతర్గత భద్రత, కీలక ప్రదేశాల భద్రత, ప్రభుత్వ భవనాల నిర్వహణ, కేటాయింపు గవర్నర్ బాధ్యత. తెలంగాణ మంత్రి మండలిని సంప్రదించిన తర్వాత ఆయన స్వంత విచక్షణను ఉపయోగించి, నిర్ణయం తీసుకుంటారు.

గవర్నర్‌కు సలహాదారులుగా ఇద్దరు సలహాదారులను నియమించే ఏర్పాటు కూడా సెక్షన్ 8లో ఉన్నది. ఈ చట్టం ప్రకారం అవసరమైన నిబంధనలను రూపొందించాలని, హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు, ప్రజల రక్షణ

విషయంలో ఆయన అధిక పాత్ర నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించింది. అందువల్ల తగిన నిబంధనలను రూపొందించాలని మేము కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాము. అదే విధంగా సెక్షన్ 8 సమర్థవంతంగా అమలు కావాలి అంటే హైదరాబాద్ నగర పోలీసు వ్యవస్థలో రెండు రాష్ట్రాల పోలీసులకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని మేము కోరాము.

కాని దీన్ని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రతిఘటించింది. హైదరాబాద్ నగరం పూర్తిగా తెలంగాణలో ఉన్నందువల్ల, శాంతి భద్రతలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ అంశమని, ఈ విషయంలో గవర్నర్‌కు ఎలాంటి నిర్దిష్టమైన పాత్ర లేదని చెప్పింది. సెక్షన్ 8 క్రింద ఎటువంటి ప్రత్యేక నిబంధనలను రూపొందించేందుకు వీలు లేదని తెలిపింది. మరి కేంద్ర ప్రభుత్వం నియమించిన సలహాదారులకే ఎటువంటి పాత్ర లేనప్పుడు చట్టంలో సెక్షన్ 8ని చేర్చినందువల్ల వచ్చే ప్రయోజనమేమిటని ఏపీ ప్రభుత్వం వాదించింది.

సెక్షన్ 8 విషయంలో నాకు అప్పుడు కేంద్రంలో హోం సెక్రటరీగా ఉన్న అనిల్ గోస్వామితో వాగ్వివాదం జరిగింది. అనిల్ గోస్వామి పూర్తిగా తెలంగాణకు అనుకూలంగా కనపడ్డారు. రెండు రాష్ట్రాలనుంచీ పోలీసు బలగాలను సేకరించి గవర్నర్ ఆధ్వర్యంలో పనిచేయించాలన్న అంశాన్ని నేను ఆయనతో ప్రస్తావించినప్పుడు 'ఆత్మ గౌరవం ఉన్న ఏ ప్రభుత్వమూ వేరే రాష్ట్ర పోలీసు బలగాలు తమ రాష్ట్రంలో పనిచేయాలని కోరుకోదు...' అని స్పష్టం చేశారు.

'అలాంటప్పుడు రాష్ట్రాన్ని విభజించమని మిమ్మల్ని ఎవరు అడిగారు? ఈ సెక్షన్‌ను ఎందుకు చేర్చారు?' అని నేను ప్రశ్నించాను. 'హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆంధ్రా, ఇతర ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు చేర్చిన ఈ సెక్షన్‌ను ఇప్పుడెందుకు విస్మరిస్తున్నారు? ' అని నేను అడిగాను

నేను ఇలా నిలదీస్తానని కేంద్ర హోం సెక్రటరీ ఊహించి ఉండరు. నేను అడిగిన తీరుకు ఆయన తీవ్ర అసహనాన్ని ప్రదర్శించారు. నేను కేంద్ర కేబినెట్ సెక్రటరీని కూడా కలిశాను. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ హైదరాబాద్ వచ్చినప్పుడు కూడా ఆయనను కలుసుకున్నాను. కొన్ని సంఘటనల గురించి కూడా వివరించి వినతిపత్రం సమర్పించాను.

నిజానికి పునర్వ్యవస్థీకరణ చట్టానికి సంబంధించిన అనేక అంశాల పరిష్కారం భారత ప్రభుత్వ స్థాయిలో కావాల్సి ఉన్నది కనుక కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ముఖ్యంగా హోం సెక్రటరీల పాత్ర ఎంతో కీలకమైనది. నేను ఛీఫ్ సెక్రటరీగా పదవిని స్వీకరించే నాటికి కేంద్ర హోం సెక్రటరీగా ఉన్న అనిల్ గోస్వామి పూర్తిగా తెలంగాణ పక్షం ఉన్నట్లు కనపడ్డారు. అసలు అప్పుడు పదవిలో ఉన్న హోం సెక్రటరీలు కానీ, హోం విభాగం కానీ కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ అవసరాల పట్ల సానుకూలంగా వ్యహరించలేదు. ఇందుకు ఒక కారణం తెలంగాణ ఛీఫ్ సెక్రటరీ రాజీవ్ శర్మకు హోంమంత్రిత్వ శాఖలో వారితో కలిసి పనిచేసిన అనుభవం ఉండడం. ఏఅంశాన్ని కూడా పరిష్కరించేందుకు హోంసెక్రటరీ ఆసక్తి ప్రదర్శించలేదు. పైగా తెలంగాణ ప్రభుత్వం పట్ల సానుకూలంగా వ్యవహరించారు. ఏపీ ముఖ్యమంత్రికీ, ఢిల్లీలో ఉన్న ఏపీకి చెందిన కేంద్రమంత్రులకూ ఈవిషయం చెప్పినప్పటికీ ఫలితం లేకపోయింది.

అదృష్టవశాత్తు కొద్ది కాలం లో అనిల్ గోస్వామి పదవి కోల్పోయి ఆయన స్థానంలో ఎల్ సి గోయల్ హోం సెక్రటరీగా వచ్చారు. ఆయన నా బ్యాచ్ మేట్ కావడంతో భారత ప్రభుత్వం సహాయంతో అనేక సమస్యలను మేము సానుకూలంగా పరిష్కరించుకోగలిగాం. కాని 6 నెలల తర్వాత ఆయన స్థానంలో వచ్చిన హోంసెక్రటరీ విభజన అంశాల గురించి పూర్తిగా ఉదాసీనంగా వ్యవహరించారు. కనీసం రెండు రాష్ట్రాల మధ్య సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా ఆసక్తి ప్రదర్శించలేదు. 'తాంబూలాలిచ్చాం. తన్నుకు చావండి' అన్నట్లు గా వ్యవహరించారు దీనితో మేము పరస్పర సర్దుబాటు ద్వారానో, కోర్టు ద్వారానో సమస్యలను పరిష్కరించుకున్నాం.

ఇక ఏడాది తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఈలోపు చంద్రబాబు నాయుడు రాజధానిని హైదరాబాద్‌నుంచి విజయవాడ తరలించాలని నిర్ణయించారు. ఒక సారి రాజధానిని విజయవాడ తరలించిన తర్వాత సెక్షన్ 8 అనే దానికి ప్రాధాన్యత లేకుండా పోయింది. దానికి కాలదోషం పట్టింది. 'మీ ప్రభుత్వమే ఇక్కడ లేనప్పుడు సెక్షన్ 8 అవసరం ఏమున్నది..' అన్న వాదన కేంద్ర ప్రభుత్వంలో వినిపించింది. కనుక ఆ అంశాన్ని నిశ్శబ్దంగా సమాధి చేశారు.

మరో వైపు గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజల ఆస్తులు, శాంతిభద్రతల విషయంలో తెలంగాణ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యవహరించిన తీరు ప్రశంసనీయం. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా వ్యవహరించగలమన్న విశ్వాసం ప్రజల్లో కలిగింది. సెక్షన్ 8 అమలులో లేదన్న విషయం అందరూ మరిచిపోయారు. సామాన్య ప్రజలు ఈ విషయం పెద్దగా పట్టించుకోనే లేదు.

కాని చంద్రబాబు నాయుడే ముందుగా అనుకున్న ప్రకారం పదేళ్లు ఉమ్మడి రాజధాని అయిన హైదరాబాద్‌లో కొనసాగి ఉంటే పరిస్థితులు వేరుగా ఉండేవి.

అమరావతిలో రాజధాని నిర్మాణం పూర్తయ్యేంతవరకూ హైదరాబాద్‌లోనే ఉండాలని మొదట్లో బలంగా నిర్ణయించుకున్న చంద్రబాబునాయుడు ఎందుకు ఏడాదిలోపే తన నిర్ణయాన్ని మార్చుకున్నారు? దీనికి బలమైన కారణాలున్నాయి.

అధికారంలోకి వచ్చిన తొలి కొద్ది నెలలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనో భావాలను బట్టి చూస్తే, ఆయనకు హైదరాబాద్‌నుంచి ఇప్పటికిప్పుడే వెళ్లిపోయి విజయవాడ నుంచి పనిచేయాలన్న అభిప్రాయం ఉండేది కాదని అర్థమయింది. హైదరాబాద్‌నుంచి వెళ్లిపోవాలన్న సంకేతాలు ఆయన ఎప్పుడూ తొలి నెలల్లో మాకు ఇవ్వలేదు. 'మనం హైదరాబాద్‌నుంచే చాలా కాలం పనిచేయాల్సి ఉంటుంది' అని ఆయన చెబుతూ ఉండేవారు. 'రాజధానిని తరలించే నిర్ణయం తీసుకునేటప్పుడు హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంధ్ర ప్రజల ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి.' అని ఆయన ఒక సందర్భంలో చెప్పారు.

ఉమ్మడి రాజధాని అయిన హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆంధ్ర ప్రదేశ్‌కూ, తెలంగాణకూ బ్లాకులు అలాట్ అయ్యాయి. గవర్నర్, ఆయన సలహాదారులు ఆంధ్రప్రదేశ్‌కు హెచ్, ఎల్ బ్లాక్ లు అలాట్ చేశారు. వాటిలో హెచ్‌బ్లాక్ ముఖ్యమంత్రి కార్యాలయానికి కేటాయించారు. కాని కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాను హెచ్ బ్లాక్ నుంచి పనిచేయనని సిఎం స్పష్టం చేశారు. వాస్తు ప్రకారం హెచ్ బ్లాక్ సరైంది కాదని అన్నిటికన్నా ఎత్తైన ఎల్ బ్లాక్ లోని 8 వ అంతస్తు నుంచి పనిచేస్తానని ఆయన నిర్ణయించారు. మేము ఎల్ బ్లాక్ ను సందర్శించాం. అక్కడ అప్పటికే కొన్ని సెక్షన్లు పనిచేస్తున్నాయి. వాటిని ఖాళీ

చేసి మరో చోటికి మారాల్సిందిగా సిబ్బందిని అభ్యర్థించాం. ఎల్ బ్లాక్ సిఎం అభీష్టానికి అనుగుణంగా పునర్నిర్మించడం ప్రారంభమైంది. 7వ ఫ్లోర్ లో ఛీఫ్ సెక్రటరీ కార్యాలయం, 8 వ ఫ్లోర్ లో ముఖ్యమంత్రి కార్యాలయం ఉండాలని నిర్ణయించాం. వేగంగా పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 7వ ఫ్లోర్ లోనే తాత్కాలికంగా నేను చిన్న గదిలో చేరి విధినిర్వహణలో నిమగ్నమయ్యాను. ముఖ్యమంత్రి లేక్ వ్యూ గెస్ట్ హౌజ్ నుంచి పని ప్రారంభించారు. ఎల్ బ్లాక్ పునర్నిర్మాణానికి భారీ ఎత్తున ఖర్చు పెట్టారు. అత్యధునాతనంగా బ్లాక్ రూపు దిద్దుకుంది.

విజయదశమి నాటికి మేము కొత్త బ్లాక్ లోకి మారిపోయాం.

చంద్రబాబు నాయుడు తొలి నెలల్లో హైదరాబాద్‌లోనే ఉండిపోవాలన్న బలమైన ఆకాంక్షను వ్యక్తం చేయడమే కాకుండా తెలంగాణ పట్ల ప్రత్యర్థి వైఖరిని అవలంబించారు. ఇందుకు ఉదాహరణ– రెండు రాష్ట్రాలకు వర్తించే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను గౌరవించే బదులు వాటిని రద్దు చేసి అదనపు విద్యుత్ ను తెలంగాణతో పంచుకోకూడదని ఆయన నిర్ణయించడం. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం విద్యుత్ ప్లాంట్లు ఎక్కడఉన్నాయనే ప్రాతిపదికపై జెన్కో యూనిట్లను విభజించాలి. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రాజెక్టులకు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను కొనసాగించాలి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి అదనపు విద్యుత్ ఉంటుందని, తెలంగాణకు విద్యుత్ లోటు ఉంటుందని అందరికీ తెలిసిన విషయమే. విద్యుత్ ఉత్పాదన కంపెనీలన్నీ ఏపీలో ఉండడమే ఇందుకుకారణం. అందుకే సమైక్య రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు రెండు రాష్ట్రాలకు వర్తిస్తాయని చట్టం పేర్కొంది. అయితే రాజకీయ స్థాయిలో మాత్రం ఈ ఒప్పందాల్ని రద్దు చేసి ఏపీ నుంచి తెలంగాణకు విద్యుత్ లభ్యమయ్యేలా చూడకూడదన్న ఆలోచన కలిగింది. ఈ ఆలోచనకు నేను వ్యతిరేకం. ఎందుకంటే చట్టం ప్రకారం పీపీఏలకు సంబంధించినంత మేరకు ఏపీలో ఉన్న అదనపు విద్యుత్ ను తెలంగాణకు లభ్యమయ్యేలా చూడాలని చట్టం స్పష్టం చేసింది. కాని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్ని రద్దు చేసి అదనపు విద్యుత్‌ను తెలంగాణతో పంచుకోకూడదని నిర్ణయించారు. నేను హేతుబద్ధంగా ఆలోచించాలన్న సలహాను ఆయన పాటించలేదు. ఇది చాలా

తీవ్ర సమస్యలకు దారితీసింది. ఈ ఒక్క నిర్ణయమే రెండు రాష్ట్రాల మధ్య ఎక్కువ అగాధాన్ని సృష్టించింది. సంబంధాలను బాగా దెబ్బతీసింది. ఆ కాలంలో తెలంగాణ విద్యుత్ విషయంలో తీవ్ర కొరతను ఎదుర్కొంది.

ఈ సంఘటన తర్వాత తెలంగాణ ప్రభుత్వం సచివాలయంలో రెండు రాష్ట్రాల భవనాల మధ్య బారికేడ్లను నిర్మించింది. అప్పటివరకూ సచివాలయంలో స్వేచ్ఛగా తిరిగే అనేకమంది ఉద్యోగుల మనోభావాలు దీనితో దెబ్బతిన్నాయి. ఈ విషయం నేను తెలంగాణ మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకువచ్చాను.

'బారికేడ్లు ఎందుకండీ.. లేకపోయినా వచ్చే సమస్య ఏమి లేదు కదా..' అని నేను అన్నాను.

'మీ ముఖ్యమంత్రి మాకు విద్యుత్ సరఫరా ఆపు చేసేందుకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేయడం మాత్రం సరైనదా..' అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

తెలంగాణ పట్ల ఇంత కఠినమైన వైఖరి అవలంబించిన చంద్రబాబు నాయుడు తర్వాత తెలంగాణ ఏపీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా ఎందుకు మెతక వైఖరి అవలంబించారో ఇంకో చోట పరిశీలిద్దాం

# [ 4 ]

# సంస్థలు, ఉద్యోగుల విభజనలో సవాళ్లు

ఆంధ్ర ప్రదేశ్ విభజన అనేది విచిత్రమైనది. ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన వారు రాజధానికి దూరంగా ఉన్నారు. ఛత్తీస్ ఘడ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ రాష్ట్రాలు కావాలని ఉద్యమించిన ప్రాంతాల్లో సమైక్య రాష్ట్ర రాజధానులు లేవు. అవి తమ నూతన రాజధానులను, అందులో కొత్త సంస్థలను ఏర్పర్చుకోవాల్సి వచ్చింది. వాటికి పాత రాజధానుల్లోని సంస్థల్లో వాటాలను అడిగే అవకాశం లేకుండా పోయింది. విభజించడమే మహా ప్రసాదంగా భావించి, వారి ప్రాంతాలకు వెళ్లిపోయి పనులు ప్రారంభించుకున్నారు. ఉమ్మడి రాజధానిలో వాటా అడగలేదు, కేంద్రం ఇవ్వనూ లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని ఉన్న ప్రాంతం నుంచి విభజన కోసం ఉద్యమం ప్రారంభమైంది. కనుక కొత్త ఆంధ్ర ప్రదేశ్ రాజధాని నుంచి దూరంగా వెళ్లి పోవాల్సి వచ్చింది. అందువల్లే రాజధానిలో ఉన్న సంస్థల్లో వాటా కోసం అడగాల్సిన అవసరం ఏర్పడింది. 'మమ్మల్ని మీరు వెళ్లిపొమ్మన్నారు. మా వాటా మాకివ్వండి. మేము వెళ్లిపోతాం..' అన్నది మా వైఖరి.

దీన్ని ఎలా సాధించుకుంటాం.. ? వీటికి సంబంధించి పునర్వ్యవస్థీకరణ చట్టంలో షెడ్యూలు 9, షెడ్యూలు 10 ని చేర్చారు. షెడ్యూలు 9 వాణిజ్య సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించింది. షెడ్యూలు 10 అధికంగా యూనివర్సిటీలు, శిక్షణా సంస్థలకు సంబంధించింది. షెడ్యూలు 10లో కొన్ని అర్థం పర్థం లేని వాటిని కూడా

అశాస్త్రీయంగా చేర్చారు. స్టేట్ ఎన్నికల సంఘం, ఏపీ వెనుకబడిన వర్గాల కమిషన్, ఏపీ మహిళా కమిషన్ లను షెడ్యూలు 10లో చేర్చాల్సిన అవసరం లేదు. ఇవి చాలదన్నట్లు మరి కొన్ని సంస్థలను కూడా ఈ షెడ్యూల్‌లో అనవసరంగా చేర్చారు. నిజానికి ఇలాంటి సంస్థలు షెడ్యూల్ 10లో చేర్చదగ్గవి కావు.

9వ షెడ్యూలులో ఉన్న సంస్థలు మాత్రం జిల్లాల్లో ఉన్న సంస్థల యూనిట్లు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికి చెందాలని నిర్ణయించారు. రాజధానిలో ఉన్న కేంద్ర కార్యాలయాలను జనాభా నిష్పత్తి ప్రకారం అంటే 58:42లో పంచాలి. భవనాలు, ఆస్తులు, సిబ్బందిని ఈ నిష్పత్తి లో విభజించాల్సి ఉన్నది. కాని కేంద్ర కార్యాలయ నిర్వచనం ఏమిటన్న అంశంపై వివాదాలు నెలకొన్నాయి.

ఇక 10వ షెడ్యూలు సంస్థల విషయంలో హైదరాబాద్‌లో కేంద్ర కార్యాలయాలు ఉన్న సంస్థలు తమ భూభాగంలో ఉన్నందువల్ల తమవేనని, వాటి సౌకర్యాలను పరస్పరం చర్చించుకుని కల్పిస్తామని తెలంగాణ చెప్పింది. గతంలో హోంమంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేసి, బిల్లును రూపొందించిన తెలంగాణ ఛీఫ్ సెక్రటరీ కూడా తెలంగాణలో ఉన్న సంస్థలు వాటి కార్పస్ నిధితో సహా తెలంగాణవేనని స్పష్టీకరించారు. అందుకు ఆయన సెక్షన్ 75ను ఉదహరించారు. అయితే సెక్షన్ 75 కేవలం సేవల కల్పనకే కాని, సంస్థల యాజమాన్యానికి సంబంధించింది కాదని, సంస్థల యాజమాన్యం గురించి చట్టం పార్ట్ VI లో పేర్కొన్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాదించింది. పార్ట్ VI లో ప్రభుత్వ ఆస్తులు, అప్పుల గురించి ప్రస్తావించిన విషయాన్ని తెలిపింది. ఈ రెండు పరస్పరభిన్న వాదనల వల్ల సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే అవకాశం కనపడలేదు. పలు సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నందువల్ల తెలంగాణ ప్రభుత్వం వాటిని స్వాధీనపరుచుకుని అవన్నీ తమవేనన్నట్లుగా వ్యవహరించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సంస్థలు ఏపీ ప్రభుత్వ పర్యవేక్షణలో నడుస్తున్నందువల్ల వాటి గురించి తెలంగాణ ప్రభుత్వం ఏమీ మాట్లాడలేదు. షెడ్యూల్డు 10 సంస్థలన్నిటిపై మా హక్కు గురించి మేము పోరాడినందువల్ల రెండు ప్రభుత్వాల మధ్య తీవ్ర వైషమ్యాలు తలెత్తాయి.

జాతీయ పర్యాటక, ఆతిథ్య నిర్వహణ సంస్థ (ఎన్ఐటిహెచ్ఎం)తో ఈ వివాదం మొదలైంది. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక కార్యదర్శిగా చందనాఖాన్

ఈ సంస్థ ప్రత్యేక ఛీఫ్ సెక్రటరీ, చైర్మన్ హోదాలో తన కార్యాలయానికి వెళ్లారు. అప్పటికి ఆంధ్రప్రదేశ్‌కు ఆమెను అలాట్ చేశారు. ఆమెను కార్యాలయంలోకి వెళ్లనీకుండా తెలంగాణ ప్రభుత్వం గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. తనను లోపలికి రానివ్వకపోవడంతో ఆమె తీవ్ర నిరసన తెలిపి తన కార్యాలయం ఎదుట రోడ్డుపైనే బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. తన చుట్టూ పోలీసులు బలంగా మోహరించినా ఆమె చెక్కు చెదరకుండా కార్యదీక్షను ప్రదర్శించారు. అయితే ఇతర సంస్థల అధికారులు మాత్రం పోలీసులతో ఢీకొనడానికి ముందుకు రాలేదు. జాతీయ నిర్మాణ అకాడమీ కార్యాలయంలో తన పని తాను చేసుకొమ్మని నేను ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆ సంస్థ డైరెక్టర్ బి. శ్యాం బాబు ను కోరాను. ఆయన ను కూడా సంస్థలోనికి రాకుండా తెలంగాణ పోలీసులు అడ్డుకున్నారు.

కేంద్ర హోంసెక్రటరీ ఆధ్వర్యంలో జరిగిన పలు సమావేశాల్లో రెండు రాష్ట్రాల ఛీఫ్ సెక్రటరీల మధ్య తీవ్ర వాగ్వివాదాలు జరిగాయి. హైదరాబాద్‌లో ఉన్న సంస్థల హోదాను సెక్షన్ 75 మాత్రమే నిర్ణయిస్తుందని, ఆంధ్రప్రదేశ్ అనవసరంగా తగాదాలు సృష్టిస్తున్నదని తెలంగాణ ఛీఫ్ సెక్రటరీ రాజీవ్ శర్మ గట్టిగా వాదించారు. ఎలాంటి పరిష్కారం రాకపోవడంతో సమస్యలు త్రిశంకు స్వర్గంలో వేళ్లాడుతూ కనిపించాయి.

ఒకరోజు షెడ్యూల్డు 10 పరిధిలోకి వచ్చే ఏపీ స్టేట్ రిమోట్ అప్లికేషన్ సెంటర్ ను తెలంగాణ కు చెందిన అధికారులు స్వాధీనపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని నాకు తెలిసింది. ఈ సంస్థకు అటవీ విభాగానికి చెందిన అధికారి ఒకరు ఆంధ్రప్రదేశ్ తరఫున పనిచేస్తున్నారు. ఈ సంస్థ కార్పస్ లో ఉన్న రూ. 30 కోట్లపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించినట్లు నాకు సమాచారం అందింది. ఈ మొత్తం తమకు రావాలని తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తే జనాభా ప్రాతిపదికన పంచుకోవడానికి మేము సిద్ధమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. కాని ఈ సంస్థనూ, కార్పస్‌ను స్వాధీనపరుచుకోవాలని తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని నాకు తెలియడంతో ఎవరికీ తెలియకుండా విజయవాడలోని ఏదో ఒక బ్యాంకుకు నిధిని మళ్లించాల్సిందిగా ఆ సంస్థ అధికారికి చెప్పాను. మర్నాడే ఆ అధికారి ఈ మొత్తాన్ని విజయవాడలోని బ్యాంకుకు మళ్ళించారు. ఈ విషయం తెలియడంతో తెలంగాణ ఉద్యోగులు ఆగ్రహోదగ్రులయ్యారు. పోలీసులు రంగంలోకి దిగి అతడిని అరెస్టు చేసేందుకు

ఉపక్రమించారు. దీనితో నేను జోక్యం చేసుకుని పోలీసు కమిషనర్‌తో మాట్లాడాల్సి వచ్చింది. ఏ పరిస్థితుల్లో సంస్థ కార్పస్ ను బదిలీ చేయాల్సి వచ్చిందో నేను వివరించాను. ఆ అధికారిపై కేసు పెడితే తీవ్ర పర్యవసానాలుంటాయని హెచ్చరించాను. దీనితో పోలీసులు వెనక్కు తగ్గారు.

అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం తమ వాదనను మానుకోలేదు. జనాభా నిష్పత్తిలో సంస్థల అస్తులు, అప్పులను పంచుకునేందుకు మేము సిద్ధంగా ఉన్నామని చెప్పినా అది పట్టించుకోలేదు. అంతా తమవేనని స్పష్టీకరించింది. అయినా మేము వెనక్కు తగ్గలేదు. కనీసం రికార్డు కోసం అయినా ఉండాలని ఆంధ్రప్రదేశ్ తరపున ప్రతి సంస్థలోను అధికారిని నియమించాం. మొదటి రెండు సంఘటనల తర్వాత మాకు తెలంగాణ పోలీసులతో గొడవపడాలని, తెలంగాణ ప్రభుత్వంతో సంఘర్షించాలని ఆసక్తి లేనప్పటికీ ఏపీ హక్కును నిర్ధారించేందుకు అధికారులను నియమించాల్సి వచ్చింది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ విషయంలో కూడా ఇలాగే జరిగింది. ఈ సంస్థకు మేము డైరెక్టర్ జనరల్ గా ముఖేశ్‌కుమార్ ను నియమించాము. ఆయన సంస్థ ప్రాంగణంలోకి అడుగుపెట్టనే లేదు కాని ఆయన ఎక్కడ వస్తారోనని తెలంగాణ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకుని మేము నవ్వుకున్నాం.

కొన్ని సంస్థల విషయంలో కోర్టుకు వెళ్లక తప్పలేదు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఖాతాను స్తంభింపచేయాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం బ్యాంకులకు లేఖ రాసింది. దీనితో విద్యామండలిని నడపడం మాకు కష్టమైంది. అప్పుడు కోర్టుకు వెళ్లడం తప్ప మాకు వేరే మార్గం కనపడలేదు. కాని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వ వైఖరినే సమర్థించింది. అన్ని ఆస్తులు తెలంగాణ ప్రభుత్వ ఉన్నత విద్యామండలికి చెందుతాయని తీర్పు నిచ్చింది. ఈ తీర్పు ఆధారంగా వారు షెడ్యూల్డు 10లో ఉన్న సంస్థలను తమ నియంత్రణలోకి తీసుకుని తమ సంస్థలుగా నడపడం ప్రారంభించారు. హైకోర్టు తీర్పులో లొసుగు ఉన్నదని మాకు పూర్తి విశ్వాసం ఏర్పడడంతో సుప్రీంకోర్టు తలుపు తట్టాం. అడ్వకేట్ జనరల్ వేణుగోపాల్ ఈ విషయంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. చట్టంలోని అన్ని అంశాలను, హైకోర్టు తీర్పును క్షుణ్ణంగా చదివి అవసరమైన అఫిడవిట్లు తయారు చేశారు. ఈ కేసు మాకు చాలా ముఖ్యమైనది. కేసు ఓడిపోతే కార్పస్ తో పాటు రెండు రాష్ట్రాలనుంచి

సేకరించిన ఇతర మొత్తాలను కూడా తెలంగాణకు వదులుకోవాల్సి వస్తుంది. ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నత విద్యామండలి చైర్మన్, అడ్వకేట్ జనరల్, ప్రభుత్వ కార్యదర్శి ప్రేమ చంద్రారెడ్డిలతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశాను. పదవీ విరమణ చెందిన ఐఏఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం మాకు ఎంతో సహాయపడ్డారు. ఆయనకు అద్భుతమైన న్యాయపరిజ్ఞానం ఉన్నది. ప్రతి దశలోనూ నేను కేసు పురోగతిని పర్యవేక్షించాను. అందరూ కలిసికట్టుగా పనిచేయడంతో చివరకు సుప్రీంకోర్టులో మా వాదన నెగ్గింది. అయితే కోర్టు తీర్పు వచ్చే నాటికి నేను పదవీ విరమణ చేసి నెలరోజులు దాటింది. ఏపీ ఉన్నత విద్యామండలి ఖాతాలను బ్యాంకులు స్తంభింపచేయడం చట్టప్రకారం అక్రమమని తీర్పునిచ్చిది. హైదరాబాద్‌లో ఉన్నంత మాత్రాన ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆస్తులను తెలంగాణ ఉన్నత విద్యామండలి స్వాధీనపరచుకునేందుకు ఏ మాత్రం వీలు లేదనిచెప్పింది. హైకోర్టు తీర్పును ప్రక్కన పెట్టింది. ఏపీ ఉన్నత విద్యామండలి తన బ్యాంకు ఖాతాలను నడుపుకోవచ్చునని తెలిపింది. రెండు రాష్ట్రాలు ఒప్పుకుంటే జనాభా ప్రాతిపదికన ఆస్తులు విభజించుకోవాలని, లేకపోతే కేంద్ర ప్రభుత్వం రెండునెలలలోపున కమిటీని ఏర్పర్చి సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలని తీర్పు చెప్పింది. ఈ తీర్పుతో షెడ్యూల్డు 10 సంస్థల విషయంలో నేను చేయగలిగింది చేశానన్న తృప్తి మిగిలింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సుప్రీమ్ కోర్టు తీర్పు ఆధారంగా ఒక నిర్ణయానికి వచ్చి 10వ షెడ్యూలు సంస్థల మూలనిధి (కార్పస్) జనాభా ప్రాతిపదికన రెండు రాష్ట్రాలకు పంచేటట్లు ఆస్తులు సంస్థలు ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతానికే చెందేటట్లు నిర్ణయించింది. ఈ నిర్ణయం అంగీకరించని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య హైకోర్టులో దీనిపై కేసు వేసింది.

షెడ్యూలు 9కి సంబంధించి చరాస్తులు, అప్పులు, బ్యాంకుల విభజనకు సీనియర్ ఐఏఎస్ అధికారి షీలా భిడే నేతృత్వంలో కమిటీని నియమించారు. ఏపీ ట్రాన్స్ కో, ఏపీ జెన్ కో కు చెందిన ఆస్తులు, అప్పుల విభజన రాష్ట్ర విభజనకు ముందే పూర్తయింది. కాని సిబ్బంది విభజనను మాత్రం జూన్ 2 తర్వాత ఏర్పడే రెండు రాష్ట్రాలకు వదిలివేశారు. కేంద్ర హోంసెక్రటరీ సహాయంతో రెండు రాష్ట్రాల ఛీఫ్ సెక్రటరీల కమిటీపై సిబ్బంది విభజనను పూర్తి చేసే బాధ్యతను మోపారు.

సిబ్బంది విభజన విషయంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల వైఖరి వేరువేరుగా ఉంది. చాలా కార్పోరేషన్లలో స్థానిక అభ్యర్థి (Local Candidate) సూత్రాన్ని పాటించలేదని, చాలా మంది ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారినే నియమించారని తెలంగాణ ప్రభుత్వం వాదించింది. వారి విషయంలో ప్రాంతీయతను (Nativity) ప్రాతిపదికగా తీసుకోవాలని తెలిపింది. స్థానిక ప్రాతిపదిక (Local Candidate) ప్రభుత్వోద్యోగులకు వర్తిస్తుంది కాని కార్పొరేషన్లలో స్థానికత ప్రాతిపదికను ఎప్పుడూ అనుసరించకూడదని వారు స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు ఇక్కడకు వచ్చి కార్పొరేషన్లలో పనిచేస్తున్నారు. అందువల్ల స్థానిక ప్రాతిపదికగా కాకుండా నేటివిటీ ప్రాతిపదికగా సిబ్బందిని విభజించాలని వారు వాదించారు. మా వాదన ఏమంటే విభజన ఇప్పటినుంచి అమలులోకి వస్తుంది. గతంలో వచ్చిన వారికి nativity ప్రాతిపదికన విభజనను ఎలా వర్తింప చేస్తాం.. అని మేము అడిగాం. 'మీరు పాత తేదీతో విభజనను అమలు చేయమని కోరుతున్నారు.' అని అన్నాం. మంచికో, చెడుకో వారికి ఇక్కడ ఉద్యోగాలు వచ్చాయి. వారు ఇక్కడ పనిచేస్తున్నారు. వారిని ఆంధ్రాకు తీసుకుంటే అత్యధికులు ఆంధ్రప్రదేశ్‌కు వస్తారని, వారికి పెద్ద ఎత్తున జీతభత్యాలు చెల్లించాల్సి వచ్చి తడిసి మోపెడవుతుందని దీని వలన ఈ సంస్థలపై ఆర్థిక భారం పెరిగి లాభదాయకంగా నడపలేమని మేము వాదించాము. జనాభా నిష్పత్తి ప్రాతిపదికగా సిబ్బంది విభజన కూడా జరగాలన్నాం. ఇలా ఎన్నో వాదోపవాదాలు జరిగాయి. చివరకు కమలనాథన్ కమిటీ నిర్దేశించిన స్థానిక ప్రాతిపదికను ఈవిషయంలో కూడా అనుసరించాలని మేము మధ్యేమార్గంగా సూచించాం.

ఒకరోజు ఉన్నట్లుండి తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందిని నేటివిటీ ప్రాతిపదికగా గుర్తించి వారిని రిలీవ్ చేసింది. దీనితో వారు ఎక్కడకు వెళ్లాలో తేల్చుకోలేకపోయారు. కేంద్ర హోంసెక్రటరీ రెండు రాష్ట్రాల ఛీఫ్ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో మేము వాదోపవాదాలు చేసుకోవడంతో వాతావరణం వేడెక్కింది. ఉద్యోగులను వెనక్కు తీసుకోవాల్సిందిగా కేంద్రం లాంఛనంగా అభ్యర్థన చేసింది కాని తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనితో ఉద్యోగులు కాలికి బలపం కట్టుకుని అందరి దగ్గరకూ తిరిగారు. హైకోర్టును ఆశ్రయించారు. వారి జీతాలను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చెల్లించాలని

హైకోర్టు తీర్పు చెప్పింది. కాని సుప్రీంకోర్టు ఈ ఆదేశాలను ప్రక్కన పెట్టి ఉద్యోగులను వెనక్కు తీసుకుని జీతాలు చెల్లించాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

అప్పటికి షీలాభిడే నేతృత్వంలోని కమిటీ షెడ్యూలు 9లో ఉన్న వాణిజ్య సంస్థల అప్పులు, ఆస్తుల విభజన దాదాపు పూర్తి చేసింది. కాని సిబ్బంది విషయంలో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితో నేను అప్రమత్తమై ఈ విభజనను నిలిపి వేశాను. విభజన ఆస్తులు, అప్పులకు మాత్రమే పరిమితం కాదని, ఉద్యోగుల విభజనకు కూడా వర్తించాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాశాను. సిబ్బంది విభజనకు మార్గదర్శకసూత్రాలను రూపొందించిన తర్వాతే ఆస్తులు, అప్పుల విభజన జరగాలని కోరాను. దీనితో సిబ్బంది విభజన పై అందరి దృష్టి సారించేలా చేశాను. రెండు రాష్ట్రాలకు అనువైన ఫార్ములా ప్రకారం సిబ్బంది విభజన సూచించాలని చెప్పాను. లేకపోతే అన్ని సంస్థల్లో మేము సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చేది.

వాణిజ్య సంస్థల విభజన ఆలస్యం కావడానికి మరో కారణం– కేంద్ర కార్యాలయం (హెడ్ క్వార్టర్స్ ) అన్న అంశంపై సరైన నిర్వచనంలేకపోవడం. కేంద్ర కార్యాలయం అంటే కేవలం కార్యాలయ భవనమా లేక దానితో సంబంధం ఉన్న ఇతర సౌకర్యాలు కూడా వస్తాయా అన్నది వివాదాంశమైంది. కేంద్ర కార్యాలయంతో అనుబంధంగా ఉన్న మిల్క్ ప్రాసెసింగ్ డైరీ, ఆర్టీసీ వర్క్ షాప్ లు కూడా కేంద్ర కార్యాలయం పరిధిలోకేవస్తాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాదించింది. కాని తెలంగాణ ప్రభుత్వం మాత్రం కేంద్ర కార్యాలయం అంటే ప్రధాన భవనమేనని పేర్కొంది. ఈ అంశం కూడా నేను పదవీ విరమణ చేసే నాటికి షెడ్యూల్డు 9 పరిధిలో ఉన్న సంస్థల విభజన పూర్తి కాకుండా అడ్డు తగిలింది.

జూన్ 2, 2014 నాటికి రాష్ట్రం ఏర్పడినప్పుడు రెండు రాష్ట్రాల్లో తాత్కాలికంగా మాత్రమే సిబ్బంది కేటాయింపు జరిగింది. సచివాలయం పరిధిలో కమీషనరేట్లలో, డైరెక్టరేట్లలో సిబ్బందిని తాత్కాలికంగా కేటాయించారు. ఆర్డీవోలు, డిప్యూటీ ఎస్. పిల విషయంలో కూడా ప్రభుత్వాలు సాఫీగా జరిగేందుకు తాత్కాలికంగా కేటాయింపులు జరిగాయి. అయితే అంతిమంగా సిబ్బంది కేటాయింపు మాత్రం కొన్ని మార్గదర్శక సూత్రాల ప్రకారం చేసే బాధ్యతను కమలనాథన్ కమిటీకి అప్పగించారు. రాష్ట్రం ఏర్పాటుకు ముందే రిటైర్డ్ సీనియర్ అధికారి కమలనాథన్

నేతృత్వంలో కమిటీ నియామకం జరిగింది. ఈ కమిటీలో రెండు రాష్ట్రాల ఛీఫ్ సెక్రటరీలు కాక, సిబ్బంది మంత్రిత్వ శాఖ కు చెందిన జాయింట్ సెక్రటరీ సభ్యులుగా ఉన్నారు.

తొలి దశలో సిబ్బంది విభజనకు కమిటీ మార్గదర్శక సూత్రాలను నిర్ణయించింది. సిబ్బంది విభజనలో కమల నాథన్ కు సహాయపడేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శి రామకృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ తమ ఆర్థిక మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న ఎల్. ప్రేమచంద్రారెడ్డిని నియమించాయి. స్థానికత (local candidate) ఆధారంగా విభజన జరగాలా, ప్రాంతీయత(nativity) ఆధారంగా విభజన జరగాలా అన్న ప్రశ్న తలెత్తింది. ప్రాంతీయత ద్వారా విభజన రాజ్యాంగబద్ధం కాదని, స్థానికత ఆధారంగా విభజన జరగాలని నేను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వాదించాను. పునర్వ్యవస్థీకరణ చట్టంలోనూ, రాష్ట్రపతి ఉత్తర్వులోనూ, స్థానిక అభ్యర్థి, స్థానిక ప్రాంతం గురించి ప్రస్తావించారని, విభజన తర్వాత కూడా పదేళ్ల పాటు స్థానికతను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారని నేను తెలిపాను. రెండు రాష్ట్రాల మధ్య సిబ్బంది విభజనకు దీన్నే ప్రాతిపదికగా పరిగణనలోకి తీసుకోవాలని మేము పట్టుబట్టాం. తొలుత తెలంగాణ ప్రభుత్వం ప్రాంతీయత ఆధారంగా విభజన జరగాలని స్పష్టం చేసినప్పటికీ స్థానికత ప్రాతిపదికగా విభజన జరిగేందుకు తర్వాత అంగీకరించింది. రెండు రాష్ట్రాలమధ్య ఏకాభిప్రాయం ఏర్పడితే కాని మేము నిర్ణయం తీసుకోబోమని కమలనాథన్ కమిటీ స్పష్టం చేసింది. చివరకు స్థానికతపై ఏకాభిప్రాయం కుదిరిన తర్వాత బండి ముందుకు కదిలింది.

మరో అంశం – రెండు రాష్ట్రాల మధ్య సిబ్బంది కేటాయించేటప్పుడు సిబ్బంది సంఖ్య ఎంత మేరకు ఉండాలన్నది. అది ఇప్పటికే భర్తీ అయిన పోస్టులకే వర్తిస్తుందా? లేక ఖాళీలను కూడా పరిగణనలోకి తీసుకోవాలా? అన్నది. భర్తీ అయిన పోస్టులకే వర్తించాలని ఆంధ్రప్రదేశ్ వాదించింది. ఖాళీ పోస్టుల్లో కొత్త వారినినియమించే విషయం సంబంధిత ప్రభుత్వాలకు వదిలివేయాలని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ అభీష్టానికి వ్యతిరేకంగా విభజన జరిగింది కనుక అదనపు సిబ్బందితో ఏపీపై మరింత భారం మోపకూడదని వాదించింది. చివరకు ఈ విషయంపై రెండు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. స్థూలంగా సిబ్బంది విభజన ప్రారంభమైంది.

కాని కొన్ని చోట్ల ఉన్న పోస్టుల కంటే ఎక్కువ సిబ్బంది ఉంటే వారు తెలంగాణకు వెళ్లాల్సి వచ్చింది. దీనిపై తెలంగాణ ఉద్యోగుల సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.. విభజన వల్ల తమకు రావల్సిన ప్రమోషన్లు దక్కకుండా పోయాయని అభ్యంతరాలు తెలిపింది. కమల నాథన్ ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా ఉన్నారని వారు ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడం కమలనాథన్ కమిటీకి కత్తిమీద సాము అయింది.

అటెండర్ స్థాయి క్రింది పదవుల విషయంలో కేసిఆర్ ఒక ప్రకటన చేశారు. 'క్రింది స్థాయిలో అధికంగా తెలంగాణ వారే ఉన్నారు. వారందర్నీ ఇక్కడే ఉంచుతా'మని ఆయన స్పష్టం చేశారు.

ఏమైనా సిబ్బంది విభజన విషయంలో చాలా పురోగతి జరిగింది. నేను పదవీ విరమణ చేసే నాటికి సెక్రటేరియట్, డిపార్ట్ మెంట్ల సిబ్బంది విభజన దాదాపు పూర్తయింది. ఎల్ ప్రేమచంద్రారెడ్డి, రామకృష్ణారావు చేసిన నిర్విరామ కృషి వల్ల ఇది సాధ్యపడింది. డిప్యూటీ కలెక్టర్ల స్థాయిలో సీనియారిటీ అంశాలు, కోర్టు కేసుల వల్ల విభజన ఇంకా పూర్తి కావల్సి ఉన్నది. రాష్ట్రానికి కేటాయించిన బెటాలియన్ల విభజన కూడా నేను పదవీ విరమణ చేసే నాటికి పూర్తి కాలేదు. కాని కమల నాథన్ కమిటీ అవలంబిస్తున్న పనితీరు వల్ల అంతా సాఫీగా జరుగుతుందనే నమ్మకం నాకుంది.

షెడ్యూల్ 10 విషయంలో గట్టిగా పోరాడింది నా స్థాయిలోనే. అందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేశాను. ఉన్నత విద్యామండలి పై సుప్రీంకోర్టులో కేసు వేసేందుకు నిర్ణయం తీసుకుని అడ్వకేట్ జనరల్ ను సంప్రదించాను.

నా బ్యాచ్ అధికారి అయిన కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఎల్. సి. గోయల్‌తో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఆయన పదవిలో ఉన్న ఆరు నెలల కాలం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు శాయశక్తులా పోరాడాను. కేంద్ర హోం శాఖలో గట్టిగా పట్టు ఉన్న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మను కూడా ఆత్మరక్షణలో పడేలా చేయగలిగాను. కాని తర్వాత హోంశాఖ సెక్రటరీ మారి రాజీవ్ మహర్షి రావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. ఆయన ఒక్క సమస్యను కూడా పరిష్కరించేందుకు సిద్ధపడలేదు. నేను ఎంత తిరిగినా పట్టించుకోలేదు.

ట్రాన్స్ కో, జెన్కో విభజన చాలా ముందుగా జరిగినప్పటికీ సిబ్బంది విభజన మాత్రం జరగలేదు. దాన్ని అవకాశంగా తీసుకుని ఆంధ్రా ప్రాంతీయత ఉన్నవారినందర్నీ తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. 'మీ చావు మీరు చావండి' అన్న రీతిలో వ్యవహరించింది. నేను ట్రాన్స్ కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి. ప్రభాకర్ రావును కలిశాను. 'మీరు స్థానికత ఆధారంగా సిబ్బంది బదిలీని నిర్ణయించడం సరైంది కాని ప్రాంతీయత ఆధారంగా చేయడం సరైంది కాదు' అని చెప్పాను.

'స్థానికత ఆధారంగా నిర్ణయిస్తే ఆంధ్రా వాళ్లే ఎక్కువ మంది కనపడతారు. దీని వల్ల యూనియన్‌నుంచి తీవ్ర సమస్యలు వస్తాయి. మీరు చెప్పినట్లు చేయడం సాధ్యపడదు' అని ప్రభాకర్ రావు నిస్సహాయత వ్యక్తం చేశారు.

'అట్లా అయితే కోర్టులో తేల్చుకుంటాం.' అని నేను స్పష్టీకరించాను. కోర్టులో కేసు వేయడమే కాక ఇంప్లీడ్ చేసుకొమ్మని రిలీవ్ అయిన ఉద్యోగులకు నా స్థాయిలో చెప్పాను.

ఒకరోజు అడిషనల్ హోం సెక్రటరీ ఎకె సింగ్ హైదరాబాద్ వచ్చారు. ఐటిసి కాకతీయ హోటల్ లో ఆయన సమక్షంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ అధికారుల మధ్య గట్టి వాదనలు జరిగాయి.

షెడ్యూలు 10 క్రింద వచ్చే 107 సంస్థల్లో అత్యధిక భాగం హైదరాబాద్‌లో ఉన్నాయని వాటిని రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం క్రింద రెండు రాష్ట్రాల మధ్య విభజించాలని నేను వాదించాను. రెండు రాష్ట్ర ప్రభుత్వాలకూ ఈ సంస్థల సేవలు పొందే హక్కుందని చెప్పాను. రెండు రాష్ట్రాలకు చెందిన వనరులనుంచి షెడ్యూల్డు 10 సంస్థల్ని నెలకొల్పారని, కాని ఈ సంస్థల్లో ఉన్న ఏపీ ఉద్యోగుల పట్ల వివక్ష కొనసాగుతోందని తెలిపాను. ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించేంత వరకూ సంయుక్త యాజమాన్యం కొనసాగాలని చెప్పాను.

కాని తెలంగాణ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు. షెడ్యూల్డు 10లో ఉన్న సంస్థలన్నీ ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతానికే చెందుతాయని, కావాలంటే రెండు ప్రభుత్వాలు పరస్పర సమన్వయంతో వాటి సేవలను పొందవచ్చునని వాదించింది.

'కృష్ణారావు అనవసరంగా భావోద్వేగానికి గురవుతారు, ఎక్కువ మాట్లాడతారు. చట్టం ఆయనకు అర్థం కాదు. సెక్షన్ 75 ప్రకారం షెడ్యూలు 10కి చెందిన సంస్థలు ఎక్కడుంటే అక్కడి వారికే చెందుతాయి. వాటి సౌకర్యాలను మాత్రమే పొందవచ్చు అని ఈ సెక్షన్ స్పష్టంగా చెప్పింది.' అని రాజీవ్ శర్మ వ్యాఖ్యానించారు.

రాజీవ్ శర్మ వాదనలో ఏదో లోపం ఉన్నదని నాకు తెలుసు. ఈ విషయంలో నాకు ఏపి పునర్వ్యవస్థీకరణను పర్యవేక్షిస్తున్న సెక్రటరీ ఎల్. ప్రేమచంద్రా రెడ్డి అద్భుతమైన స్పష్టత నిచ్చారు. అంతకుముందు అధికారులు ఈ విషయం పట్టించుకోలేదు. కాని ప్రేమచంద్రారెడ్డి ఇచ్చిన వివరణతో పరిస్థితి ఏపీకి సానుకూలంగా మారింది.

'మీరు పార్ట్ VI చూడండి సార్..' అని ప్రేమచంద్రారెడ్డి అన్నారు. సెక్షన్ 75 కేవలం సౌకర్యాల గురించే మాట్లాడింది కాని సంస్థల యాజమాన్యం గురించి మాట్లాడలేదు. ఆ స్పష్టత సెక్షన్ 64లోఉన్నదని ఆయన చెప్పారు. కాని పార్ట్ VI లోని సెక్షన్ 47 నుంచి సెక్షన్ 67 ప్రకారం ఆస్తులు, అప్పులను పరస్పర అంగీకారం ప్రకారం పంచుకోవాలని, లేకపోతే కేంద్ర ప్రభుత్వం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సలహాపై నిర్ణయం తీసుకుంటుందని పునర్వ్యవస్థీకరణ చట్టం స్పష్టం చేసింది. ప్రత్యేకంగా సెక్షన్ 64 ప్రకారం పై సెక్షన్లలో పేర్కొనని ఆస్తులు, అప్పులు ఆంధ్ర రాష్ట్రానికి చెందుతాయి. ఆపై పరస్పర అవగాహనతో రెండు రాష్ట్రాలు పంచుకోవచ్చు. అలాంటి అవగాహన ఏర్పడకపోతే, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు పంచుకోవాల్సి ఉంటుంది. షెడ్యూలు 10 సంస్థల గురించి పార్ట్ VI లో ఎక్కడా పేర్కొనలేదు కనుక ఈసెక్షన్ వర్తిస్తుందని ప్రేమచంద్రారెడ్డి సూచించారు.

దీనితో నేను ఢిల్లీకి వెళ్లి హోం సెక్రటరీ ఆర్. ఎల్. గోస్వామిని కలిశాను. చట్టంలోని పార్ట్–VI సెక్షన్ – 64 ప్రకారం షెడ్యూల్ 10 క్రింద సంస్థలపై మాకు హక్కుంది సార్ అని చెప్పాను.

'ఎలా' అని ఆయన అడిగారు.

నేను పార్ట్ VI ను ఆయనకు చూపించి బలమైన లీగల్ పాయింట్ ఉన్నది అన్నాను.

'ఓహో లీగల్ పాయింట్ పట్టావా' అని ఆయన నా వైపు ఆశ్చర్యకరంగా చూశారు.

ఆ తర్వాత నేను కేంద్ర మంత్రి సుజనా చౌదరి వద్దకు వెళ్లాను. 'అనిల్ గోస్వామితో నాకు సమస్య ఉన్నది సార్.. అతడిని మేనేజ్ చేయాలి' అని చెప్పాను.

ఏం చేశారో కాని అనిల్ గోస్వామి, ఆయన ఎక్కడో ఒక చోట కలుసుకున్నారు. ఆయన అక్కడ నుంచే నాకు ఫోన్ చేసి అనిల్ గోస్వామి తో మాట్లాడించారు.

మీ ఛీఫ్ సెక్రటరీ మాట మాట్లాడితే ఏదో లీగల్ పాయింట్ పట్టుకుంటాడు. ఆయన చెప్పిన దానిపై లీగల్ విభాగానికి రెఫర్ చేస్తాను' అని అంగీకరించారు.

ఏమైతేనేం న్యాయ విభాగం కూడా ఏపీకే మద్దతు పలికింది. లీగల్ అభిప్రాయం తెలిసినప్పటికీ తొలుత అడిషనల్ సెక్రటరీ ఎకె సింగ్ వివరణ ఇచ్చేందుకు ఉత్సుకత ప్రదర్శించలేదు. అయితే లోక్‌సభలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు అస్తులు, అప్పులు పరస్పర అంగీకారం పంచుకోవాలని, లేకపోతే కేంద్రం జోక్యం చేసుకుంటుందని కేంద్ర హోంశాఖ లోక్‌సభలో స్పష్టీకరించింది. అదే విషయం హోంమంత్రిత్వ శాఖ సుప్రీంకోర్టుకు స్పష్టం చేయడంతో తర్వాత కాలంలో ఏపీ ఉన్నత విద్యామండలి పై ఏపీకి సానుకూలంగా తీర్పు నిచ్చింది.

ఇది నేను, నాతో పాటు పనిచేసిన టీమ్ ముఖ్యంగా ప్రేమ చంద్రారెడ్డి సాధించిన విజయం అని చెప్పక తప్పదు.

ఇక తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 1250 ఏపీ ఉద్యోగుల విషయంలో కూడా నేను గట్టిగా పోరాడడంతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఎల్. సి. గోయల్ ఢిల్లీలో అధికార స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నేను, రాజీవ్ శర్మ తోపాటు ఏపీ ఇంధన కార్యదర్శి అజయ్ జైన్, జెన్కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి. ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. అప్పటికే మేము హైకోర్టుకు వెళ్లి ఉద్యోగులకు అనుకూలంగా తీర్పు తెచ్చుకున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అమలు చేయలేదు. ఉద్యోగులు అప్పటికే చాలా నెలలుగా జీతాలు లేకుండా ఉండిపోయారు.

ఈ విషయాన్ని కమిటీ ద్వారా పరిష్కరించుకుందామని తెలంగాణ ప్రభుత్వం సూచించింది. హైకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చిన తర్వాత కమిటీ ఏర్పాటు

చేయాల్సిన అవసరం లేదని నేను స్పష్టీకరించాను. కమల నాథన్ కమిటీ నిబంధనల ప్రకారమే వాణిజ్య సంస్థల ఉద్యోగులకు కూడా మార్గదర్శక సూత్రాలు రూపొందించి స్థానికత (local) ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని కోరాను.

కాని తెలంగాణ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. 'అసలు ఏపీ ప్రభుత్వంతో మాట్లాడకుండా ఉద్యోగులను రిలీవ్ ఎందుకు చేశారు?' అని గోయల్ తెలంగాణ ప్రతినిధి వర్గాన్ని నిలదీశారు.

'అయినా ఎప్పుడో వచ్చి సెటిలయిన వారికి ప్రాంతీయత నిర్ణయించి వెళ్లిపొమ్మంటున్నారంటే వారు చట్టం అమలులోకి వచ్చినప్పటినుంచి కాకుండా అంతకు ముందు కాలం నుంచి అమలు చేయడం అవుతుంది. అదెలా న్యాయం? ఇతర విషయాల్లో జరిగినట్లే ఈ విషయంలో కూడా స్థానికత ఆధారంగానే ఉద్యోగులను బదిలీ చేయాలి.' అని నేను గట్టిగా వాదించాను.

రాజీవ్ శర్మ మాట్లాడలేదు కాని జెన్కో ఎండి మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్ రావుకు కోపం వచ్చింది.

'దిసీజ్ వన్ మోర్ ఎగ్జాంపుల్ ఆఫ్ ఎక్స్‌ప్లాయిటేషన్ ఆఫ్ తెలంగాణ ఇంటరెస్ట్ '. ( ఇది తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారనడానికి మరో ఒక ఉదాహరణ) అని ప్రభాకర్ రావు గట్టిగా అరిచారు.

సమావేశంలో కేకలు వేయడంతో హోంసెక్రటరీ గోయల్ కు మరింత ఆగ్రహం వచ్చింది. 'ఇదేమిటి ఇలా అరుస్తున్నారు. మీరు బయటకు వెళ్లండి.' (యూ క్లియర్ అవుట్ ఆఫ్ ద మీటింగ్) అని చెప్పాడు.

ప్రభాకర్ రావు తగ్గలేదు. అయితే ఏం నాకేంటి లెక్క అన్న ధోరణిలో 'ఐ యామ్ నాట్ కేరింగ్' అంటూ బయటకు వెళ్లిపోయారు.

ఏమైతేనేం ఉద్యోగుల తరఫున నేను నిలబడడం వల్ల హైకోర్టు వారికి జీతాలు చెల్లించమని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తర్వాత ఇరు రాష్ట్రాల మధ్య సానుకూలంగా చర్చలు జరిగి కొత్త పోస్టులు సృష్టించేందుకు అంగీకారం కుదిరిందని సమాచారం.

ఎల్. సి. గోయల్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ వైఖరి స్పష్టమైన తర్వాత నేను హైదరాబాద్ వచ్చి మొత్తం ప్రక్రియకు బ్రేక్ పెట్టకపోతే వాణిజ్య సంస్థల్లోనే కాదు, ప్రతి సంస్థలోనూ ఉద్యోగులను మెడపట్టి బయటకు గెంటేస్తారు అన్న అభిప్రాయానికివచ్చాను.

నేను ఢిల్లీ నుంచి రాగానే షెడ్యూల్ 9 సంస్థల విభజన, విలీనాన్ని పర్యవేక్షిస్తున్న షిలాభిడే కమిటీకి లేఖ రాశాను. జనాభా నిష్పత్తి ప్రకారం ఉద్యోగుల విభజన కానంతవరకూ ఆస్తులు, అప్పుల విభజనను నిలిపివేయాలని స్పష్టం చేశాను. ఆస్తులు, అప్పుల విభజనకు చెందిన సిఫారసులను వెనక్కి పంపమని అందరు సెక్రటరీలకు, ప్రిన్సిపల్ సెక్రటరీలకు సర్క్యులర్ జారీ చేశాను. షిలా భిడే కమిటీ అప్పటికే దాదాపు అన్ని సంస్థల ఆస్తులు, అప్పుల విభజనను పూర్తి చేసి ఏపీకి పంపింది. మాది తెలంగాణను విభజించగా మిగిలిన రాష్ట్రం కనుక తుది ఉత్తర్వులు ఆంధ్రప్రదేశే ఇవ్వాలి. అంతేకాక ఉద్యోగుల విభజన న్యాయసమ్మతంగా పూర్తి కానంతవరకూ ఆస్తులు, అప్పులవిభజన నిలిపివేయాల్సిందేనని కేంద్రానికి కూడా లేఖ సంధించాను.

కేంద్ర హోంసెక్రటరీ రాజీవ్ మహర్షి కి నాపై కోపం వచ్చింది. 'మీ ఛీఫ్ సెక్రటరీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. మొత్తం ప్రాసెస్ ఆపమని మాకు ఉత్తరం రాసిపారేస్తాడు. ఎలా కుదురుతుంది.' అని ఏపీ కి చెందిన నేతలు కలిసినప్పుడు వ్యాఖ్యానించారని నాకు తెలిసింది.

ఆ తర్వాత షిలాభిడే నన్ను కలిశారు. 'నీవు ఇంత మొండి పట్టు పట్టకు. అనధికారికంగా సిబ్బంది విభజనకు అవగాహనకు వస్తే మంచిది' అని చెప్పారు.

'వాణిజ్య సంస్థల్లో ఒక ఫార్ములా లేకుండా వాళ్ల ఇష్టాన్ని బట్టి సిబ్బందిని విభజించి, ప్రాంతీయత ఆధారంగా బయటకు పొమ్మంటే వారిని ఏపీ ఎలా స్వీకరిస్తుంది? ఒక వేళ ఆర్థికభారం పెరిగి ఆ సంస్థ సిక్ అయితే ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారు? మానవ వనరుల ఖర్చు భారాన్ని ఏపీయే తెలంగాణ కంటే ఎక్కువ భరించాలంటే ఎలా?' అని నేను ఆమెపై వివిధ రకాలుగా ప్రశ్నల్ని కురిపించాను.

'సిబ్బంది విషయంలో హేతుబద్ధత పాటించాలి. ప్రాంతీయత ప్రాతిపదిక కుదరదు, స్థానికతను ఆధారంగా తీసుకోవాలి' అని చెప్పాను.

నేను గట్టిగా పట్టుబట్టడం, మొత్తం ప్రాసెస్ ను ఆపివేయడంతో సమస్య ప్రాధాన్యత ముందుకు వచ్చింది. రొటీన్‌గా మిగిలిన షెడ్యూల్ 9 సంస్థల ఆస్తులు, అప్పులు పంపిణీ చేస్తూ సంస్థలను విభజించడానికి షీలా భిడే కమిటీ సిఫార్సుల మేరకు అంగీకరించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి ఉంటే, జెన్ కో, ట్రాన్స్ కో లాగా అన్ని షెడ్యూలు 9 సంస్థల లోని ఆంధ్రా ప్రాంత ఉద్యోగులను తెలంగాణ ప్రభుత్వం ప్రాంతీయత (nativity) ఆధారంగా రిలీవ్ చేసి పంపించి ఉండేది.

నేను పదవీ విరమణ అయ్యే నాటికి కొంత వాతావరణం చల్లబడిందనే చెప్పాలి.

'షెడ్యూల్ 10 సంస్థల విభజన విషయంలో సుప్రీంకోర్టులో గెలిచినా ఆ తీర్పు కేవలం ఉన్నత విద్యామండలి కే వర్తిస్తుందా? ఇతర సంస్థలకు కూడా వర్తిస్తుందా?' అని ఏపీ రాష్ట్ర ప్రభుత్వం వివరణ కోరలేదు. 'ఇది కేవలం ఉన్నత విద్యామండలికే వర్తిస్తుంది' అని తెలంగాణ వాదించింది.

ఇప్పటివరకూ సంస్థల ఆస్తులు, అప్పులవిభజన డోలాయమానంగానే ఉన్నది. ఢిల్లీలోని ఏపీభవన్ తో సహా హైదరాబాద్‌లోని సంస్థలు తమవేనని తెలంగాణ ఇంకా వాదిస్తూనే ఉన్నది. ఈమేరకు జరుగుతున్న సమావేశాలు మొక్కుబడిగానే సాగుతున్నాయి.

రాష్ట్ర విభజన తర్వాత ఒక రోజు లేబర్ సెస్ నిధులు రు. వేయి కోట్ల మేరకు ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. ఆంధ్రా కేడర్ అధికారి మురళీ సాగర్ అప్పుడు లేబర్ అడిషనల్ కమిషనర్‌గా ఉన్నారు. చాలా విషయాల్లో జరిగినట్లు ఈ మొత్తం కూడా తమదేనని తెలంగాణ అధికారులు పూర్తిగా తీసుకునే అవకాశం ఉన్నట్లు నాకు అనిపించింది. అందుకే ఈ మొత్తాన్ని గతంలో అటవీ శాఖ మొత్తాన్ని బదిలీ చేసినట్లు మెల్లగా విజయవాడలో బ్యాంకుకు తరలించమని చెప్పాను. ఆ మొత్తాన్ని పూర్తిగా తీసుకునే ఉద్దేశం నాకు లేదు. కాని తెలంగాణతో చర్చలు జరిగినప్పుడు ఇచ్చి పుచ్చుకునే విషయాల్లో దీన్నికూడా ఒక అంశం చేస్తే ఏపీకి ప్రయోజనం కలుగుతుందని అనుకున్నాను. చంద్రబాబు నాయుడు కూడా అప్పుడు అదే అభిప్రాయంతో ఉన్నారు. 'సరే మొత్తం తరలించండి..' అని ఆయన చెప్పారు. అక్టోబర్ లో మురళీ సాగర్ ను అడిగితే మొత్తం మార్చలేదు సార్, ఆంధ్రాకు

రావల్సిన మొత్తాన్నే తరలించాను..' అని చెప్పారు. 'అరే, అలా చేశారేమిటి. మొత్తం తరలించినట్లు నేను సిఎంకు కూడా చెప్పాను. ఇప్పుడెట్లా'.. అని ప్రశ్నించాను.

కొంచెం సేపు ఆలోచించి 'మిగతా మొత్తాన్ని కూడా తరలించవచ్చా..' అని అడిగాను.

'ప్రయత్నిస్తాను సార్' అని మురళీ సాగర్ చెప్పారు. ఈ విషయం నేను సిఎంకు చెప్పాను. ఆయన కూడా 'అరే. మొత్తం తరలించామని చెప్పారు కదా..' అని అడిగారు. సమాచార లోపంవల్ల మొత్తం తరలించలేదు. 'ఇప్పుడు మార్చేందుకు ప్రయత్నిస్తాము' అన్నాను. 'ఇప్పటికైనా మించిపోయింది ఏముంది. అలాగే కానీండీ.' అని చంద్రబాబు చెప్పారు.

మరుసటి రోజు మురళీ సాగర్ అదే విధంగా మొత్తం ఏపీకి తరలించేందుకు సన్నాహాలు చేస్తుంటే ఈ లోపు తెలంగాణ అధికారులకు తెలిసింది. వారంతా మురళీ సాగర్ చుట్టూ చేరి ఘెరావ్ చేసి గందరగోళం సృష్టించారు. ఈ విషయం కేసిఆర్ నోటీసుకు కూడా వెళ్లింది. ఆయన ఆగ్రహించాడు.

'మనం ఇలాంటి వాటిని సహించేది లేదు. పోలీసు కేసు బుక్ చేయండి..' అని అధికారులను ఆదేశించారు. దీనితో అధికారులు అప్రమత్తం అయ్యారు.

మధ్యాహ్నం మూడు గంటలకు మురళీ సాగర్ నన్ను కలిసేందుకు వచ్చాడు. నన్ను కలిసి క్రిందకు దిగగానే పోలీసులు అతడిని తమతో తీసుకువెళ్లారు. ఈ విషయం వెంటనే నా దృష్టికి వచ్చింది.

నేను డీజీపి మహేందర్ రెడ్డికి ఫోన్ చేశాను. 'మీరు మా వాడిపై అధికారంగా కేసు బుక్ చేస్తున్నారా.. చేస్తే అది చాలా సీరియస్ అవుతుంది. ఆ అధికారి నా ఆదేశాల మేరకే విజయవాడకు సెస్ తరలించే ప్రయత్నం చేశారు. కనుక మీరు నా మీద కూడా కేసు పెట్టండి, ఇది సరైంది కాదు' అని చెప్పాను.

ఆ తర్వాత నేను వేరే ఏదో అంశంపై తెలంగాణ ఛీఫ్ సెక్రటరీ రాజీవ్ శర్మ వద్దకు వెళుతుంటే మహేందర్ రెడ్డి కూడా అక్కడకు వచ్చారు. రాజీవ్ శర్మ ముందే మేము విషయాన్ని చర్చించాం.

రాజీవ్ శర్మ చాలా కోపంగా కనిపించాడు. నాపై అగ్గిమీద గుగ్గిలమైపోయాడు. 'మీనుంచి ఇది ఆశించలేదు..' అని గట్టిగా అన్నాడు.

నాకు నవ్వు వచ్చింది. సాధారణంగా నాకు ముక్కు మీద కోపం. దేన్నీ మనసులో ఉంచుకోను. రాజీవ్ శర్మ చాలా ప్రశాంతంగా ఉంటాడు. ఎంతటి కోపాన్నైనా అదుపులో పెట్టుకుంటాడు. ఈ సారి మాత్రం రాజీవ్ శర్మకు నేను కోపం తెప్పించాను.

'మీరు చాలా విషయాల్లో మొత్తం మీదేనని చెప్పారు కదా.. ఈ సారి మేము అలా చేశాం. అయినా మేము మొత్తం తీసుకోవాలనుకోవడం లేదు. కాని మీకు తెలిసి రావాలని అలా చేసేందుకు ప్రయత్నించాం. మీతో చర్చించేటప్పుడు ఈ అంశం ఉపయోగపడుతుంది కదా.. అయినా డబ్బు ఇంకా ఇక్కడే ఉంది.' అని చెప్పాను.

'అయినా అరెస్టు చేయడం సరైంది కాదు. కావాలంటే నన్ను అరెస్టుచేయొచ్చు. అది నా ఆదేశాలవల్లే జరిగింది.' అన్నాను.

'సార్. కేసిఆర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆయన కూడా కోపంతో ఉన్నారు. సార్. మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి..' అని మహేందర్ రెడ్డి బతిమిలాడారు.

'ఏమైనా సరే అతడిని వదిలిపెట్టండి..' అని గట్టిగా చెప్పాను.

ఆరోజు సాయంత్రం రవీంద్ర భారతిలో ఏదో కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చారు. అక్కడ నేను జరిగిన విషయాన్ని చెప్పాను. ఆయనకు కూడాఅప్పటికి విషయం తెలిసింది. 'మనవాడిని పోలీసులు తీసుకెళ్ళారట కదా..' అని అడిగాడు.

'ఛీఫ్ సెక్రటరీతో మాట్లాడాను. సాయంత్రానికి వదిలివేయవచ్చు' అన్నాను.

'మీరేం చేసినా నేను మీకు మద్దతునిస్తాను..' అని చెప్పారు.

సాయంత్రం 7 గంటలకు మురళీ సాగర్ ను కొంచెంసేపు ప్రశ్నించి వదిలిపెట్టారు. ఎటువంటి అరెస్టు చేయలేదు.

కాని తెలంగాణ ప్రభుత్వం ఈ విషయం వదిలిపెట్టదలుచుకోలేదని నాకు అర్థం అయింది. పోలీసులు మరింత దర్యాప్తు చేయడం మొదలు పెట్టారు. మురళీ

సాగర్ పై క్రిమినల్ కేసు పెట్టారు. ఆంధ్రా బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ వద్దకు వెళ్లి ఆధారాలు సేకరించే ప్రయత్నం చేశారు. మురళీ సాగర్ ఇంటిపై కూడా దాడి చేసి సోదా నిర్వహించారు.

వెంటనే గవర్నర్ స్పెషల్ సెక్రటరీ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌కు ఫోన్ చేసి 'ఇదేమీ బాగులేదు.. ఇది రెండు ప్రభుత్వాల మధ్య సమస్య. అధికారిని ఎందుకు వేధించాలి? నిధులు మా వద్ద పెట్టుకునే అధికారం ఉన్నది. ఏ బ్యాంకులో డబ్బు ఉంటేనేం.?' అని అడిగాను.

సెక్రటరీ గవర్నర్‌తో మాట్లాడారు. 'అలాంటిదేమీ జరగలేదని గవర్నర్ అంటున్నారు' అని నాకు మళ్లీ ఫోన్ చేసి చెప్పాడు.

'ఏం జరగలేదని ఎలా అంటారు? అక్కడ క్రిమినల్ కేసు పెడితే. మీ వద్దకు ఆంధ్రా బ్యాంకు మేనేజర్ ను పంపాలా?' అని అడిగాను.

గవర్నర్‌గారు మహేందర్ రెడ్డి చెప్పింది నమ్మారు. కాని ఆయన మళ్లీ ఆరా తీసి విషయం తెలుసుకున్నారు. మహేందర్ రెడ్డిని పిలిచి అలాంటి కేసులేవీ పెట్టవద్దని గట్టిగా చెప్పారు.

సరైన సమయంలో నేను తీసుకున్న చర్యల వల్ల అధికారిని కాపాడగలిగాను.

అధికారులతో అర్ధరాత్రి వరకూ సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణను కౌంటర్ చేసేందుకు తగిన వ్యూహ రచన చేశాను.

తర్వాత నేను గవర్నర్ వద్దకు స్వయంగా వెళ్లాను. అప్పటికే రాజీవ్ శర్మ వచ్చి ఆయనను కలుసుకున్నారు. నేను కలుసుకునేసరికి గవర్నర్ నాపై మండిపడ్డారు. 'అసలెందుకు నిధులు తరలించారు.. ఎవర్నడిగారు?' అని ఆగ్రహించారు.

నాకు కోపం వచ్చింది. 'సార్. చెప్పిన మాటలు విని మీరు నామీద ఎగురుతున్నారు. మీరు ఈవిషయంలో ఇప్పటికే మనసులో అభిప్రాయం ఏర్పర్చుకుని ఉంటే ఇక నేను మాట్లాడి చేసేదేముంది.. వెళతాను' అని లేచాను. గవర్నర్ తగ్గారు.

'నో. నో. కూర్చోండి' అని, 'చెప్పండి'. అని అడిగారు.

నేను అన్నీ వివరంగా చెప్పాను. తెలంగాణ అన్నీ మావే అనడం, గతంలో జరిగిన దృష్టాంతాలు వివరించి వాస్తవాలు చెప్పాను. దీనితో గవర్నర్ తగ్గి 'మీరు చెప్పింది కూడా సరైనదే..' అని అన్నారు.

ఆ తర్వాత ఈవిషయం కేంద్ర కేబినెట్ సెక్రటరీ అజిత్ సేథ్ తో మాట్లాడేందుకు నేను నవంబర్ 7న ఢిల్లీకి వెళ్లాను. కాని ఇక్కడ కూడా రాజీవ్ శర్మ నాకంటే ముందే వెళ్లి ఆయనను కలిసి ఏపీపై ఫిర్యాదు చేశాడు.

'ఇది చాలా చిన్న అంశం అయినా ఏ బ్యాంకులో ఉంటే ఏమిటి?ఎందుకు తరలించాల్సి వచ్చింది.' అని కేబినెట్ సెక్రటరీ అన్నాడు. నేను ఆయనకు అన్నీ వివరించాను.

తర్వాత మురళీ సాగర్ ను ఒక సందర్భంలో నేను సిఎంకు పరిచయం చేశాను. 'ఇతడికి మనం మంచి పోస్టింగ్ ఇవ్వాలి సార్ గట్టిగా నిలబడ్డాడు.' అని చెప్పాను. సిఎం సరేనన్నారు.

కమలనాథన్ కమిటీ అధికారుల విభజన చేసినప్పుడు మురళీ సాగర్‌ను తెలంగాణకు కేటాయించారు..

అయినా నేను ఊరుకోలేదు. 'మనం ఆంధ్రాలో ప్రత్యేక పోస్టు ఏర్పర్చి ఇతడిని అక్కడకు తీసుకుందాం..' అని చెప్పాను. ఆ విషయం అధికారిక సమావేశంలో కూడా రికార్డు చేశాను. కేంద్రానికి అభ్యర్థన పంపాను. నేను పదవీ విరమణ చేసే వరకూ అతడికి ఆంధ్రాలో పోస్టింగ్ రాలేదు. ఆ తర్వాత కూడా ఊరుకోకుండా నా తర్వాత చీఫ్ సెక్రటరీ అయిన టక్కర్‌కు కూడా విషయం చెప్పి మురళీ సాగర్ ను ఆంధ్రాకు తీసుకువచ్చే విషయం చూడాల్సిందిగా కోరాను. సమయం దొరికినప్పుడల్లా టక్కర్‌తో మాట్లాడేవాడిని.

చివరకు కేంద్ర ప్రభుత్వం మురళీసాగర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడానికి ఆగస్టు 2017లో ఒప్పుకున్నది. ఆగష్టు 2017లో ఆంధ్ర కేడర్‌లో చేరి సెప్టెంబర్ 2017లో మురళీసాగర్ రిటైర్ అయినాడు.

ఇకపై విభజన అంశాలలో ప్రస్తుత పురోగతి ఈ క్రింది విధంగా ఉంది.

ప్రభుత్వశాఖలో ఉన్న సిబ్బందిని పూర్తిగా తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలకు కేటాయించారు. ఒక్క డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, ఎడిషనల్

సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, ఎక్సైస్ సూపరిండెంటెంట్ కేడర్‌లు మాత్రం ఇంకా విభజింపబడలేదు. దీనికి కారణం సీనియారిటీ అంశంపై స్టే ఉండటమే. మిగిలిన అన్ని ప్రభుత్వ పోస్టుల ఉద్యోగుల విభజన జరిగింది. కమలనాథన్ కమిటీ కాలపరిమితి ముగిసింది.

ఇక షెడ్యులు 9 సంస్థలు మొత్తం 91 ఉండగా (89+2) 41 సంస్థల విభజన ఆంధ్రప్రదేశ్ అంగీకరించినా తెలంగాణ ఇంకా అంగీకారం తెలుపలేదు. అందుకని లాంఛనంగా విభజన జరగలేదు కాని అనధికారికంగా ప్రత్యేకంగా పనిచేస్తూ ఉన్నారు. న్యాయపర విభజన పూర్తికాలేదు. షీలాభిడే కమిటీ ఆ పనిమీద ఉన్నది. ఇక షెడ్యూలు 10 సంస్థల విషయంలో కేవలం 10% సంస్థల విభజన పరస్పర అవగాహనతో జరిగింది. సుప్రీంకోర్టు తీర్పు ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా వచ్చిన కేంద్రప్రభుత్వ నోటిఫికేషన్ దాని కనుగుణంగా లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోర్టులో కేసు వేసింది. అది తేలవలసి ఉంది.

# [ 5 ]

# ఇతర విభజన అంశాలు

సంస్థలను ఉద్యోగులను విభజించే ప్రక్రియకు అనుబంధంగా ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లో కొత్త రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేసే అంశాలను కొన్ని కొత్త ప్రభుత్వ సంస్థలను ఏర్పాటు చేసే విధి విధానాలను పొందుపరచటం జరిగింది.

దీనిలో ముఖ్యమైనది కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత వెంటనే దృష్టి పెట్టవలసిన అంశం 14వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ కోరికలు తెలియజేస్తూ ఒక నివేదిక సమర్పించడం. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని 46 వ సెక్షన్ లో ఈ 14వ ఆర్థిక సంఘం ప్రస్తావన ఉన్నది. తదనుగుణంగా రాష్ట్రపతి రెండు కొత్త రాష్ట్రాలకు తమ అవార్డు ఇవ్వవలసిందిగా ఆర్థిక సంఘాన్ని కోరారు. ఈ సమావేశం తిరుపతిలో ఏర్పాటు చేయవలసిందిగా ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. అంతకుముందు కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ సి ఎస్ రావు గారిని ఆర్థిక శాఖలో సలహాదారుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయనకు కేంద్ర ప్రభుత్వం లో మంచి పేరు ఉన్నది. 14వ ఆర్థిక సంఘానికి మేము ఇచ్చే నివేదికను తయారు చేసే బాధ్యతను ఆయనకు అప్పగించడం జరిగింది. ఆర్థిక సంఘంలో సభ్యులు కొంత మంది ఆయన కింద పనిచేసిన వారే. ముఖ్యంగా సుష్మా నాథ్ ఆయన కేంద్ర ఆర్థిక కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆయనతో పని చేసింది. ఆర్థిక సంఘం అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి గారు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వాడు కావడం కొంత మనకు కలిసొచ్చింది. ఆయనకు రాష్ట్ర సమస్యల మీద విభజన వలన రాష్ట్రానికి వచ్చిన అదనపు సమస్యల గురించి పూర్తి అవగాహన

ఉంది. తిరుపతిలో జరిగిన సమావేశంలో రాష్ట్ర సమస్యలను విభజన పర్యవసానాలను ఆర్థిక సంఘానికి సవివరంగా తెలియ జేయడం జరిగింది. వారి తుది నివేదికలో ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2015 నుంచి 20 వరకు ఐదు సంవత్సరాలకు 21113 కోట్లు రెవిన్యూ లోటు భర్తీ కింద వారు సిఫార్స్ చేశారు. ఈశాన్య రాష్ట్రాలు కాకుండా ఐదు సంవత్సరాలకు రెవెన్యూ లోటు గ్రాంటులు వచ్చిన ఒకే ఒక్క రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్. అధికార స్థాయి లో ఈ నివేదిక చూసిన తర్వాత మేమంతా చాలా సంతోషించాము. కానీ ముఖ్యమంత్రి గారికి ఆర్థిక సంఘం నివేదిక సంతృప్తి కలిగించలేదు. ఈ అంశంపై టెలీ కాన్ఫరెన్స్ లుమీటింగులు ఆఫీసర్లతో ఎంపీలతో నిర్వహించారు. రాజధానికి ఏమి సహాయం ఇవ్వలేదని రాష్ట్రానికి ఉన్న సమస్యలను ఆర్థిక సంఘం సరిగ్గా అర్థం చేసుకోలేదని వ్యాఖ్యానించారు. సి ఎస్ రావు గారికి ఒక సందర్భంలో అసహనం వచ్చి ముఖ్యమంత్రి గారికి ఆర్థిక సంఘం వారికి ఇచ్చిన టర్మ్స్ అఫ్ రిఫరెన్స్ అనుగుణంగా వారి నివేదిక ఇస్తుందని రాజధాని అంశాలు మిగిలిన అంశాలు సంఘం పరిధిలోకి రావని ముఖ్యమంత్రి గారికి తెలియజేశారు.

ఈ అంశం ఇక్కడితో సమాప్తి కాలేదు. శాసనసభలో రెవెన్యూ మంత్రి గారు వై వేణుగోపాల్ రెడ్డి గారి మీద వ్యక్తిగత విమర్శ మొదలెట్టారు. సి ఎస్ రావు గారు నాకు ఫోన్ చేసి చాలా ఉదారంగా రాష్ట్రానికి సహాయం చేసిన ఈ రకంగా విమర్శించటం బాధ కలిగిస్తుందని వేణుగోపాల్ రెడ్డి గారు తనతో అన్నారని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు రావాల్సిందిగా నన్ను కోరారు. ఈ అంశం ముఖ్యమంత్రి గారి తో నేను ప్రస్తావించినప్పుడు వారు వేణుగోపాల్ రెడ్డి గారంటే తనకు ఎనలేని గౌరవం అని వారితో ప్రత్యేకంగా మాట్లాడతానని తెలిపారు. ఈ విషయం సి ఎస్ రావు గారికి తెలిపి వేణుగోపాల్ రెడ్డి గారికి తెలియజేయమని కోరాను. కొన్ని రోజుల తర్వాత సి ఎస్ రావు గారిని ముఖ్యమంత్రి గారు వేణుగోపాల్ రెడ్డి గారి తో మాట్లాడారా అని అడిగినప్పుడు వారితో సంప్రదించి అటువంటి సంభాషణ ఏమి జరగలేదని తెలియజేశారు. 14 ఆర్థిక సంఘం పదవి కాలం అయిపోవటంతో వేణుగోపాల్ రెడ్డి గారితోనూ సి ఎస్ రావు గారితోనూ అవసరం తీరిపోయింది. కొంతకాలానికి తనకు సరైన పని ఉండటం లేదని సి ఎస్ రావు గారు కూడా ఇంకా తనకు పదవి కాలం ఉన్న రాజీనామా చేసివెళ్లిపోయారు.

మొత్తమ్మీద ముఖ్యమంత్రి గారికి అసంతృప్తి ఉన్న 14 ఆర్థిక సంఘం చాలా ఉదారంగా సీ ఎస్ రావు గారి వేణుగోపాల్ రెడ్డి గారి చొరవతో కొత్త రాష్ట్రం అవసరాలను దృష్టిలో ఉంచుకొని సహాయం చేసింది అనేది మాత్రం వాస్తవం.

ఇంకో ప్రధానాంశం 2014 –15 సంవత్సరం రెవిన్యూ లోటు భర్తీ. ఈ అంశంపై చట్టం లోఅంత స్పష్టత లేక పోయినా పార్లమెంటులో ప్రధాని మన్మోహన్ సింగ్ గారు చేసిన ప్రకటనలో చాలా స్పష్టంగా విభజన జరిగిన నాటి నుంచి 14వ ఆర్థిక సంఘం నివేదిక అమలయ్యే సమయం వరకు రాష్ట్రానికి వచ్చే రెవెన్యూ లోటును కేంద్రం భర్తీ చేస్తుంది అని పేర్కొన్నారు. గవర్నర్ పాలన సమయంలో నే గవర్నర్ గారు ఈ లోటు 16 వేల కోట్ల దాకా ఉండవచ్చని అంచనావేసి కేంద్రానికి పంపించడం జరిగింది.2014 డిసెంబర్ నాటికి అవగతమైన అంశమేంటంటే ఈ లోటు మూడు నాలుగు వేల కోట్ల ను  దాటదని. అంచనాలకు భిన్నంగా రాష్ట్ర ఆదాయం బాగా పెరిగింది. ఖర్చు నియంత్రణలో ఉంది. ఈ అంశంపై జనవరి 2015 నుంచి ముఖ్యమంత్రి గారు దృష్టిసారించారు. ఈ రెవెన్యూ లోటు బాగా పెంచాలని తదనుగుణంగా చర్యలు మొదలెట్టారు. దీనిని కేంద్రం నుంచి రాబట్టగలను అన్న పూర్తి ధైర్యంతో ఉన్నారు. బహుశా వాజ్‌పాయ్ కాలంలో ఎన్డీఏ ప్రభుత్వంలో తనకున్న పలుకుబడిని దృష్టిలో పెట్టుకొని అటువంటి అపోహలో ఉన్నారు. ఇక ఖర్చు మీద దృష్టి పెట్టటంతో అంతవరకు పరిగణలోకి తీసుకోని చాలా అంశాలు ముందుకు వచ్చాయి. సంవత్సరాల తరబడి ఇవ్వని పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఈ సమయంలోనే ఇవ్వటం మొదలెట్టారు. పరిశ్రమల వారు వెంటనే రావు అనుకున్న నిధులు వస్తున్నాయి కాబట్టి వారి మర్యాదలు వారు చేశారు. ఇక ఎన్నికల సమయంలోని వాగ్దానాల అమలుకు రైతు రుణమాఫీ అధిక పెన్షన్లు అంశాల మీద కూడా ఆఖరి రెండు నెలల్లో పెద్ద ఎత్తున ఖర్చు చేయడం జరిగింది. దీనితో రాష్ట్రానికి వచ్చే రెవిన్యూ లోటు 16,078 కోట్లు చేరింది. సంవత్సరాంతంలో లెక్కలు తనిఖీ చేసిన కాగ్ ఈ అంశాన్ని ధృవీకరించింది. ఈ మొత్తం భర్తీ చేయవలసిందిగా రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. కేంద్రం ఈ పద్దును పరిశీలించి ఎన్నికల హామీలు అమలుచేయటం మీద చేసిన ఖర్చులు మేము భరించలేమని అట్లా చేస్తే ఇతర రాష్ట్రాల నుంచి కూడా అటువంటి అభ్యర్థనలు వచ్చే అవకాశం ఉందని తెలియజేసింది. కేవలం రాష్ట్ర విభజన వల్ల వచ్చిన లోటును

మాత్రమే భర్తీ చేస్తామని ఆ మొత్తం 4117 కోట్లు వస్తుందని తేల్చి చెప్పింది. మధ్యేమార్గంగా 2015 -16 వ సంవత్సరానికి 14వ ఆర్థిక సంఘం 600 9 కోట్లు రెవిన్యూ లోటు గా తేల్చింది కాబట్టి 2014-15 సంవత్సరానికి విభజన జరిగిన తర్వాత పది నెలలకు అదే దామాషాలో రెవిన్యూ లోటు భర్తీకి నిధులు ఇవ్వటానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కాగ్ పేర్కొనిన మొత్తాన్ని ఇవ్వాలని కోరింది. ఈ మధ్య ఇదే అంశం మీద సుప్రీంకోర్టులో ఒకరు వేసిన వ్యాజ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పద్దు కింద రాష్ట్రానికి ఇవ్వాల్సిన మొత్తం 4117 కోట్ల గా తేల్చేసింది. సమస్య సామరస్యంగా పరిష్కరించుకోవడానికి రాష్ట్ర చొరవ చూపి ఉండుంటే ఆరు వేల కోట్ల కైనా వచ్చే అవకాశం ఉండేది. సుప్రీంకోర్టులో ఈ అంశం మీద రాష్ట్రానికి అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం ఏమాత్రం లేదు. అతి నమ్మకంతో మనమే సృష్టించుకున్న సమస్య ఇది.

ఇక చట్టంలోని 93 వ సెక్షన్ లో 13వ షెడ్యూల్లో ఉన్న అంశాలను అమలు చేయటానికి కేంద్రం 10 సంవత్సరాల లో తగిన చర్య తీసుకోవాలని ఉన్నది. ఈ 13వ షెడ్యూల్లో ఉన్న సంస్థలను విద్యారంగ సంస్థలుగా మౌలిక సదుపాయాల సంస్థలు గా విభజించారు. విద్యా రంగ సంస్థల విషయంలో చట్టం ఏర్పాటు చేయాలని నిర్దిష్టంగా చెప్పగా మౌలిక సదుపాయాల సంస్థల విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మాత్రమే ఉంది.

ముందు ఈ విద్యా సంస్థల ఏర్పాటు మీదనే మేము దృష్టి కేంద్రీకరించాం. కేంద్ర ప్రభుత్వంలో ఇది ఉన్నత విద్యాశాఖకు సంబంధించినది గనుక ఆ శాఖ కార్యదర్శి తో సమావేశం కావడం జరిగింది. 2015 -16 విద్యా సంవత్సరం నుంచి ఈ సంస్థలు ప్రారంభించాల్సిందిగా మేము కోరాము. అవసరమైతే తాత్కాలికంగా భవనాలు ఏర్పాటు చేస్తామని తెలిపాము. దీనికి ఆయన సుముఖంగా లేడు. పూర్తి సదుపాయాలు ఏర్పడిన తర్వాతనే నాలుగైదు సంవత్సరాల తర్వాత ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని ఉన్నత స్థాయిలో చర్చించి కేంద్ర ప్రభుత్వం ఆమోదించే టట్లుగా చేసింది. వెంటనే తాత్కాలిక భవనాల్లో ఈ సంస్థలను ప్రారంభించారు. ఏవో కొన్ని చోట్ల ఎక్కడ ఏర్పాటు చేయాలనే దాని మీద వివాదం ఉన్న సంస్థలు మినహాయించి మిగిలిన అన్ని సంస్థలు 2015 -16 విద్యా సంవత్సరం నుంచి పని చేయడం మొదలు

పెట్టాయి. ఎన్ఐటి ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశం మీద తీవ్ర వివాదం నెలకొంది. తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేయాలని జిల్లా మంత్రి గారు ఏలూరులోఅని ఒక బలమైన వర్గం ప్రయత్నాలు చేశాయి. చివరకు మంత్రి గారి వాదన ప్రకారం దీనిని తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేయడం జరిగింది. అందువల్ల దీని ఏర్పాటు ఆలస్యం అయింది. అదేవిధంగా పెట్రోలియం యూనివర్సిటీ విశాఖపట్నం లో నా తూర్పుగోదావరి జిల్లాలో అనే అంశంపై తేల్చుకోలేక పోవడంతో దీని ప్రారంభం కూడా ఆలస్యమైంది.నేను పదవీ విరమణ చేసే సమయానికి చట్టం చేసి ఏర్పాటు చేయాల్సిన ఒకటి రెండు సంస్థలు మినహా మిగిలినవన్నీ పనిచేయడం ప్రారంభించాయి. ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్థలు తాత్కాలిక భవనాల్లో పనిచేస్తున్నాయని కేంద్రం పై ఆరోపణలు చేసినప్పుడు వాస్తవాలను ఎట్ల వక్రీకరిస్తుందని అనిపిస్తుంది. తాత్కాలిక భవనాల్లో అయినా వెంటనే ప్రారంభించమని వాళ్లను ప్రాధేయ పడింది మనం. మన అభ్యర్ధనను మన్నించి ముందు వారు వ్యతిరేకించిన చివరకు ఒప్పుకున్నారు. ఇప్పుడు తాత్కాలిక భవనాల్లోనే ఎందుకు కొనసాగిస్తున్నారని మన మేవాళ్ళను ప్రశ్నిస్తున్నాం.

మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలలో మొదటి ప్రాధాన్యం చోటుచేసుకున్నది విశాఖ చెన్నై పరిశ్రమల ద్వారం. దీనికి ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు నుంచి నిధులు సమకూర్చాలి ఉన్నందువలన వారితో చాలా మీటింగులు నిర్వహించడం జరిగింది. దీనిలో ఏర్పాటు చేయవలసిన పారిశ్రామిక వాడలను ఎంపిక చేయడం జరిగింది. నేను పదవీ విరమణ చేసే సమయానికి ఇది చాలా ముందు దశలో ఉన్నది. రెండవ ప్రధాన అంశం విజయవాడ విశాఖ పట్టణాలలో మెట్రో రైలు. ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేసే రోజుల్లో హైదరాబాద్ మెట్రో రైల్ వ్యవహారం చూసేవాణ్ణి. ఆ సమయంలో ఢిల్లీ మెట్రో శ్రీధరన్ గారితో నాకు సత్సంబంధాలు ఉన్నాయి. దానిని పురస్కరించుకొని వారిని హైదరాబాద్కు పిలిపించి ముఖ్యమంత్రి గారితో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. రెండు మెట్రో రైల్ ల మీద చాలా కసరత్తు జరిగింది. నేను పదవీ విరమణ చేసే సమయానికి విజయవాడ మెట్రో రైలు కు భూసేకరణ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఆపైన ఎందు కో రెండు మెట్రో రైలు మూలన పడ్డాయి. ఇక మిగిలిన మౌలిక సదుపాయాల సంస్థ ఏర్పాటు సాధ్యాసాధ్య పరిశీలన నేను పదవీ విరమణ చేసే సమయానికి పూర్తి కాలేదు.

ముఖ్య కార్యదర్శిగా పదవి బాధ్యత స్వీకరించిన కొత్తల్లోనే నేను దృష్టి పెట్టిన ప్రధానాంశం ప్రత్యేక హోదా. ఈ అంశాన్ని చర్చించటం కోసం గా ప్రధానమంత్రి కార్యాలయంలోని సుబ్రహ్మణ్యం అనే అధికారితో సమయం తీసుకొని పోయి కలవడం జరిగింది. జార్ఖండ్ క్యాడర్కు చెందిన ఈయన మన రాష్ట్రం వాడు. మొదటి సమావేశం లోనే ఆయన నిర్ద్వంద్వంగా ప్రత్యేక హోదా వచ్చే అవకాశాలు చాలా తక్కువ అని తేల్చేశారు. జాతీయ అభివృద్ధి మండలిలో తీసుకొనవలసిన నిర్ణయమని ఇతర ముఖ్య మంత్రులు తప్పకుండా అభ్యంతరాలు లేవనెత్తుతానని తెలిపాడు. ఏమైనా ఇది రాజకీయంగా తేల్చుకోవాల్సిన విషయం అని అధికారుల స్థాయిలో పరిష్కరించే అంశం కాదని చెప్పారు. ఈ అంశాన్ని తిరిగి వచ్చి ముఖ్యమంత్రి గారికి వివరించాను. ప్రత్యేక హోదా స్థాయిలో ప్యాకేజీ అంశం పై చర్చలు నేను ముఖ్య కార్యదర్శిగా ఉన్న సమయంలో మొదలు కాలేదు.

# 6

## హుద్ హుద్‌లో తల మునకలు

రాష్ట్ర విభజన జరిగి నాలుగు నెలలు కాలేదు, హుద్ హుద్ తుఫాను విశాఖను తాకి రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. అక్టోబర్ 8న తుఫాను వచ్చే సూచనలు కనిపించాయి. అప్పటికి హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌లో నేను కొత్త బ్లాకులోకి షిఫ్టు కాలేదు. నేను చిన్నగదిలో పనిచేస్తున్నప్పుడే తుఫాను సమాచారం లభించింది. అండమాన్ వద్ద అల్పపీడనం పెను తుఫాను గాలిగా మారి అక్టోబర్ 12 నాటికి తీవ్రతరమై, కాకినాడ గోపాలపట్నం మధ్య తీరం దాటుతుందని తెలిసింది. ఆ విషయం నేను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెప్పాను. సరే, లెటజ్ ప్రిపేర్ అని ఆయన అన్నారు. ఆ రోజు మధ్యాహ్నామే హుద్ హుద్ తుఫానుకు సంసిద్ధతపై దాదాపు అన్ని విభాగాల అధిపతులతో సమావేశం ఏర్పాటు చేశాను. డీజీపి, అదనపు డీజీపీలు, ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ తదితరులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. 24గంటల పాటు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని, ఫీల్డ్ ఆఫీసర్లను రంగంలోకి దించాలని, సెలవుల్లో ఉన్న అధికారులను వెనక్కు రప్పించాలని, తుఫాను, వరదలకు గురయ్యే ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఇతర బలగాలను నియమించాలని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వివిధ విభాగాల అధికారులకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. ఒక్కరి ప్రాణనష్టం జరగకుండా చూడడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించాము. విపత్తు రాకముందే వృద్ధులు, అంగవికలురు, మహిళలు, పిల్లలు మొదలైన వారిని తరలించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పాము. అన్ని తుఫాను, వరద పునరావాస కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ అన్ని ఉపకరణాలు, ఆహారం, నీరు తదితర సరుకులు లభ్యమయ్యేలా చూశాము. పునరావాస కేంద్రాలుగా మార్చేందుకు

వీలైన ఇతర భవనాలను గుర్తించాము. అన్ని ఆనకట్టల వద్ద నీటి స్థాయిని, నదుల పరిస్థితిని నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశాము. ఎస్ సి, ఎస్టీలకు చెందిన అన్ని ఆశ్రమ పాఠశాలలకు చెందిన హాస్టళ్లలో తగిన ఆహారం లభ్యమయ్యేలా చూడాలని కలెక్టర్లను కోరాము. తుఫానుకు గురైన ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు ట్యాంకర్లలో నీటిసరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాము. పశువులకు కూడా తగిన పశుగ్రాసం లభించేలా చూశాము. తుఫాను వల్ల విద్యుత్ సరఫరా దెబ్బతినే ప్రమాదం ఉన్నందువల్ల ముందు జాగ్రత్త చర్యగా ప్రత్యామ్నాయ విద్యుత్ లభించేందుకు ఏర్పాట్లు చేసుకొమ్మని చెప్పాము. మత్స్యకారులకు తగిన హెచ్చరికలు జారీ చేశాము. ప్రజల ఆస్తుల దోపిడీ కాకుండా, పెట్రోల్, డీజిల్ వంటివి బ్లాక్ లో అమ్మకుండా తగిన చర్యల్ని తీసుకొమ్మని పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాము. ప్రజలకు తప్పుడు సమాచారం వ్యాప్తి కాకుండా, భయోత్పాతాన్ని కలిగించకుండా తగిన చర్యల్ని తీసుకున్నాము. మొత్తం మీద 5 కోస్తా జిల్లాల్లో లక్షలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాము. 64 మండలాల్లో 436 గ్రామాలు తుఫానుకు గురవుతాయని గుర్తించాము. దాదాపు 370 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశాము.

అప్పుడు విపత్తు యాజమాన్య కమిషనర్‌గా ఉన్న అధికారి ముస్సోరికి ఆరువారాల కోసం శిక్షణకు వెళ్లడంతో ఆయన స్థానంలో వెంటనే ఎ.ఆర్. సుకుమార్ అనే అధికారిని నియమించాము. జాయింట్ సెక్రటరీగా ఉన్న అరవింద్ కుమార్ ను సహాయ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక విధుల అధికారి హోదాలో విశాఖపట్టణం పంపించాము. జిల్లాల్లో 12 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. విశాఖలో సైనిక బలగాలను సిద్ధంగా ఉంచారు. తూర్పు నావల్ కమాండ్ కూడా నాలుగు ఓడలను సహాయానికి సిద్ధంగా ఉంచారు.

గతంలో జరిగిన ప్రకృతి వైపరీత్యాల సమయంలో లేని సౌలభ్యం ఈ సారి అందుబాటులోకి రావడం నేను గమనించిన ఒక మంచి పరిణామం. వీడియో కాన్ఫరెన్సింగ్ వ్యవస్థ ఏర్పడడం వల్ల కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ ప్రతిరోజూ సమీక్షించేందుకు ఆస్కారం కలిగింది. ఢిల్లీలో సంబంధిత అధికారులతో, ఆర్మీ, హోంమంత్రిత్వ శాఖ అధికారులతో మేము ఇక్కడ ప్రతి రోజూ సమావేశమయ్యే వారం. ఎలెక్ట్రానిక్ కమ్యూనికేషన్ వ్యవస్థ బాగా నిలదొక్కు కోవడంతో ఎక్కడా

సమాచారం చేరుకోవడంలోనూ, చర్యలు తీసుకోవడంలోనూ ఆలస్యం జరగలేదు. ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్లు సకాలంలో చేరుకున్నాయి.

పరిస్థితిని తనకు అనుకూలంగా ఉపయోగించుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. 'క్రౌడ్ సోర్సింగ్(Croud Sorcing) చేస్తున్నాం, ఆండ్రాయిడ్ ఫోన్లలో సమాచారం పంపండి..' అంటూ హడావిడి చేశారు. టెలికమ్యూనికేషన్లను పునరుద్ధరించే విషయంలో ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్‌ను పబ్లిక్‌గా తిట్టి టీవీలో పబ్లిసిటీ పొందారు. విపత్తులను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. ప్రచారమాధ్యమాలను సమాయత్త పరచడం తను జరిపే ప్రతి మీటింగు లైవ్ లో టెలికాస్ట్ అయ్యేట్టు చూడడము దీనిలో భాగాలు.

ఏమైనప్పటికీ తుఫానును ఎదుర్కొనేందుకు యుద్ధ ప్రాతిపదికన సిద్ధమయ్యాం. తుఫాను సరిగ్గా విశాఖపై కేంద్రీకృతమై తీరం దాటింది. ఆ విషయం కూడా వెంటనే తెలియలేదు. ఎందుకంటే తుఫాను గాలికి రాడార్లు కూడా పడిపోయాయి. 'నేను సాయంత్రమే విశాఖ పట్టణం వెళతాను. మీరిక్కడే ఉండి జరుగుతున్నదాన్ని పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకోండి..' అని చంద్రబాబు చెప్పారు. తుఫాను తీవ్రత రీత్యా ఆ రోజు విశాఖకు చేరలేనని సిఎంకు తెలుసు. కాని తాను జనం మధ్య ఉంటానన్న సంకేతాలు ఆయన పంపించదలుచుకున్నారు. ఆ రోజు ఆయన రాజమండ్రి చేరుకోగలిగారు. తర్వాత రోజు విశాఖ పట్టణం వెళ్లారు. ఇలాంటి తుఫాను వచ్చినప్పుడు 24 గంటలు పనిచేసే నిబద్ధత గల అధికార యంత్రాంగం అవసరం. ఆ కీలక సమయంలో నేను పూర్తిగా ఆఫీసులోనే ఉండిపోయాను.

హుద్ హుద్ తుఫాను సమయంలో అద్భుతంగా పనిచేసిన అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్ విశాఖ పట్టణం జిల్లా కలెక్టర్ యువరాజ్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ నీతూ ప్రసాద్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ కాటమనేని భాస్కర్, కృష్ణా జిల్లా కలెక్టర్ రఘునందన్ అంతా బాగా పనిచేశారు. పశ్చిమబెంగాల్ ఛీఫ్ సెక్రటరీ తో మాట్లాడి చెక్ పోస్టులో సమస్యలు లేకుండా బంగాళా దుంపలు తెప్పించాం. ఉల్లి గడ్డల్ని కర్నూలు నుంచి తెప్పించాం. ఇలా మొత్తం విశాఖ మార్కెట్‌లో కూరగాయల లోటు లేకుండా చేశాం. వాటిని బాధితులకు ఉచితంగా

అందించేలా చూశాం. ఇది చాలా మంచి ప్రభావం చూపింది. పెట్రోల్ బ్లాక్ చేస్తున్నారని సమాచారం అందడంతో దాన్ని అరికట్టాం.

అప్పుడు రక్షణ శాఖ సెక్రటరీ గా ఉన్న ఆర్ కె. మాథుర్ మాకెంతో సహాయపడ్డారు. హోంసెక్రటరీ అనిల్ గోస్వామి వైఖరికి భిన్నంగా రక్షణ సెక్రటరీ తోడ్పడిన తీరు చెప్పుకోదగ్గది. ఏ రాత్రి ఏ చిన్న సమస్య చెప్పినా స్పందించేవారు. వెంటనే ఆదేశాలు పంపేవారు. ఆయనతో సమస్యలు మాట్లాడడం నాకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. త్వరలో టెలికమ్యూనికేషన్ సౌకర్యాలను కూడా పునరుద్ధరించాం. ఒక విపత్తు పట్ల టీం వర్క్ పకడ్బందీగా ఎలా ఉంటుందో హుద్ హుద్ తుఫాను విషయంలో నిరూపితమైంది.

# [ 7 ]

# 'అవర్ పీపుల్ బ్రీఫ్డ్ మి'

2015 జూన్ 1 సాయంత్రం T.V. పెట్టినప్పుడు 'అవర్ పీపుల్ బ్రీఫ్డ్‌మి' ఉదంతం ప్రసారమవుతుంది. ఈ సంభాషణ వినగానే నాకు మతిపోయినట్లయింది. ఒక సిఎం ఎన్నికల అక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు రావడం, ఆయన గొంతును కూడా వినిపించడంతో ఆయన ప్రతిష్ఠ దెబ్బతింటుందనే అనిపించింది. నిజానికి అంతకు ముందే తెలుగుదేశం ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి స్టీఫెన్‌సన్ ఇంటికి వెళ్లి శాసన మండలి ఎన్నికల్లో తమ అభ్యర్థికి అనుకూలంగా ఓటువేసేందుకు అయనకు డబ్బులు ఇవ్వజూపినట్లు టీవీలు చూపించాయి. ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రే ఫోన్‌లో మాట్లాడినట్లు చూపిస్తున్నారు.

సాయంత్రానికల్లా రాష్ట్ర సలహాదారు పరకాల ప్రభాకర్ స్వయంగా టీవీల ముందుకు వచ్చి జరిగిన దాన్ని ఖండించారు.

'ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరించే తీరు ఇదేనా? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 8 ప్రకారం గవర్నర్‌గారికి ఇక్కడున్నటువంటి శాంతి భద్రతలు, ప్రజల యొక్క స్వేచ్ఛ, ప్రజల యొక్క ఆస్తులు, ముఖ్యమైనటువంటి సంస్థల విషయంలో బాధ్యత ఉన్నది. వారు బాధ్యత తీసుకోనప్పుడు, వారు దీన్ని నడపనప్పుడు, రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రికీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికీ ఇద్దరికి కూడా సరి సమానమైన హక్కులుంటాయి. మేము ఇక్కడ ఉన్నప్పుడు, అంటే ఉమ్మడి రాజధాని లో ఉన్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం మా రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల వ్యవహరించిన తీరును మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనిపై రాజ్యాంగపరమైనటువంటి,

చట్టపరమైనటువంటి, న్యాయపరమైనటువంటి, రాజకీయపరమైనటువంటి అన్ని చర్యలూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది.' అని చెప్పారు. అసలు ఈ టేప్‌లో వినిపిస్తున్న గొంతు చంద్రబాబునాయుడుది కాదని పరకాల ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రసమితి పార్టీ కార్యాలయంలో ఉన్న టీ న్యూస్‌లో ఈ సంభాషణ రికార్డు ప్రసారం అయిందని, ఆ సంభాషణ వివరాలు ఎలా వచ్చాయో ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి, డీజీపీ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక వేళ టెలిఫోన్‌లు ట్యాప్ చేసి ఉంటే అందుకు తెలంగాణ ప్రభుత్వానికి అధికారాలున్నాయా అని అడిగారు. ట్యాపింగ్ అక్రమమని అన్నారు.

ఒకవైపు స్టీఫెన్‌తో మాట్లాడింది చంద్రబాబు గొంతుకాదంటూనే మరో వైపు ట్యాపింగ్ అక్రమమని అంటున్నారు. నాకు ఇందులో వైరుధ్యం ఉన్నదనిపించింది.

ఈ ట్యాపింగ్ జరిగిన రెండో రోజుకు విజయవాడలో జూన్ 2న జరిగిన మహా సంకల్ప దీక్షకు ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు లోకేశ్‌తో పాటు నేను, పరకాల ప్రభాకర్, సిఎం ప్రత్యేక విమానంలో వెళ్లాం.

ముఖ్యమంత్రి ముఖంలో నెత్తుటి చుక్క లేనట్లు కనిపించింది. ఆయన మౌనంగా, ఏదో ఆలోచిస్తూ కనిపించారు.

విమానంలో లోకేశ్ పరకాలను అభినందించారు. 'మీరు గట్టిగా మాట్లాడి బాగా సమర్థించారు..' అని ప్రశంసించారు.

నవనిర్మాణ దీక్షకు ఒక పాయింట్ నుంచి నడుచుకుంటూ బెంజి సర్కిల్ వరకూ వెళ్లాము.

మహా సంకల్ప దీక్షలో పాల్గొన్న ముఖ్యమంత్రి పరధ్యానంగానే కనిపించారు. అక్కడి నుంచి స్టేట్ గెస్ట్ హౌజ్ కు వెళ్లి ఆఫీసర్లను కలిశాం. డీజీపి, నేను, కొంతమంది ముఖ్యులు అందులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూడా సిఎం ఇంకా తేరుకోనట్లు కనిపించారు. ఆయన ముఖంలో చాలా అలసట, బడలిక కనిపించాయి.

అంతా కలిసి కొంత చర్చించిన తర్వాత తమ ఫోన్ల ట్యాపింగ్ జరిగిందనే నిర్ధారణకు వచ్చారు.

ఫోన్ ట్యాపింగ్ పై కేసు వేసి వారిని ముద్దాయిలు చేస్తే అవతలి పక్షం ఆత్మరక్షణలో పడుతుందని భావించారు.

ఫోన్ ట్యాపింగ్ పై కేసు వేసి వాళ్లను ముద్దాయిలు చేస్తే కౌంటర్ గట్టిగా ఉంటుందని అనుకున్నారు. చివరకు విజయవాడలో కేసు ఫైల్ చేసి ముందుకు తీసుకుపోవాలని నిర్ణయించారు.

బహిరంగ సభలో మాత్రం ఆయన జరిగిన దానికి ఘాటుగా స్పందించారు. కేసిఆర్ కయ్యానికి కాలు దువ్వుతున్నారని, కేసులు పెడితే భయపడేదిలేదని గట్టిగా హెచ్చరించారు. తాను నిప్పులాంటి మనిషినని చెప్పుకున్నారు. రాజ్యాంగ వ్యతిరేకంగా తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని, కేసిఆర్‌కు తమను విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. కెసిఆర్, జగన్ కలిసి కుమ్మక్కయ్యారని అన్నారు.

'మన ఫోన్లు ట్యాప్ చేస్తే ఎంత కడుపు మండిపోతుందో ఒక్కసారి మీరు ఆలోచించండి. ఇది నేరం, ద్రోహం. ఒక ముఖ్యమంత్రి ఫోన్ ట్యాప్ చేస్తే ఈ దేశం ఏమవుతుందో మీరే చెప్పండి..' అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ ఉమ్మడి రాజధాని. నీకెంత హక్కుందో నాకంత హక్కుంది. ఖబడ్దార్, ఈ విషయం మీరు గుర్తుపెట్టుకోవాలి.' అని హెచ్చరించారు.

మర్నాడు కేసిఆర్ కూడా ఆయనకు గట్టిగా సమాధానం ఇచ్చారు. కేసుల్లో చంద్రబాబును తాము ఇరికిస్తే ఇరికేంత అమాయకుడు కాదని, ఆయనే గోతులు తీయగల సమర్థుడని అన్నారు. 'పట్టపగలు దొరికిన దొంగ' ఇవాళ గట్టిగా మాట్లాడుతున్నాడని అన్నారు. ఎవరూ నిన్ను కాపాడలేరు అని చంద్రబాబును హెచ్చరించారు.

ఈ ఇద్దరు సిఎంల మధ్యా యుద్ధం ఢిల్లీ దాకా వెళ్లింది. ఢిల్లీ అప్రమత్తం అయింది.

ఏమైనప్పటికీ ఫోన్ ట్యాపింగ్ అక్రమమంటూ కౌంటర్ దాడులు చేయడం, రచ్చ చేయడంతో చంద్రబాబుకు ప్రయోజనం చేకూరింది. భారత ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుని ఇద్దరి మధ్యా రాజీ కుదర్చాలని భావించడం వల్ల ఓట్ ఫర్ నోటు కేసు ప్రాముఖ్యత కోల్పోయింది. విషయాన్ని అక్కడికక్కడే ముగించి ఇద్దరి మధ్యా అవగాహన ఏర్పర్చాలని కేంద్రం నిర్ణయించినట్లు కనిపించింది.

గవర్నర్ నరసింహన్ కూడా ఢిల్లీ వెళ్లి జరిగిన విషయాలను హోంమంత్రికి వివరించారు. ఆయనను కూడా ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్యా సంధి కుదర్చమని కేంద్రం కోరే ఉంటుంది.

ఏమైనప్పటికీ చివరకు వారిద్దరి మధ్యా ఎలా రాజీ కుదిరింది? ఎవరు కుదిర్చారు? ఎవరు మధ్యవర్తిగా వ్యవహరించారు? నాకు స్పష్టంగా తెలియదు. అందులో నేను పాల్గొనలేదు.

ఇద్దరి మధ్యా రెండు విషయాల్లో మాత్రం అవగాహన ఏర్పడినట్లు స్పష్టంగా తెలుస్తున్నది.

ఓట్ ఫర్ నోట్ కేసు విషయంలో ముఖ్యమంత్రి కేసిఆర్ చంద్రబాబుకు కొంత వెసులుబాటు కల్పిస్తారు.. టెలిఫోన్ ట్యాపింగ్ సమస్యపై చంద్రబాబు న్యాయస్థానంలో ముందుకు వెళ్లరు. అంతేకాక కేసిఆర్ కొన్ని షరతులు కూడా విధించి ఉంటాడు. 'మీరు (ఆంధ్రా ప్రభుత్వం) ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి. మొత్తం సెక్రటేరియట్‌ను అక్కడికి తరలించి కట్టుబట్టలతో వెళ్లాలి. తెలంగాణ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదు. మిగిలినవి నేను చూసుకుంటాను. అక్కడికి వెళ్లిపోండి..' అని కేసిఆర్ చెప్పి ఉంటాడు.

చంద్రబాబునాయుడు దీనితో హైదరాబాద్‌నుంచి పూర్తిగా వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు. అయితేనేం కేసిఆర్‌తో తనపై కేసు కొనసాగించకుండా తనను తాను రక్షించుకోగలిగారు.

ఏమైనప్పటికీ చంద్రబాబు కౌంటర్ కేసు వేయడం ఆయనకు ఉపయోగపడింది. విజయవాడ కోర్టులో ఫోన్ టాపింగ్ కేసు విషయంలో ఆయన తదుపరి చర్యలు తీసుకోలేదు. దానికి కాలదోషం పట్టింది. ఇక్కడ ఓట్ ఫర్ నోట్ కేస్ కూడా తెర మరుగవుతుందనే నేను అనుకుంటున్నాను.

కేసిఆర్‌కు అప్పటికి కాంగ్రెస్ నుంచి భయం లేదు. అది విశ్వసనీయత కోల్పోయిన పార్టీగా మారింది. బిజెపి ఇంకా ఎదగలేదు. అందువల్ల టీడీపీని ఫినిష్ చేయడంపైనే కేసిఆర్ దృష్టి కేంద్రీకరించాడు. తెలంగాణలో తెలుగుదేశం నాయకత్వాన్ని చాలా వరకు తన వైపుకు తిప్పుకున్నారు. కార్యకర్తల్ని కూడా లాగారు. హైదరాబాద్‌లో కూడా తెలంగాణ రాష్ట్ర సమితి పట్టు బలపడేలా

చేసుకున్నారు. ఇందుకు కారణం ఓట్ ఫర్ నోట్ కేసును బాగా ఉపయోగించు కోవడమే.

ఓట్ ఫర్ నోట్ కేసు తర్వాత చంద్రబాబు చాలా బలహీనపడ్డారు. మొదట్లో కేసిఆర్ గురించి తేలికగా మాట్లాడేవారు. 2015 జూన్ 2 తర్వాత నోరు విప్పలేదు. జూన్ 2 కు ముందు చంద్రబాబు ఒక మనిషి. తర్వాత మరో మనిషి. ఫోన్ ట్యాపింగ్, ఓట్ ఫర్ నోట్ కేసు చంద్రబాబు ప్రతిష్ఠను, ఆత్మ విశ్వాసాన్ని, మనో స్థైర్యాన్ని, విషయాలను డీల్ చేసే విధానాన్ని పూర్తిగా దెబ్బతీసింది.

చంద్రబాబు గట్టిగా మాట్లాడితే మరుసటిరోజే కేసిఆర్ విరుచుకుపడి, ఆయనను వెనక్కు తగ్గేలా చేసేవాడు. 'జాగ్రత్త' అనే స్థాయిలో మాట్లాడేవాడు.

కేసిఆర్ సర్కార్ వద్ద ఇంకా ఓట్ ఫర్ నోట్ కేసుకు సంబంధించి సాక్ష్యాలున్నాయా లేవా అన్నది చెప్పలేను. విచారణ వెంటనే సాగి ఉంటే సాక్ష్యాధారాలు మరింత బయటపడేవి. ఎక్కడినుంచి ఎక్కడకు డబ్బు వెళ్లింది, ఎవరు విత్ డ్రా చేసింది, ఎవరు ఎవరికి డబ్బులు చెల్లించింది అంతా తెలిసేది. మనీ ట్రయల్ కూడా బయటపడేది. ఫోరెన్సిక్ నివేదిక కూడా ఏమయిందో తెలియదు. ముఖ్యమంత్రిదే కాకుండా మరికొందరు ముఖ్యుల ఫోన్ సంభాషణలు కూడా రికార్డు చేశారని కూడా విన్నాను. ఏమైనా విచారణ ఏదో దశలో ఆగిపోయింది. మనీ ట్రయల్ అన్వేషిస్తున్న సమయంలోనే ఆగిపోయిందని ఎవరో చెప్పారు.

ఫోరెన్సిక్ నివేదిక మాత్రం ఒక కొలిక్కి వచ్చిందని సమాచారం. అదే సమయంలో ఫోరెన్సిక్ నిపుణుడు గాంధీని చంద్రబాబు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో నియమించుకున్నారు. హైదరాబాద్‌లో ఫోరెన్సిక్ లాబ్ ఉన్నది కనుక విజయవాడలో నిర్మించేందుకు గాంధీ సహాయం అవసరమైనందువల్ల ఆయనను తీసుకున్నారు. ఓట్ ఫర్ నోట్ కేసు సమయంలోనే గాంధీ అవసరం ఎందుకు వచ్చిందో ప్రభుత్వానికే తెలియాలి.

ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అనుమానం వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు చాలా కాలం ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేసిన బాలసుబ్రహ్మణ్యం సేవలను పూర్తిగా ఉపయోగించుకున్నారు. ఈ అంశాన్ని పరిశీలించి విజయవాడలో కేసు పెట్టడానికి ఆయన బాగా సహాయపడ్డారు.

# [ 8 ]

# ఆంధ్రా ప్రయోజనాలకు దెబ్బ

ఓటు ఫర్ నోట్ కేసు తర్వాత చంద్రబాబు గొంతు జీరబోయింది.

ఏమైనా హైదరాబాద్‌లో ఆంధ్ర ప్రయోజనాలను కాపాడతానని, హైదరాబాద్ పై కేసీఆర్‌కెంత హక్కుందో తనకంత హక్కుందని, తనకు కూడా ఏసీబీ ఉన్నదని మాట్లాడిన చంద్రబాబునాయుడు క్రమంగా తోక ముడిచారు. తెలంగాణకు విద్యుత్ కూడా రాకుండా అడ్డుపడిన చంద్రబాబు, హైదరాబాద్‌లో సెక్షన్ 8ను అమలు చేసి, రెండు రాష్ట్రాల పోలీసు బలగాలకు అధికారం కల్పించేందుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చిన చంద్రబాబు, హైదరాబాద్‌లో సెక్రటేరియట్ నిర్మాణానికి భారీ ఎత్తున ఖర్చు పెట్టిన చంద్రబాబు, విజయవాడలో రాజధాని పూర్తిగా నిర్మాణమయ్యేంతవరకూ అక్కడ కేవలం క్యాంప్ ఆఫీసునే పెట్టుకుని హైదరాబాద్‌నుంచే మొత్తం నడిపించాలనుకున్న చంద్రబాబు, కేసిఆర్ సర్కార్‌ను దెబ్బతీసేందుకు తెర వెనుక పన్నాగాలు చేశారని ఆరోపణలు ఎదుర్కొన్న చంద్రబాబు, తెలంగాణనుంచి నిధులు ఆంధ్ర బ్యాంకులకు మళ్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన చంద్రబాబు, ఉద్యోగులు అరెస్టయితే పోరాడేందుకు పూర్తి మద్దతునిస్తానన్న చంద్రబాబు అన్నిటినీ మరిచిపోయారు.

'బతుకు జీవుడా' అంటూ విజయవాడకు తరలి వెళ్లే క్రమాన్ని అతి వేగవంతం చేశారు.

క్రమంగా హైదరాబాద్‌కు రావడం తగ్గించారు. విజయవాడలో రాజధాని గురించి భారీ ఎత్తున ప్రచారం, ఊపు సృష్టించి దానికొక బిల్డప్ ఇవ్వడం మొదలు పెట్టాడు. హైదరాబాద్‌లో ఉండలేని నిస్సహాయత బయటపడకుండా

విజయవాడలోనే ఉండిపోవడానికి రాజధాని పేరుతో బలమైన కారణాలు సృష్టించుకోవడం మొదలు పెట్టారు. ఒక ప్రతికూల పరిస్థితిని తనకు అనుకూలంగా ఆయన మీడియా సహాయంతో మలుచుకున్నారు. ఇది ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. స్వంత గడ్డపై నుంచే పాలన ఉత్తమమనే కొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చి పెద్ద ఎత్తున ప్రచారం చేశారు

ఇదంతా ఓట్ ఫర్ నోట్ కేసు మాహాత్మ్యమేనని వేరే చెప్పనక్కర్లేదు. జూన్ 2, 2015 తర్వాత చంద్రబాబు వైఖరే మారిపోయింది.

ఆ తర్వాత ఆరేడు నెలలకు ఛీఫ్ సెక్రటరీగా నా పదవీ కాలం ముగిసింది. నేను పదవీవిరమణ చేసిన తర్వాతే ఆయన విజయవాడలో శాశ్వత కార్యాలయాన్ని ఏర్పర్చుకున్నారు. అంతవరకూ నేను, ఆయన తాత్కాలిక కార్యాలయంలోనే పనిచేశాం. విజయవాడలో నా క్యాంపు ఆఫీసులోనే చిన్న గదిని పెట్టుకుని ఆఫీసు కమ్ రెసిడెన్స్‌గా ఉపయోగించుకున్నాను. అక్కడ వారానికి ఒకటి రెండు రోజులు పనిచేసి తిరిగి వచ్చేవారం. ఎందుకంటే పూర్తి స్థాయి సిబ్బంది అప్పటికి హైదరాబాద్‌లోనే ఉండేవారు. ఈ–ఆఫీసు రావడం వల్ల ఫైళ్లను భౌతికంగా తరలించే ప్రక్రియ దాదాపు అప్పటికే ఆగిపోయింది. ఈ సౌకర్యం వల్ల పరిపాలనలో అసౌకర్యం రాకుండా మేము సాఫీగా పనిచేశాము.

జూన్ 2, 2015 వరకు విభజన సమస్యలపై ఏ మాత్రం పోట్లాడినా నాకు చంద్రబాబు మద్దతు ఉండేది. కాని ఆయనే ఆత్మరక్షణలో పడడంతో ఏమీ చేయలేకపోయారు. నేను పంపించే ఫైళ్లు తిరిగి వచ్చేవి కావు. తెలంగాణ ప్రభుత్వంతో సంఘర్షణకు పూనుకోవడం చంద్రబాబుకు ఇష్టం లేదని నాకు తెలిసింది. ఒక వ్యక్తి స్వంత ప్రయోజనాలకోసం ఒక రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినడం స్పష్టంగా కనిపించింది.

కాని ఒక ఛీఫ్ సెక్రటరీగా నేను ఊరుకోలేదు. నా పోరాటం నేను సాగిస్తూనే వచ్చాను.

ఓట్ ఫర్ నోటు కేసు తర్వాత చంద్రబాబు వెనక్కి తగ్గడంతో ఏపీ సర్కార్‌కు సంఘర్షణాయుతమైన వైఖరి అవలంబించే అవకాశం లేకుండా పోయింది. భారత ప్రభుత్వం దృష్టిలో కూడా ఏపీ ప్రభుత్వం చులకనగా మారడంతో ఏపీకి అంత

మద్దతు లభించలేదు. అధికారుల స్థాయిలోనే తేల్చుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది.

రాజకీయ స్థాయిలో పరిష్కారానికి అటు చంద్రబాబు కాని, కేంద్రం కానీ ఆసక్తి ప్రదర్శించలేదు. 'మీరు ఫార్ములా మాట్లాడుకోండి. మీఇద్దరూ అంగీకరిస్తే మేము పచ్చ జెండా ఊపుతాం.' అని కేంద్రం తన వైఖరి ప్రదర్శించింది.

చాలా విషయాలు హోం సెక్రటరీ స్థాయి వద్దే ఆగిపోయాయి. మొదటి హోం సెక్రటరీ పూర్తిగా ఏపీకి వ్యతిరేకంగా పనిచేశాడు. రెండవ హోం సెక్రటరీ నాతో సత్సంబంధాల వల్ల కొంత న్యాయ సమ్మతంగా ప్రవర్తించాడు. ఇక మూడో హోం సెక్రటరీ మాత్రం ఏమీ పట్టనట్లుగా ఉండడంతో దేనికీ పరిష్కారం లభించని స్థితి ఏర్పడింది.

తెలుగుదేశానికి చెందిన కేంద్ర మంత్రి సుజనా చౌదరి తనకు సాధ్యమైనంత వరకూ సిబ్బంది, ఆస్తుల అప్పుల విషయం పట్టించుకునేందుకు ప్రయత్నించారు కాని ఆయన అంత విజయం సాధించలేకపోయారు.

కాని ఇంతవరకూ ఆ విషయం తేలలేదు..

లేబర్ సెస్ విషయంలోను తెలంగాణ ప్రభుత్వం అరెస్టు చేసిన మురళీ సాగర్‌ను తర్వాత గవర్నర్ వద్దకు తీసుకెళ్లాను. 'కేసు కొనసాగకుండా చేస్తాను' అని గవర్నర్ అన్నారు కాని దాన్ని మూసేయలేదు. ఆయనకు ఆంధ్రాలో పోస్టింగ్ ఇచ్చే విషయం కూడా సిఎం పట్టించుకోలేదు. అంతే కాదు, ఆయన ఆంధ్రా ప్రయోజనాలను కాపాడిన ఉద్యోగుల గురించి పెద్దగా పట్టించుకోలేదు.

అందుకు చందనాఖాన్ ఉదంతమే నిదర్శనం.

చందనాఖాన్ గట్టిగా రాష్ట్ర ప్రయోజనాలకోసం పోరాడారు. ఆ విషయంలో ఆమె ప్రథమ శ్రేణిలో ఉంటారు. జాతీయ పర్యాటక, ఆతిథ్య నిర్వహణ సంస్థ (ఎన్ఐటిహెచ్ఎం) బోర్డు మీటింగ్ ను ఏ విధంగా ఆమె రోడ్డుపైనే నిర్వహించారో ఇంతకు పూర్వమే వివరించాను.

ఆమె నా బ్యాచ్ మేట్ కూడా. ఆమె చక్కగా చేసిన పని నాకెంతో సంతోషం కలిగించింది. చాలా మంది అధికారులు నేనెంతో ఒత్తిడి చేస్తే కాని పోలేదు. 'సార్,

మేము హైదరాబాద్‌లో ఉండాల్సి వస్తుంది. ఎందుకు అనవసరంగా తెలంగాణ వారితో పెట్టుకోవాలి?' అని భయపడ్డారు.

ఆమె ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొన్నారు. విభజన జరిగే నాటికి ఆమెకు ఆరు నెలల సర్వీసు ఉన్నది. ఆమెను ఆంధ్రాకు కేటాయించారు. పర్యాటక రంగంలో పనిచేస్తున్నారు. 'పర్యాటక రంగంలో నాకు మంచి అనుభవం ఉన్నది. నాకు ఏమన్నా అవకాశం ఇస్తారేమో చూడండి' అని ఆమె అభ్యర్థించారు.

నేను సిఎంతో ఈ విషయం ప్రస్తావించాను. ఆమెను 'టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చేస్తే బాగుంటుంది సార్. మంచి పని చేయగలరు.' అన్నాను.

'నిజమే. కాని కార్పొరేషన్ చైర్మన్ రాజకీయ పదవి కదా. కావాలంటే ఎండిగా వేద్దాం.' అని చంద్రబాబు చెప్పారు. మూడేళ్ల పదవీ కాలం ఇచ్చి ఎండిగా చేద్దాం అన్నారు.

నవంబర్‌లో ఆమె పదవీ విరమణ చేయాల్సి ఉన్నది. రెండు మూడు రోజుల ముందు నేను సిఎంకు ఫైలు పంపించాను.

'ఇచ్చేద్దాం. సమస్యేమీ లేదు. నేను విదేశాలనుంచి తిరిగి రాగానే సంతకం పెడతాను' అన్నారాయన.

అప్పుడు ఆయన హాంకాంగో, జపానో వెళుతున్నారు. తిరిగి రాగానే చేస్తానన్నారు.

'సరే సార్, ఆ తర్వాత ఫైలు తీసుకువస్తాను' అని చెప్పాను.

ఆమెకు కూడా ఫోన్ చేసి చెప్పాను. 'మీకు కార్పోరేషన్ ఎండి పదవి వచ్చేసినట్లే. సిఎం అంగీకరించారు కూడా..' అని చెప్పాను. ఆమె ఎంతో సంతోషపడి నాకు పలుసార్లు ధన్యవాదాలు తెలిపారు.

'మీరు కూడా రాష్ట్ర ప్రయోజనాలకోసం గట్టిగా పోరాడారు కదా.. మీకు ఈ పదవి పొందేందుకు అన్ని విధాలా అర్హతలున్నాయి.. మీకు పదవి రావడం ఫార్మాలిటీయే' అని నేను చెప్పాను.

నెలాఖరులో ఆమెకు వీడ్కోలు పార్టీ జరిగింది. అక్కడ కూడా నేను అదే చెప్పాను. 'చందనాఖాన్ ఏపి టూరిజం కార్పోరేషన్ ఎండి కాబోతున్నారు.. సిఎం గారు విదేశాలనుంచి రాగానే ఫైలుమీద సంతకం చేస్తారు.' అని చెప్పడంతో అంతా ఆనందంతో చప్పట్లు చరిచారు.

ఆయన విదేశాలనుంచి తిరిగి రాగానే నేను ఫైలు తీసుకుని వెళ్లాను.

'లేదు లేదు. ఐఎంజి భరత కు సంబంధించిన కేసు ఆమెపై పెండింగ్‌లో ఉంది. తొందరపడవద్దు' అని చంద్రబాబు అన్నారు.

'లేదు సార్. నాకు తెలిసి ఆమెకు దేంట్లోనూ ఇన్ వాల్వ్ మెంట్ లేదు.' అని అన్నాను.

'లేదు లేదు. ఉంది' అని ఆయన అన్నారు.

'సరే సార్, నేను కూడా వెరిఫై చేసుకుని వస్తాను' అని బయటకు వచ్చాను

ఈవిషయం తెలిసిన సాంబశివరావుకు ఫోన్ చేశాను.

'లేదు సార్. ఆ కేసులో ఆమె జోక్యం ఏమీ లేదు. సిఎంకు వ్యతిరేకంగా ఆమె ఏమీ చేయలేదు. నిజానికి మేమే ఆమె దగ్గరకు పోయి సిఎంకు మద్దతుగా కొంత సాక్ష్యం కూడా సేకరించాం.' అన్నారు..

'మీరు సిఎంకు ఎందుకు వివరించకూడదు?' అని అడిగాను.

'సరే, చెబుతాను' అన్నారు. మళ్లీ సిఎం దగ్గరకు వెళ్లి ఈ విషయం చెప్పాం.

'లేదు. లేదు ప్రక్కన పెట్టండి' అన్నారు.

చందనా ఖాన్ పట్ల ఆయన వైఖరికి కొంత నేపథ్యం ఉన్నది. గచ్చిబౌలిలో ఐఎంజి భరత సంస్థకు అంతర్జాతీయ క్రీడా అకాడమీని నెలకొల్పేందుకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం 2003-2004లో 450 ఎకరాలు కేటాయించింది. 2004 ఫిబ్రవరిలో తనది ఆపద్ధర్మ ప్రభుత్వమైనా సరే చంద్రబాబు ఆగమేఘాలపై ఈ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ కేటాయింపులతో పాటు చంద్రబాబు హయాంలో జరిగిన అనేక భూ కేటాయింపులను రద్దు చేసింది.

కాని అప్పుడు క్రీడలు, యువజన వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ చందనాఖాన్‌కు ఈ విషయంలో ఎలాంటి పాత్ర లేదు. ముఖ్యమంత్రి నిర్ణయాలకు అనుకూలంగానే వ్యవహరించారు. కోర్టులో కూడా ఆమె ఎలాంటి వ్యతిరేక సాక్ష్యాలు చెప్పలేదు. పైగా సాంబశివరావు చెప్పిన దాని ప్రకారం ఆమె ఈ కేసుకు సంబంధించి చంద్రబాబు ప్రభృతులకు కొంత సానుకూల సమాచారాన్ని కూడా అందించారు. కాని చంద్రబాబుకు ఆమె పేరు వినేసరికి గతం గుర్తు వచ్చినట్లున్నది. ఐఎంజి భరత కు భూకేటాయింపులు అప్పట్లో అతి పెద్ద భూ కుంభకోణంగా ప్రచారం జరిగింది

చివరకు చంద్రబాబు చందనాఖాన్ కు కార్పొరేషన్ ఎండి ఉద్యోగం ఇవ్వనే లేదు.

చందనాఖాన్ బాగా ఫీలయ్యారు. నేను కూడా ఫీలయ్యాను. ఆమెకు పదవి వస్తుందని ముఖ్యమంత్రిగారు మాట ఇచ్చి, అందరి ముందు ప్రకటించి చేయలేకపోవడం బాధ కలిగించింది.

ఎవరు చెప్పారో, ఏమో తెలియదు. లేదా వాళ్ల మనుషులను పెట్టుకోవాలనుకున్నారో ఏమో.

అమరావతిలో పూర్తిగా రాజధాని నిర్మించిన తర్వాతనే వెళ్లాలని ఆయన అనుకున్నారు. కనీసం పదేళ్లు ఇక్కడ ఏపీ ప్రభుత్వం నిర్వహించాలని ఆయన భావించారు. అక్కడ క్యాంప్‌ఆఫీసు పెట్టుకుని ఇక్కడి నుంచి నడిపించాలనుకున్నారు. అందుకే మొదట్లో సెక్షన్ 8 పై పట్టు పట్టారు. హైదరాబాద్‌లో రెండు రాష్ట్రాల బలగాలు, అధికారులు ఉండాలన్నారు.

కాని ఓట్ ఫర్ నోట్ కేసు తరువాత ఆగమేఘాలపై వెళ్లడంతో సెక్రటేరియట్ ఉద్యోగులు పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఏమైనప్పటికీ ఓట్ ఫర్ నోట్ కేసు వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు బాగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఉద్యోగులను అక్కడికి తరలించే కార్యక్రమం వేగవంతం అయి డెడ్ లైన్లు విధించడంతో వారు తీవ్రమైన కష్టాలు పడ్డారు. అవి వర్ణనాతీతం అని చెప్పక తప్పదు. చాలా మంది తమ గోడు నాకు చెబుతూ ఉండేవారు. ఆమేరకు వాట్సాప్ సందేశాలు కూడా పంపారు. ఇప్పటికీ చాలా మంది ఉద్యోగులు హైదరాబాద్‌కూ, విజయవాడకూ మధ్య తిరుగుతూ ఉన్నారు.

చంద్రబాబుకు సమస్య వచ్చినందువల్లే వారందరికీ తీవ్ర సమస్య తెచ్చి పెట్టారు. అసలు ఏమాత్రం సన్నాహాలు చేయకుండా సెక్రటేరియట్‌ను తరలించారు. ఇది మరీ ఘోరం.

సెక్రటేరియట్‌ను మార్చదలుచుకుంటే అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో వారు దానికి తగ్గ సన్నాహాలు చేసేవారు. రాజధాని ప్రాంతంలో ఒక వర్కింగ్ వుమన్ హాస్టల్, ఒక వర్కింగ్ మెన్ హాస్టల్ నిర్మించేవారు. దానికి భోజన వసతులు ఏర్పర్చేవారు. సరైన విధంగా తరలించి సౌకర్యవంతంగా వారితో పనిచేయించు కోవడం పెద్ద సమస్య అయి ఉండేది కాదు.

భారత ప్రభుత్వం సెక్రటేరియట్ నిర్మాణానికి కొంత సహాయం ఇచ్చింది. అందులో 20–30 కోట్లు పెడితే ఈ హాస్టల్స్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసి ఉండవచ్చు.

కావాలంటే దగ్గర్లో ఏదో ఒక పెద్ద హోటల్ తీసుకుని వారికి ఎంతో కొంతచెల్లించి దాన్ని తాత్కాలికంగా ఉపయోగించుకుని ఉండవచ్చు. కాని ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ఒక గొర్రెల మందనో, గొడ్ల మందనో తీసుకువెళ్లినట్లు ఉద్యోగులను తీసుకుపోవడం దారుణం. దీనిపై ఎటువంటి నిరసన లేకపోవడం అనేది ఉద్యోగుల నాయకత్వంలో ఉన్న పెద్ద లోపం. లేకపోతే అదొక పెద్ద సమస్య అయి ఉండేది. నాయకులను మేనేజ్ చేశారు.

మొత్తం ఇక్కడున్న దాన్ని తరలించడం వల్ల పెద్ద ఎత్తున ఖర్చు కూడా అయింది. ఇక్కడ పెట్టిన ఖర్చు వృధా అయిపోయింది. అక్కడ కొత్తగా ఖర్చు అయింది. డబ్బులు ఎలాంటి జవాబుదారీ లేకుండా మంచినీళ్లలా ఖర్చు పెట్టడం ఈ ప్రభుత్వానికి పరిపాటి అయింది.

ఏమైతేనేం ఓట్ ఫర్ నోట్ కేసు వల్ల చంద్రబాబు బలహీనం కావడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగింది.

# [ 9 ]

## కేసిఆర్‌తో సంబంధాలు

ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకోసం నేనెంత పోరాడినా, తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్‌కు నేనంటే మంచి అభిప్రాయమే ఉండేదని తెలిసింది.

'మీరంటే ఆయనకు అభిమానం.. మీ నిజాయితీని ఆయన గౌరవిస్తారు..' అని రాజీవ్ శర్మ ఒక సందర్భంలో చెప్పారు.

నేను కేసిఆర్ ను ఒకటి రెండు సందర్భాల్లో తప్ప కలుసుకోలేదు. కలుసుకోవాల్సిన అవసరం రాలేదు.

2015 డిసెంబర్ లో కేసిఆర్ ఆయుత చండీ యాగం తలపెట్టినప్పుడు మాత్రం ఆయనను కలుసుకునే అవకాశం లభించింది. అప్పుడు నేను ఛీఫ్ సెక్రటరీగానే ఉన్నాను.

అప్పటికి నాకు ఆహ్వానం రాలేదు. యాగనిర్వాహకుల్లో ఒకరైన వెంకట రమణ శర్మ ఒకరోజు నాకు ఫోన్ చేశారు.

'యాగానికి ఎప్పుడు వస్తున్నారు సార్' అని ఆయన అడిగారు.

'నాకు ఆహ్వానం అందలేదండీ' అని చెప్పాను.

ఆయన ఆశ్చర్యపోయారు. 'మీకు ఆహ్వానం లేకపోవడమేమిటి సార్, మీరు వస్తారన్న చర్చ కూడా జరిగింది. ఎక్కడో పొరపాటు అయినట్లుంది. ఉండండి. మీతో మళ్లీ మాట్లాడుతాను' అని ఫోన్ పెట్టేశారు.

సరిగ్గా మూడు నిమిషాల్లో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. 'ముఖ్యమంత్రి గారు మిమ్మల్ని యాగానికి రమ్మని చెప్పారు సార్.. మీరు వీలు చూసుకుని తప్పని సరి రావాలి.' అని అన్నారు. 'సరే వస్తాను' అని చెప్పాను

మరి కొద్ది సేపటికి హరీశ్ రావు నుంచి ఫోన్ వచ్చింది. 'సార్ ఎప్పుడు వస్తున్నారు.. చెబితే మేము అంతా లైనప్ చేసుకుంటాం' అన్నారు.

నేనిక ఆలోచించలేదు. 'ఈ సాయంత్రమే వస్తానండీ' అని చెప్పాను.

యాగం వద్ద నాకు హరీశ్ రావు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఎక్కడా ఇబ్బంది రాకుండా నన్ను లోపలికి తీసుకెళ్లారు.

అప్పుడే పూజ అయిపోయింది. అనంతరం పళ్లు, హవిశ్శేషాన్ని కేసిఆర్ తాను తీసుకోకుండా నాకిమ్మని చెప్పారు. మామూలుగా చేతులు చాచి తీసుకోకుండా పైన పంచె పట్టుకుని ఎలా తీసుకోవాలో ఆయనే వివరించారు. లేచి వెళతానంటే తర్వాత కార్యక్రమం ముగిసే దాకా కూర్చోమని చెప్పారు. ప్రసాదం తీసుకొమ్మన్నాడు.

నేను వెళుతుంటే మర్యాదగా సాగనంపేందుకు ముందుకు వచ్చారు.

సరిగ్గా అదే సమయంలో నేను 'సార్, చిన్నమాట' అన్నాను.

కేసిఆర్ నా వైపు చూశారు. 'చెప్పండి' అన్నారు.

'సార్. ఆంధ్రప్రదేశ్‌లో నా చొరవవల్ల బ్రాహ్మణ కార్పోరేషన్ ఏర్పాటు చేశాను. కాని తెలంగాణలో బ్రాహ్మణుల పరిస్థితి ఆంధ్రా బ్రాహ్మణుల కంటే చాలా దారుణంగా ఉన్నది. మీరంటే బ్రాహ్మణులకు ఎంతో అభిమానం. ఇక్కడ కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేసి బ్రాహ్మణులను ఆదుకోండి.' అన్నాను.

కేసిఆర్ ముఖం విప్పారింది. బొటన వేలు చూపించి 'డన్' అన్నారు.

కొన్ని నెలల తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ మేధోమధనం ఏర్పాటు చేసి ఆ సమావేశానికి నన్ను ఆహ్వానించారు. అప్పటికి నేను పదవీ విరమణ చేసి ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ అయ్యాను. కేసీఆర్ వస్తూనే 'కృష్ణారావు గారు, వచ్చారా?' అని నన్ను చూసి ఆప్యాయంగా పలకరించారు.

సుదీర్ఘంగాజరిగిన ఈ సమావేశంలో నాతో పాటు సాంస్కృతిక శాఖ సలహాదారు కె. వి. రమణాచారి, పార్లమెంట్ సభ్యుడు కాప్టెన్ లక్ష్మీకాంతరావు కూడా పాల్గొన్నారు. ఆయన కోరిక మేరకు నేను ఆంధ్రప్రదేశ్‌లో బ్రాహ్మణుల కార్పొరేషన్ ఏవిధంగా ఏర్పరిచానో, అది ఎలా నడుస్తుందో వివరించాను. బ్రాహ్మణుల సమగ్ర అభివృద్ధిలో భాగంగా బ్రాహ్మణ సదనం నిర్మించాలని ఈ సమావేశం తీర్మానించింది. ఈ సదనం పనులను వేగవంతం చేసేందుకు కమిటీని నియమించి నన్ను, మాజీ డీజీపి అరవిందరావును ప్రత్యేక ఆహ్వానితులుగా వ్యవహరించాలని కోరారు.

దీనికనుగుణంగానే తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేశారు. 200 కోట్లు కేటాయించారు. ఆరోజు సమావేశంలో నన్ను అరవిందరావుగారిని కమిటీలో ఉండమన్నారు. క్రిందిస్థాయి రాజకీయంవలన ఇది కార్యరూపం దాల్చలేదు. ఇక బ్రాహ్మణపరిషత్ ఏర్పడిందేకాని దాని కార్యక్రమాలు పుంజులోలేదు. అధికారుల స్థాయిలో ఆటంకాలేర్పడ్డాయి. ఇచ్చేవాడున్నా తెచ్చుకునే సామర్థ్యం లోపించింది. ఆ సంస్థ కుంటినడక నడుస్తున్నది. ఈ అంశంలో ఆయన నిబద్ధతని శంకించాల్సిన అవసరం లేదు. అదేవిధంగా అర్చకుల సంక్షేమం విషయంలో కూడా.

# 10

## ఎప్పుడు, ఎలా, ఎందుకు చెడింది?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేను ఛీఫ్ సెక్రటరీ కావడం తృటిలో తప్పిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత శేష ఆంధ్రప్రదేశ్‌కు ఛీఫ్ సెక్రటరీ అవుతానని నేను అనుకోలేదు. కాని తెలుగుదేశం వేసుకున్న సామాజిక వర్గాల లెక్కల మూలంగా నాకు యాదృచ్ఛికంగా ఛీఫ్ సెక్రటరీ పదవి దక్కింది.

కాని నేను ఛీఫ్ సెక్రటరీ అయిన రెండునెలల్లోనే తనకూ, నాకూ భావసారూప్యత అంతగా లేదన్న విషయం చంద్రబాబు గ్రహించినట్లున్నారు.

గ్రహించిన తర్వాత కీలకమైన నిర్ణయాల్లో నన్ను విశ్వాసంలోకి తీసుకోవడం మానివేశారు.

నాకు తెలియకుండా నిర్ణయాలు జరిగేవి.

నేనూ నా స్థాయి తగ్గించుకుని కలిసిపోవాలని ప్రవర్తించలేదు. నాకు నేను ఒక పరిధి ఏర్పర్చుకుని పనిచేయడం ప్రారంభించాను. చంద్రబాబు సమీక్షించని ప్రాజెక్టులు, కార్యక్రమాలపై దృష్టి పెట్టి ఛీఫ్ సెక్రటరీగా ప్రభుత్వ వ్యవస్థ సవ్యంగా సాగేలా చూసుకో సాగాను.

తమకు అనుకూల నిర్ణయాలు తీసుకునేందుకు నేను అడ్డుగా ఉంటానని భావించారేమో నన్ను ఒకటి రెండు సార్లు తప్పించే విషయం అంతర్గతంగా చర్చించినట్లు తెలిసింది. ఇద్దరు అధికారులను నా స్థానంలో తీసుకోవాలని రెండు తడవలు ఈ చర్చలు జరిగాయని నా సమాచారం. కాని చివరకు తుదినిర్ణయం తీసుకునే లోపే నా పదవీ కాలం ముగిసింది.

నా పదవీ విరమణ గురించి దాదాపు అన్ని పత్రికలూ రాసి నా సేవల్ని మెచ్చుకున్నాయి. ద హిందూ పత్రికలో వచ్చిన ఈ వార్తే ఇందుకు ఉదాహరణ.

## స్మృతి పథంలో నిలిచిపోయిన కృష్ణారావు పదవీ కాలం

*ఆంధ్ర ప్రదేశ్ పరిపాలన అధినేతగా పదవీవిరమణచేసి తన వారసుడు ఎస్. పి. టక్కర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న ఛీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావు పదవీకాలం విశిష్టమైనదీ, సవాలుతో కూడుకుని ఉన్నదీ అని చెప్పాలి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఏర్పడిన సంక్లిష్ట పరిస్థితుల్లో ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజధానిని విజయవాడకు మార్చాలని నిర్ణయించిన తర్వాత ఆయన హైదరాబాద్, విజయవాడల మధ్య లెక్కలేనన్ని సార్లు తిరిగారు. ఆయనంత ప్రయాణించిన ఛీఫ్ సెక్రటరీ మరొకరు లేరనే చెప్పాలి.*

*'మొదటి అయిదారు నెలలు విభజన అంశాల వల్ల, కేంద్రం రెండు రాష్ట్రాల మధ్య సమస్యలను పరిష్కరించడానికి అంత శ్రద్ధ చూపకపోవడం వల్ల నా పదవీ కాలం ఉద్రిక్త భరితంగానే గడిచింది. అయితే నా పదవిని మొత్తం మీద సంతృప్తికరంగానే నిర్వహించానని చెప్పాలి. ఈ కాలమంతా పనిచేయడంలోనే నేను ఆనందాన్ని అనుభవించాను' అని కృష్ణారావు అన్నారు. రెండు రాష్ట్రాలు ఉద్రిక్తతలు పెరగకుండా సమన్వయంగా పనిచేయాలని ఆయన ఆశించారు. కృష్ణారావు తన మనసులో ఉన్న భావాలను బయటకు వ్యక్తం చేసేందుకు ఏనాడూ వెనుకాడలేదు. విజయవాడకు పరిపాలనను మార్చాలన్న ప్రభుత్వ ఎజెండాను ముందుకు తీసుకువెళ్లేందుకు ఆయన స్వభావం తోడ్పడిందనే చెప్పాలి. హైదరాబాద్ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పుడు విజయవాడ వెళ్లడానికి మొదట్లో ఉద్యోగులు మొరాయించినప్పటికీ కృష్ణారావు అస్థిరత చాలా కాలం కొనసాగకుండా చూశారు. ఉద్యోగుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా విజయవాడకు వెళ్లిన ఉద్యోగుల పిల్లల స్థానిక ప్రతిపత్తిపై రాష్ట్రపతి ఉత్తర్వుల నేపథ్యంలో వ్యక్తమైన ఆందోళనలను ఆయన కేంద్రం వద్ద ప్రస్తావించారు. ప్రభుత్వ ఎజెండా ముందుకు తీసుకువెళ్లేందుకు, కేంద్ర పథకాలకోసం భారత ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు,*

*14వ ఆర్థిక సంఘం సిఫారసుల దృష్ట్యా రెవిన్యూ లోటు భర్తీ కోసం ప్రత్యేక గ్రాంటును పొందేందుకు, విజయవాడలో ముఖ్యమంత్రి, ఛీఫ్ సెక్రటరీ కార్యాలయాలను నెలకొల్పేందుకు, పారిశ్రామికీకరణను ప్రోత్సహిం చేందుకు, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన వారితో తరచూ సంప్రదించేందుకు, గ్రీన్ ఫీల్డ్ అమరావతి రాజధానికి శంకుస్థాపనకు సన్నాహాలు చేసేందుకు ఆయన చేసిన కృషి చెప్పుకోదగ్గది. ఈ బాధ్యతల నిర్వహణకు ఆయన ఎన్నో సమావేశాలను ఏర్పాటు చేశారు. హుద్‌హుద్ తుఫాను సందర్భంగా తన పరిపాలనలో అతి పెద్ద సవాలును ఎదుర్కొన్నానని ఆయన అంగీకరించారు. విశాఖ వెళ్లిన ముఖ్యమంత్రికి ఏర్పాట్లు చూడడం నుంచి తుఫాను దెబ్బతిన్న ప్రాంతాలకు నిత్యావసర వస్తువులు అందేలా చూడడం ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. గోదావరి పుష్కరాల తొలిరోజు తొక్కిసలాటి జరిగి కొందరు మరణించినప్పటికీ భారీ స్థాయిలో ఈ పుష్కరాలను ఆయన నిర్వహించారు. సింగపూర్ ప్రభుత్వంతో ముఖ్యమంత్రి సమావేశాలు జరిపిన తర్వాత తదుపరి చర్చలకు కృష్ణారావు వెళ్లారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికాలో ప్రవాస భారతీయ దివస్ ఉత్సవాలకు హాజరయ్యారు. ఇండోయూరోపియన్ బిజినెస్ ఫోరం నుంచి ప్రతిభా పురస్కారాన్ని స్వీకరించేందుకు బ్రిటన్ వెళ్లారు. బ్రిటిష్ ప్రదర్శన శాలనుంచి అమరావతికి బౌద్ధ అవశేషాలు, కళాఖండాలను తీసుకువచ్చేందుకు ఆయన చర్యల్ని ప్రారంభించారు. తన స్థానంలో ఛీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరిస్తున్న టక్కర్‌కు రాజధాని నిర్మాణం, మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని మార్చడం, నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడం, ఆర్థిక వనరుల నిర్వహణ వంటి కీలక ప్రాధాన్యతలు ఉన్నాయని ఆయన చెప్పారు. (ద హిందూ, జనవరి 29, 2016)*

పదవీ విరమణ తర్వాత మరో పది పదిహేనేళ్లు సమాజానికి సేవ చేయాలని నేను అనుకున్నాను. నాకు చిన్నప్పటినుంచీ నా స్వంత సామాజిక వర్గానికి సేవ చేయాలన్న ఆలోచన ఉన్నది. అన్ని వర్గాలకూ ఏదో రకంగా మేలు జరుగుతుంది కాని బ్రాహ్మణులకు మాత్రం ఆర్థికంగా, సామాజికంగా మేలు చేయాలని ఆలోచించేవారే లేరు. చాలా మంది పేద బ్రాహ్మణ విద్యార్థులు చదువుకోలేని

పరిస్థితుల్లో ఉన్నారు. చిన్న గుళ్లలో అర్చకుల పరిస్థితి మరీ ఘోరంగా ఉన్నది. వేద మంత్రాలకు విలువలేని పరిస్థితి నెలకొన్నది.

అందువల్ల నేను బ్రాహ్మణుల కోసం క్రియాశీలకంగా పనిచేయాలని నిర్ణయించుకున్నాను. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు అప్పటి వరకు చైర్మన్‌గా ఎవర్నీ నియమించలేదు.

దానికి సంబంధించిన ఫైలే పట్టుకుపోయాను. 'నాకు ఛీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ పదవి అక్కర్లేదు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వండి' అని అడిగాను. ఆయన సరేనని దానికి ఒప్పుకున్నారు.

ఈ కార్పోరేషన్ అప్పటికే ఏర్పడి పనిచేస్తూ ఉన్నది. దీని ఏర్పాటుకు ముఖ్యకార్యదర్శిగా నావంతు కృషి చేశాను. తర్వాత దీనికి ఎండిని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాను. అప్పుడు 'ఇదం బ్రాహ్మం' అనే పేరుతో సీనియర్ జర్నలిస్టు ప్రభృతులతో బ్రాహ్మణుల ప్రయోజనాలకోసం ఒక కోర్ గ్రూప్ సమావేశాలు జరుగుతుండేవి. ఈ సమావేశంలో వెంకట్ చంగవల్లి అన్న వ్యక్తి పేరు ప్రస్తావనకు వచ్చింది. ఆయన వరంగల్ ఎన్ ఐ టి నుంచి బిటెక్, అహ్మదాబాద్‌నుంచి ఐఐఎం చేశారు. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి హోం, ఆరోగ్య విభాగాల్లో సలహాదారుగా ఉన్నారు. ఆయనను కార్పొరేషన్‌కు ఎండిగా ఉండమన్నాను. తాను వారానికి మూడు రోజులే పనిచేయగలనని, ఉత్తర ప్రదేశ్‌కు కూడా వెళ్లవలిసి ఉంటుందని ఆయన చెప్పారు. 'సరే మూడు రోజులైనా పనిచేయండి' అని చెప్పాను.

ఇక కార్పొరేషన్ బోర్డులో వ్యాపారవేత్తలు, మేధావులు ఉంటే బాగుంటుందని, వారిలో బ్రాహ్మణేతరులు కూడా ఉండడం మంచిదని భావించి నేను జిఎంఆర్, (జిఎంఆర్ గ్రూప్) గల్లా రామచంద్రనాయుడు (అమర్ రాజా గ్రూపు), కె. ఎస్. ఎన్. రాజు, (నాగార్జున గ్రూప్)లతో మాట్లాడి ఒప్పించి వారితో పాటు ఎస్.వి. రావు, సుందర్ లక్ష్మణ్‌లను సభ్యులుగా చేర్చి ఫైలు పంపాను. వెంకట్ చంగవల్లి పేరుతో పాటు ఈ పేర్లను చంద్రబాబు అనుమతి కోసం పంపాను.

కాని చాలా రోజులైనా ఈ ఫైలు తిరిగి రాలేదు. నేను స్వయంగా వెళ్లి వారిని ఎందుకు ప్రతిపాదించానో వివరించాను. 'లేదండీ మనం ఎవర్ని నియమించినా,

పార్టీకి ఉపయోగపడేవారు కావాలి. మనకు కావల్సింది జెండాలు మోసేవారు. వీళ్లందర్నీ పెట్టుకుంటే ఎన్నికల్లో ఎలా ఉపయోగం?' అని చంద్రబాబు ప్రశ్నించారు.

నేనేమీ మాట్లాడలేదు.

ఎంతో ప్రయత్నించిన తర్వాత చివరకు ఈ కార్పొరేషన్‌కు ఎండీగా కేవలం వెంకట్ చంగవల్లి పేరును మాత్రమే అంగీకరించి ఫైలును వెనక్కు పంపారు. మిగతా వారి పేర్లను తిరస్కరించినట్లేననీ అర్థం అయింది. అంటే ఆయనకు బ్రాహ్మణుల సమగ్ర సంక్షేమం కాక పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పకనే చెప్పారు.

తర్వాత ఈ కార్పొరేషన్ తో కలిసి పనిచేసేందుకు బ్రాహ్మణ్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటుచేశాను. ఆర్థికంగా బలహీనంగా ఉన్న బ్రాహ్మణులకు ఆర్థిక సాయం చేయడం ఈ సంస్థ ఉద్దేశం. దానికి సిఈఓగా లండన్ యూనివర్సిటీలో ఎకనమిక్స్, మేనేజిమెంట్‌లో పట్టాపొంది, ఢిల్లీలో ఐఐటిలో ఎలెక్ట్రానిక్ ఇంజనీరింగ్ చేసిన అభిజిత్ జయంతిని నియమించాం. ఆయన స్టాన్‌ఫర్డ్, హార్వర్డ్ యూనివర్సిటీల్లో డిప్లొమాలు చేశారు. పునరుత్పాదక ఇంధన రంగం. పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో వ్యాపారం చేస్తున్న ఆయన ప్రపంచ బ్యాంకుకు సలహాదారు కూడా. ఈ సొసైటీకి కార్పొరేషన్ నుంచి రు. 20 కోట్లు తొలివిడత నిధులను బదిలీ చేశాం.

కాని బ్రాహ్మణ కార్పొరేషన్ ప్రతిష్ఠాత్మకంగా, ఒకఅత్యున్నత సంస్థగా కార్యకలాపాలు నిర్వహించడం కన్నా అది ఏదో సబ్సిడీలు పంచి పార్టీకి ఉపయోగపడే సంస్థగా మార్చాలన్నదే చంద్రబాబు ఉద్దేశంలా నాకు కనపడింది.

బహుశా నేను బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రావాలనుకోకపోతే ఆ సంస్థ చైర్మన్‌గా వేమూరి సూర్యనే పెట్టాలని చంద్రబాబు అనుకున్నట్లు తర్వాత తెలిసింది.

కార్పొరేషన్‌లో అలాంటి మనుషులే ఉండాలని చంద్రబాబు అనుకున్నా నేను ఈ కార్పొరేషన్ చైర్మన్ పదవి కోరడంతో దాన్ని నాకు కేటాయించాడు. మొదట్లో కొద్ది రోజులు నేను నా శైలిలో పనిచేస్తుంటే ఏమీ జోక్యం చేసుకోలేదు.

కాని తర్వాత తర్వాత ఊరుకోలేకపోయారు. ఆయనకు కార్పొరేషన్‌లో పార్టీ జెండాలు మోసేవారు, వారు విదిల్చే డబ్బులకోసం తమను భుజాన వేసుకుని బ్రాహ్మణులను పార్టీకి దాసోహం చేసేవారు కావాలి. వారిది చాలా పరిమిత దృష్టి.

నాది మొత్తం బ్రాహ్మణులకు సాధికారికత కల్పించి పార్టీతో ప్రమేయం లేకుండా బ్రాహ్మణులందరి అభ్యున్నతికి, వారి సమస్యల నివారణకు తోడ్పడడం, వారిని ఇతర పదవులు కూడా కోరే విధంగా పైకి తీసుకురావడం నా ఉద్దేశం. చరిత్రాత్మకంగా బ్రాహ్మణులకు జరుగుతున్న అన్యాయం గురించి నేను శాస్త్రీయంగా మాట్లాడేవాడిని.

కార్పొరేషన్ బ్రాహ్మణులకు మంచి పనులు చేస్తే ఘనత ఎవరికి దక్కుతుంది? అధికారంలో ఉన్న ప్రభుత్వానికే కదా.. అయినా నేను అవగాహనా సదస్సు పేరిట ఏర్పర్చే ప్రతి సమావేశంలోనూ చివర చంద్రబాబు పేరు ప్రస్తావించి ఈ సంస్థ వల్ల బ్రాహ్మణులకు ప్రయోజనాలు రావడానికి కారణం అధికారంలో ఉన్న ప్రభుత్వమేనని స్పష్టంగా చెప్పేవాడిని. పథకాల గురించి ఇతరులు మాట్లాడేలా చేసేవాడిని. అంతేకాని భజన చేయడం, వందిమాగధ గీతాలు ఆలపించడం నా వల్ల కాలేదు. ప్రతి లబ్ధిదారుడికి ముఖ్యమంత్రి సంతకంతో కూడిన లేఖ పంపేవాణ్ణి.

కాని హుందాగా ప్రవర్తించి దక్కాల్సిన క్రెడిట్ వ్యూహాత్మకంగా దక్కించుకోవాలని తెలుగుదేశం అధినేతకు అర్థం కాలేదు. అది నా ఆలోచనకూ, ఆయన ఆలోచనకూ ఉన్నతేడా. అది ఆయన ఆలోచనా పరిమితి. నా ఆలోచనా విస్తృతి వేరు.

అంతేకాక బ్రాహ్మణులు ఒక్కరే తమ హక్కులకోసం పోరాడితే సరిపోదని, వారు వైశ్యులతో కలిసి పనిచేస్తే ప్రయోజనాలు ఉంటాయని భావించాను. బ్రాహ్మణులు, వైశ్యులతో కలిసి చాలా సమావేశాలు నిర్వహించాను. దీన్ని మరింత విస్తరించి బ్రాహ్మణులకు సామాజిక న్యాయం జరగాలని, నామినేటెడ్ పోస్టుల్లో వారికి ప్రాధాన్యత నీయాలని చెప్పేవాడిని. అన్యాయం జరిగిన ఇతర వర్గాల గురించి బ్రాహ్మణులతో ప్రస్తావించేవాడిని.

ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి జరిగినప్పుడు నా అంతట నేను వెళ్లాను. ఈ సమావేశానికి నేను రావడంతో మంచి ప్రతిస్పందన లభించింది.

'గత చరిత్రను త్రవ్వుకుని ప్రయోజనం లేదు. ఇవాళ బ్రాహ్మణులు, దళితులు కలిసి సామాజిక న్యాయం కోసం పోరాడాల్సిన అవసరం ఉన్నది. మన ప్రయోజనాల

మధ్య వైరుధ్యం లేదు. బ్రాహ్మణులు ఒక అడుగు వేస్తే దళితులు వంద అడుగులు వేస్తారు.' అని అన్నాను. దీనితో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

బ్రాహ్మణ కార్పొరేషన్ తర్వాతి కాలంలో అంబేద్కర్ జయంతి, బాబూ జగజ్జీవన్ రాం జయంతి కూడా నిర్వహించాలన్నది నా భావన. బ్రాహ్మణ కార్పోరేషన్ సమన్వయ కర్తలతో సమావేశాలు పెట్టాను. మల్లెపల్లి లక్ష్మయ్య, ఎం.జి.కె.మూర్తి లాంటి దళిత మేధావులతో ప్రసంగాలను ఇప్పించాను.

ఇది చంద్రబాబుకు ఇష్టం లేదు. నేను నాకిచ్చిన పరిమితికి మించి జనంలోకి వెళుతున్నానని అనుకుని ఉంటారు. నన్ను దూరం పెట్టడం ప్రారంభించారు.

దీనితో నాకు జనవరి 2017 నాటికి నన్ను తప్పిస్తారేమోనని అనుమానం కలిగింది. నా తరఫున ఒక వ్యక్తి వెళ్లి చంద్రబాబుకు కావల్సిన వాళ్లను కలిశాడు. 'మీరు చేస్తున్న కార్యకలాపాలకు చంద్రబాబు మద్దతు నీయకపోవచ్చు. కాని ఇప్పట్లో మిమ్మల్ని పంపించకపోవచ్చు.' అన్నాడు.

ఈ లోపు నీలాయపాలెం విజయకుమార్ అనే వ్యక్తి నాకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించాడు. అతడి పోస్టులు గమనించి నాకు ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్టు పెడితే అంగీకరించలేదు

తెలుగుదేశం ఎంపి జెసి దివాకర్ రెడ్డి విశాఖపట్టణంలో తనకు బోర్డింగ్ టికెట్ ఇవ్వనందుకు ఇండిగో అధికారిపై భౌతికంగా దాడి చేశాడు. ఒక విఐపికి తగిన ప్రాధాన్యత నీయాల్సిందేనని ఈ విజయకుమార్ అనే వ్యక్తి పోస్టు పెట్టాడు.

నేను ప్రతిస్పందించాను. 'విఐపిలను విమానాశ్రయంలో స్వాగతించేందుకు ప్రత్యేక సిబ్బంది ఉంటారు. వారు క్యూలో ఉండరు. ప్రోటోకాల్ అధికారి ఉంటారు. అప్పటికి కూడా ఆయన ఆలస్యం అయ్యారంటే ఇండిగో తప్పేమీ లేదన్నమాట. దివాకర్ రెడ్డి విషయంలో గట్టిగా వ్యవహరించినందుకు నేను ఇండిగో సిబ్బందిని ప్రశంసిస్తున్నాను. వారు కచ్చితంగా వ్యవహరించి, సకాలంలో విమానం తలుపులు మూసినందువల్లే విమానాలు సకాలంలో నడుపగలుగుతున్నారు. గతంలో ఊళ్లలో ప్రైవేట్ బస్సులు సర్పంచ్ వస్తున్నారంటే ఆగేవి. ఇప్పుడు మన వాళ్లు జాతీయ స్థాయి నాయకులైనా సర్పంచ్‌ల్లా ప్రవర్తిస్తున్నారు.' అన్నాను.

దీనికి ఆ విజయకుమార్ అనే వ్యక్తి అహం దెబ్బతిని ఉంటుంది. అతను ఫేస్‌బుక్‌లో ఉన్న కొన్ని నా పోస్టులను వైరల్ చేశాడు.

నేను ఫేస్‌బుక్‌లో ప్రవేశించటానికి ఒక ప్రస్థానం ఉంది. ఆగస్టులో అనుకుంటాను. కంచ ఐలయ్య గారు కొన్ని వ్యాఖ్యలు చేయడం దానికి నేను సమాధానం ఇవ్వడం జరిగింది. ఆరోజులలో కొందరు మిత్రులు సోషల్ మీడియాలో దీని మీద విస్తృత చర్చ జరుగుతున్నది మీకు తెలియదా అని అడిగారు. నిజంగానే నాకేమీ దీని గురించి తెలియదు. ఈ నేపథ్యంలో ఈ మాధ్యమం ఏమిటని కేవలం ఫేస్‌బుక్‌లో ఒక అకౌంట్ ఏర్పరచుకున్న. జనవరి, ఫిబ్రవరికల్లా ప్రభుత్వంతో సంబంధాలు సరిగా లేవు. అదే సమయంలో ఫేస్‌బుక్ లో కొన్ని ఫార్వడ్స్ చూశాను. దాదాపు రెండు సంవత్సరాల ఛీఫ్ సెక్రటరీ అనుభవంతో ఈ ప్రభుత్వాన్ని గురించి నా అభిప్రాయానికి ఆ ఫోస్ట్‌లకు చాలా సారూప్యత కన్పించింది.

ఒక సామాజిక వర్గ ప్రయోజనాల కోసమే ఈ ప్రభుత్వం పని చేస్తున్నదనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. ఆ ఫార్వడ్స్‌ను నేను నా మిత్రులతో ఫిబ్రవరి మార్చి ప్రాంతంలో పంచుకున్నాను. ఆనాటికి నాకు తెలియని ఫేస్‌బుక్ డైనమిక్స్ అవి మిత్రులకే కాక అందరికీ అందుబాటులో ఉంటాయని ఆ అవగాహన లేదు కాబట్టే తియ్యకుండా అట్లాగే ఉంచాను. ఈనాడు ఈ సమాజిక మాధ్యమాలనే నా అభిప్రాయాలను పంచుకోను ప్రధానసాధనాలుగా వాడుకుంటున్నాను. అది వేరే విషయం.

గౌతమీ పుత్ర శాతకర్ణికి వినోదపు పన్ను మినహాయించినప్పుడు కూడా అందులో చరిత్ర వక్రీకరించారని, దానికి వినోదపు పన్ను మినహాయించినందువల్ల తప్పుడు సంకేతాలు వెళతాయన్న ఉద్దేశంతో మిత్రులతో చర్చించాను.

అయితే ఈ విజయకుమార్ ఫిబ్రవరిలో పెట్టిన పోస్టులను జూన్‌లో తీసి వాటిని కాపీ చేసి తన వాల్ పై పంచుకుని వైరల్ చేసి ఐవైఆర్ తెలుగుదేశానికి వ్యతిరేకమన్నట్లుగా ప్రచారం చేశారు. తెలుగుదేశంలో కోర్ గ్రూప్ లో పంచుకుని రాద్ధాంతం చేశారు. వాటిని ప్రెస్ కు లీక్ చేశారు.

మొదట్లో ఈ రాద్ధాంతం అంతా విజయకుమార్ చేశారని పొరపాటు పడ్డాను. ఈ మొత్తం వ్యవహారంలో చంద్రబాబు నాయుడు శైలి ప్రతి చోటా కనిపిస్తుంది..

ఎవరిని తొలగించాలన్నా, ముఖ్యంగా ఆఫీసర్ లన్న వారిపై లీకులు ఇవ్వడం, వాళ్ల మనో స్థైర్యాన్ని దెబ్బతీయడం, ఆపైన తన అనుకూల పత్రికల్లో కొన్నాళ్లు కథనాలు రాయించడం, చివరకు వేటు వేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. నేను ప్రభుత్వ అధికారిగా ఉండి ఉంటే, నోరు మెదిపే వాడిని కాదు. పదవీ విరమణ చేసి ఉన్నాను కాబట్టి ఆయన తీరును ప్రజలకు తెలియజేసే అవకాశం లభించింది.

తర్వాత పథకం ప్రకారం విజయకుమార్, కేసి చేకూరి అనే ఎన్ ఎర్ ఐ, ఇంగ్లండ్ నుంచి రావిపాటి అనే వ్యక్తి వరుసగా ఫోన్ చేశారు. ఈ పోస్టింగ్స్ మీవేనా అని అడిగారు.

'నావో కాదో మీకెందుకు చెప్పాలి. అది ప్రభుత్వానికి సంబంధించిన విషయం మీకేమి సంబంధం' అని అడిగి ఫోన్ పెట్టేశాను.

అయినా వారు ఆగలేదు. పౌర సమాజం తరపున నన్ను రిజైన్ చేయమని కోరుతూ చేకూరి మరో పోస్టు పెట్టాడు. ఇదొక పెద్ద ప్రచారం లాగా సాగింది.

దీనితో లాభం లేదని నేను మరునాడు సాయంత్రం విలేకరుల సమావేశం పెట్టాలని నిర్ణయించుకున్నాను.

ఉదయం పదిగంటలకు తెలుగుదేశం ఎమ్మెల్సీ జనార్దన్ ఫోన్ చేశారు. 'కృష్ణారావు గారూ, మీరు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టడం అవసరమా?' అని. జనార్దన్ డబుల్ గేమ్ ఆడుతున్నారని నాకు తెలుసు.

'నా మీద అనవసర ప్రచారం జరుగుతోంది. వాటిపై వివరణ ఇవ్వాలనుకుంటున్నాను. పత్రికల్లో వార్తలుకూడా వచ్చాయి కదా' అని అన్నాను. 'అయినా ముఖ్యమంత్రి గారు నన్ను కలుసుకుంటానంటే నేను ప్రెస్ కాన్ఫరెన్స్ రద్దు చేసుకుంటాను. ఆయనకే వివరణ ఇస్తాను' అని చెప్పాను.

మరో 15 నిమిషాల తర్వాత తూర్పు గోదావరి జిల్లా బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ సమన్వయ కర్త ఫోన్ చేసి 'మీ స్థానంలో వేమూరి ఆనంద సూర్యను నియమిస్తున్నట్లు స్క్రోలింగ్ వస్తున్నాయి' అని చెప్పాడు.

వెంకట్ చంగవల్లి కూడా ఫోన్ చేశారు. ఆయనకు ఐజి ఇంటలిజెన్స్ ఫోన్ చేశారట. 'కృష్ణారావు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టడం అవసరమా' అని అడిగారట.

నేను మళ్లీ అదే జవాబు చెప్పాను. 'నాకు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టాలని లేదు. సిఎం కలుసుకుంటానంటే మానుకుంటాను' అనిచెప్పాను.

'సరే..' అని వెంకట్ ఫోన్ పెట్టేశారు. మళ్లీ ఆయన నుంచి ఫోన్ రాలేదు.

అంటే చంద్రబాబు నన్ను కలుసుకునేందుకు ఇష్టపడడం లేదన్నమాట. లేక ఆయన ఎవరు చెప్పినట్లో నడుచుకుంటున్నారన్నమాట. సాయంత్రానికి నన్ను తొలగించి వేమూరి ఆనంద సూర్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నాకు బ్రాహ్మణుల సంక్షేమం తప్ప మరేమీ పట్టకుండా పనిచేస్తూ వినూత్న పథకాలు ప్రవేశపెడుతూ వెళ్లాను. ఎక్కడకు వెళ్లినా నాకు బ్రాహ్మణులు పూర్ణకుంభ స్వాగతం పలికేవారు. ఇతర వర్గాల వారు కూడా గౌరవించేలా, బ్రాహ్మణులతో కలిసి పనిచేసేలా చేశాను.

కాని చిన్న చిన్న గుళ్లలో అర్చకుల పరిస్థితి చూస్తుంటే నాకు కడుపు తరుక్కుపోయేది. నేను బ్రాహ్మణ కార్పోరేషన్‌తోపాటు అర్చక సంక్షేమ ట్రస్టు చైర్మన్‌గా ఉన్నాను. 1987లో ఎన్టీఆర్ టిటిడిలో మిరాసీ వ్యవస్థను రద్దు చేయడం కోసం మొత్తం అన్ని ఆలయాల్లో వారసత్వ వ్యవస్థను రద్దు చేశారు. దీని వల్ల అర్చకులకే కాక వివిధ వర్గాలకు అన్యాయం జరిగింది. కాగడా పట్టే వారు, ఇతర సేవలు చేసే మంగలి, మాదిగ కులాల వారికి కూడా ఈనాములు రాకుండా పోయాయి. దీనితో చిన్న మందిరాల్లో అర్చక వ్యవస్థ దెబ్బతింది. దీనిపై చిలుకూరి బాలాజీ మందిరం ప్రధాన అర్చకుడు సౌందర రాజన్ ప్రచారం ప్రారంభించారు. తర్వాతి కాలంలో ఎన్టీఆర్ కూడా తాను తీసుకున్న నిర్ణయం వల్ల చిన్న అర్చకులను దెబ్బతీశామని గ్రహించాడు. కాని రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ఈ విషయంలో తగిన నిర్ణయం తీసుకునేలోపు ఆయన ప్రభుత్వం కుప్పకూలి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాడు. 2007లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చాక చిన్న మందిరాల్లో అర్చక వ్యవస్థను పునరుద్ధరిస్తూ చట్టాన్ని సవరించారు. కాని దానికి సంబంధించిన నిబంధనలను రూపకల్పన చేయలేదు. అప్పుడు ఐవి సుబ్బారావు దేవాదాయ విభాగం సెక్రటరీగా ఉన్నారు.

సిఎస్ గా ఉన్నప్పుడే ఈ విషయం నా దృష్టికి వస్తే నేను ఈ విషయం చేపట్టాను. చొరవ తీసుకుని నిబంధనలను రూపొందించి సిఎంకు పంపించాను. కాని చాలా

రోజులు సిఎం దాన్ని ఆమోదించకుండా పెండింగ్ లో పెట్టారు. చేద్దాం.. చూద్దాం. అనేవారు. ఈ లోపు నేను పదవీ విరమణ చేసి బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ అయ్యాను.

తర్వాత దాన్ని మళ్లీ సిఎంకు గుర్తు చేయడం ప్రారంభించాను. దాదాపు నాలుగైదు నెలల తర్వాత ఆయన ఫైలును అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌కు పంపించారు. నేను అడ్వకేట్ జనరల్‌కు కూడా చిలుకూరు ఆలయ అర్చకులు రంగరాజన్ గారితోపాటు కలిశాను. చిన్న ఆలయాల పరిరక్షణ హిందూమత పరిరక్షణలో వారి తండ్రి సౌందరరాజన్‌గారు కుమారులు రంగరాజన్, మురళిగారి నిబద్ధత ఎనలేనిది. నిబద్ధతే కాదు విషయ పరిజ్ఞానం కూడా అమోఘం. వారి నాన్నగారు చట్టంకోరలతో ఆలయాలు అనే శీర్షికన 1987 చట్ట సవరణ పర్యవసానాలను వివరిస్తూ విపులంగా పుస్తకం వ్రాశారు. విషయం వివరించాను. చిన్న మందిరాలను మనం కాపాడాల్సిన అవసరం ఉన్నదని, దీని వల్ల అన్యమతాల ప్రచారానికి ఆస్కారం ఉండదని చెప్పాను. చిన్న ఆలయాల వ్యవస్థలో అర్చకుల్లో కేవలం బ్రాహ్మణులే కాక ఇతర వర్గాలు కూడా ఉన్నారని, బోయలు, ముదిరాజ్‌లు, వీరశైవులు, చాత్తాద వైష్ణవులు తదితరులు కూడా అర్చకులుగా పనిచేస్తున్నారని చెప్పాను. అయినా సరిగా అర్చకత్వం చేస్తున్న వారికే ఇవ్వాలని, దానికొక పరీక్ష పెట్టి అర్హులైన వారికే మళ్లీ అర్చకత్వాన్ని కల్పించాలని సూచించాను.

నేను చెప్పినవన్నీ విన్న అడ్వకేట్ జనరల్ అయిదారు నెలలు ఏమీ మాట్లాడలేదు. చివరకు ఆయన కూడా నేను చెప్పింది అంగీకరించి ముఖ్యమంత్రికి పంపడంతో ఆయన సంతకం పెట్టారు. ఈ నిర్ణయం పై అభ్యంతరాలను ఆహ్వానిస్తూ ప్రిలిమనరీ నోటిఫికేషన్ కూడా జారీ అయింది.

ఎమ్మెల్సీ జనార్ధన్ ఈ నిర్ణయం వల్ల తెలుగుదేశం పార్టీకి సరైన రాజకీయ ప్రయోజనం దక్కాలని అన్నారు.

'ఇంత మంచి నిర్ణయం తీసుకున్న తర్వాత ఎందుకు దక్కకూడదు? ఓఎస్ అలాగే చేద్దాం' అన్నాను.

బ్రాహ్మణ కార్పోరేషన్ తరఫున మండల స్థాయి అసోసియేషన్ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించాను. చంద్రబాబు ఎట్టకేలకు అంగీకరించారు. ఆయనకు మనం పూర్తిగా ఘనత దక్కేలా చూడాలని చెప్పాను.

అర్చకులు ఉప్పొంగిపోయారు. చంద్రబాబు పేర అర్చనలు చేశారు. ఆయన చిత్రపటానికి పాలాభిషేకాలు జరిగాయి. కొందరు ఒకడుగు ముందుకు వేసి గుళ్లలోనే చంద్రబాబు ఫోటోలుపెట్టారు.

తెలుగుదేశం పార్టీ కూడా ఈ విషయం పెద్దగా ప్రచారం చేసుకుంది. తెలుగుదేశం పార్టీ ఫేస్‌బుక్ లోనూ, వెబ్‌సైట్‌లోనూ చంద్రబాబు ఫోటో వేసి ఆయన అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారంటూ ప్రశంసించింది. ఒక చోట చంద్రబాబుకు అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికి 'బ్రాహ్మణ బంధు' అనే బిరుదు కూడా ప్రదానం చేశారు.

కాని ఎవరో ఈలోపు చంద్రబాబు చెవులు కొరికారు. దీని వల్ల మిరాసీ వ్యవస్థ మళ్లీ పునరుద్ధరించినట్లవుతుందని అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

చంద్రబాబు నాయుడు వెనక్కు తగ్గారు. 'కృష్ణారావు నన్ను తప్పుదోవ పట్టించారు. దీని పర్యవసానాలు ఉన్నాయి. నేను దీన్ని ముందుకు తీసుకెళ్లదలుచుకోలేదు' అని చెప్పారు.. తిరుమలలో మిరాసీ వ్యవస్థను పునరుద్ధరించడానికి కొంతమంది అధికారులు ప్రయత్నిస్తున్నారని తర్వాత విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు.

కొన్ని విషయాలలో సమస్యను సవివరంగా అర్థం చేసుకోను చంద్రబాబు నాయుడు గారు సుముఖత చూపరు. అందుకు ఇది ఒక ఉదాహరణ. పునరుద్ధరించింది వారసత్వపు హక్కు మిరాసీ కాదు, మిరాసీ అంటే ఆదాయంలో భాగముంటుంది కాని అటువంటి ప్రతిపాదన ఈ రూల్సులో లేదు. కాని మూర్ఖంగా ఈ ప్రతిపాదనను ఆయన మనసులో ఏదో పెట్టుకుని వ్యతిరేకించాడు.

ఏమైతేనేం, ఫైనల్ నోటిఫికేషన్ మీద సంతకం పెట్టలేదు

ఫైనల్ నోటిఫికేషన్ మీద సంతకం పెట్టించేందుకు ఆయనను ఎంత కలుసుకోవాలని ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ లభించలేదు. నాకు తెలుసు. మిరాసీ వ్యవస్థకూ చిన్న మందిరాల్లో అర్చక వ్యవస్థను కాపాడే నిర్ణయానికీ సంబంధం లేదని. కాని ఆయన కలిస్తే కదా నేను వివరించడానికి..

కేంద్రమంత్రి సుజనా చౌదరికి కూడా ఈవిషయం చెప్పాను. 'సార్‌కు చెప్పండి ఇంతమంచి నిర్ణయాన్ని ఆపు చేయవద్దని, అర్హులైన వారికే ఇక్కడ మళ్లీ అర్చక వ్యవస్థలో భాగం ఉంటుంది. ఆదాయంలో వాటా ఉండదు..' అని చెప్పాను.

సుజనా చౌదరి.. 'అలాగా నేను సిఎం గారికి చెబుతాను.' అన్నారు.

కాని అప్పటికే సుజనాచౌదరి గారి పాత్ర తగ్గుముఖం పట్టింది. చిన్న బాబు ప్రాధాన్యం పెరిగింది.

ఇలా కాదని చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణను కలుసుకోవాలని నిర్ణయించాను.

బ్యూరో ఛీఫ్ మాధవ్ కు ఫోను చేశాను.

'సాయంత్రం రండి.. మా ఎండీగారు ఆఫీసులోనే ఉంటారు..' అని చెప్పారు. సాయంత్రం నన్ను బాగానే రిసీవ్ చేసుకున్నారు. రాధాకృష్ణకు నేను జరిగింది చెప్పాను. 'మిరాసీ వ్యవస్థకూ చిన్న మందిరాల్లో అర్చకుల ప్రయోజనాలను కాపాడడానికీ సంబంధం లేదన్నాను. టిటిడి మీద కోపంతో ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయం వల్ల వారి కడుపు కొట్టినట్లయింది' అని చెప్పాను. దీని వల్ల ఆలయాలు బాగుపడతాయని అన్య మత ప్రచారానికి ఆస్కారం తగ్గుతుందని చెప్పాను.

రాధాకృష్ణ నేను చెప్పింది అంగీకరించారు. 'మీరు సిఎంకు కలిసి చెప్పవచ్చు కదా'. అన్నారు.

'ఆయనను కలిసే అవకాశం లేదు. అందుకే మీ దగ్గరకు వచ్చాను.' అన్నాను.

'సరే నేను చెబుతాను. మీరు మీ అభిప్రాయం వ్యాసం రూపంలో రాసివ్వండి. ఎడిట్ పేజీలో ప్రచురిస్తాను.' అన్నారు.

**'అర్చకత్వం – మిరాసీ దారు'** అన్న శీర్షికతో నేను రాసిన వ్యాసం ఇలా ఉంది.

*'హైందవ ధర్మ సంప్రదాయంలో ఆలయాలకు చాలా ప్రాధాన్యం ఉన్నది. అర్చక వ్యవస్థ ఈ ఆలయ వ్యవస్థతో ముడిపడి ఉన్న వ్యవస్థ. అనాదిగా ఆలయాలనే తమ జీవితంలో ప్రధాన అంశంగా పరిగణించి నియమనిష్ఠలతో దైవకార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామాలలో ప్రజలకు ఒక స్నేహితుడు, దార్శనికుడు, మార్గదర్శిగా అర్చకులు తమ జీవితాన్ని గడిపేవారు. వారి సేవలకు సమాజమిచ్చిన ప్రతిఫలం వివిధ ఆలయాలలో వివిధ రూపాలలో ఉండేది. ప్రధానంగా సేవలకు ఇనాం రూపంలో కొంత భూమి దాని మీద ఫలసాయం వారికి వచ్చేది. ఈ ఇనాములు కేవలం*

అర్చకులకు మాత్రమే కాదు ధార్మికమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆలయాలలో మంగళవాయిద్యాలు ఆలపించే వారికి గుడిని శుభ్రంచేసే వారికి ఉన్నాయి. భక్తులు సంతోషంగా ఇచ్చిన దక్షిణ కూడా అర్చకులకు ఆదాయ రూపంలో చేకూరేది.

అర్చకత్వంలో ఆయా దేవాలయాల పరిణతిని బట్టి వివిధ కులస్థులు ఉన్నారు. ప్రధానంగా బ్రాహ్మణులు ఈ అర్చకత్వాన్ని నిర్వహించగా చాలా ఆలయాలలో తంబల్ల కులస్థులు, లింగాయతులు, చాత్తాద వైష్ణవులు, బలిజలు, బోయలు అర్చకత్వాన్ని నిర్వహిస్తున్నారు. చిన్న దేవాలయాలలో బ్రాహ్మణేతరులు దాదాపు 30శాతం అర్చకత్వం నిర్వహిస్తున్నారు. ధార్మిక కార్యక్రమాలు నిర్వహించే ఇతర ధార్మిక ఉద్యోగులను కలుపుకుంటే ఇది 40 శాతం వరకు ఉంటుంది. అర్చకులకు పారితోషికం ఇచ్చే విధానం తిరుమల తిరుపతిలో ఇంకొక ప్రత్యేక విధానంగా ఏర్పడింది. దీని ప్రకారం అర్చకులకు దేవాలయానికి వచ్చే ఆదాయంలో వాటాలు ఏర్పడ్డాయి. ఈ విధానాన్నే మిరాసీ విధానం అంటారు. మిరాసీ అనే పదం అర్థం సందర్భాన్ని బట్టి మారుతుంది. తమిళనాడులో భూస్వామ్య విధానంలో మిరాసీలు జమీందారుల లాగా భూమి యజమానులు. భూమి నుంచి వచ్చే ఆదాయంలో వీరికి వాటా ఉంటుంది. తిరుమల ఆలయంలో వారసత్వంతో కూడిన ఆదాయంలో వాటా విధానాన్ని మిరాసీగా పరిగణిస్తారు. తిరుమల ఆలయం ఆదాయం గణనీయంగా పెరగడంతో వీరి ఆదాయము అదేవిధంగా పెరిగింది.

ముఖ్యంగా నాలుగు కుటుంబాలు పెద్దింటి, గొల్లపల్లి, తిరుపతమ్మ, పైడిపల్లి కుటుంబాలు వంతుల ప్రకారం స్వామివారి ఆలయంలో అర్చకత్వం నిర్వహించేవారు. ఈ మిరాసీ విధానం తిరుమల ఆలయం ప్రత్యేకత. ఈ విధమైన వాటా విధానం మిగిలిన ఆలయాలలో లేదు.

తిరుమలలో ఆలయ ఆదాయాలు పెరగడంతో ఈ కుటుంబాల వారు గుమాస్తా అర్చకులను పెట్టుకొని వారితో స్వామివారి కైంకర్యాలు తమ పర్యవేక్షణలో చేయించడం మొదలెట్టారు. కొంత క్రమశిక్షణా రాహిత్యం

కనిపించడంతో ఎన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ విధానాన్ని మార్చడానికి ప్రయత్నం జరిగింది. ఈ ప్రయత్నం తిరుమలకు పరిమితమై ఉన్నట్లైతే ఇది చాలా అవసరమైన శుభపరిణామంగా మిగిలిపోయేది. కానీ ఆదాయంలో వాటాలతోపాటు చిన్న ఆలయాలకు ఉన్న సేవల ఇనాంను, ఆనువంశిక వారసత్వాన్ని రద్దు చేయడంతో ఈ సంస్కరణ చిన్న ఆలయాల నిర్వహణ మనుగడను కోలుకోలేని దెబ్బతీసింది. ఈ అంశాన్ని ఈ కేసును విచారించిన సుప్రీం కోర్టు అంగీకరించి చిన్న ఆలయాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలకు విధివిధాన రూపకల్పనకు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనికనుగుణంగా 2007 లో దేవాదాయ చట్టాన్ని సవరించి 1987 చట్టంలో మార్పులు తెచ్చే నాటికి అర్చకత్వంలో ఉన్న కుటుంబాలకు అర్చకత్వంలో కొనసాగే హక్కును గుర్తించడం జరిగింది. అర్చకులకు వచ్చే ఆదాయాన్ని దేవాలయ శాఖ ఒక ప్రత్యేకమైన విధానం ద్వారా ఏర్పరచవలసి ఉంటుంది. అంతకు పూర్వమున్న ఆదాయ విధానాలను ఈ చట్టం గుర్తించలేదు.

ఈనాడు చర్చిస్తున్న అర్చకత్వం మార్గదర్శకాలు, నిబంధనలు చట్ట సవరణను అనుసరించి చేస్తున్న నిబంధనలు మాత్రమే. చట్టమే ఆదాయపరమైన అంశాలను మినహాయిస్తూ వారసత్వాన్నే గుర్తించినప్పుడు ఈ నిబంధనల ద్వారా మిరాసీ వ్యవస్థ పునరుద్ధరణ జరుగుతుంది అనడం పనికట్టుకొని వక్రీకరించి దుష్ప్రచారం చేయడమే.

వారసత్వం, మిరాసీ రెండు ప్రత్యేకమైన అంశాలు. ఆలయ అర్చన వ్యవస్థలో వారసత్వానికి వ్యతిరేకమని ఎవరైనా చెపితే అది వేరే అంశం. కానీ ఈ నిబంధనల ద్వారా మిరాసీ వ్యవస్థ వస్తుంది అని ప్రచారం చేయడం కేవలం వాస్తవాలను దురుద్దేశంతో వక్రీకరించడం మాత్రమే.

ఇక ఈనాడు ఈ మార్గదర్శకాలను నిబంధనలను ఆమోదించడం ద్వారా దీని ప్రభావం తిరుమల తిరుపతి దేవస్థానంపై ఎంతవరకు ఉంటుంది అనే అంశాన్ని పరిశీలిద్దాం. 2007లో దేవాదాయ చట్టానికి వచ్చిన సవరణను పరిశీలించి2010లో టిటిడి ఆలయం అక్కడి అర్చకులకు

*వారసత్వ విధానాన్ని అమలుచేసింది. బోర్డు ఆదేశాలకు అనుగుణంగా అర్చకులు ఈ అంశాన్ని సుప్రీం కోర్టులో ప్రస్తావించి వారి వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు. ఈనాడు ఈ ఈ నిబంధనల ద్వారా చిన్న దేవాలయాలకు అమలుపరిచే విధానాన్ని 2010 లోనే టిటిడి అమలు చేసింది. ఈ నిబంధనలు ప్రభుత్వం ఆమోదించడం ద్వారా టిటిడిలో పరిణామాలుంటాయని చెప్పడం పూర్తిగా వాస్తవాలను వక్రీకరించడమే.*

*ఇక రెండవది ధార్మిక ఉద్యోగులలో వారసత్వ అంశం. ధార్మిక ఉద్యోగులు అనే పదాన్ని వాడటంలో ఉద్దేశం ఈ చట్ట సవరణ ఒక్క అర్చకులదేకాదు ఆలయ మతపరమైన బాధ్యతలు నిర్వహించే అందరికీ వర్తిస్తుంది. తిరుమల ఆలయంలో ఉదయాన్నే కాగడా బట్టి దారిచూపే సన్నిధి గొల్ల, మంగళవాయిద్యాలు వాయించేవారు, ఆలయ ప్రాంతాన్ని శుభ్రంచేసేవారు. అందరు ధార్మిక ఉద్యోగుల క్రిందకే వస్తారు. అర్చకుల సమావేశాలలో నేను ఒక అంశాన్ని ప్రస్తావిస్తూ ఉంటాను. 'సమాజం కోరుకున్నంత కాలమే ఈ అర్చకత్వాన్ని మీరు ఆనువంశికంగా నిర్వహించగలరు. సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా మీ పిల్లలను లౌకికవిద్య వైపు మళ్ళించండి' అని సలహా ఇస్తుంటాను. చాలామంది నుంచి దీనికివచ్చే సమాధానం ఒకటే. 'మాకు రోజూ తారసపడే సమీప సమాజం మమ్ములనే అర్చకత్వం నిర్వహించవలసిందిగా కాంక్షిస్తున్నది. ఇది మాకు తరతరాలుగా వచ్చిన వారసత్వ విధి. దీని నుంచి మేము వైదొలగదల్చుకోలేదు. ఎన్నికష్టనష్టాలైనా భరించి ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తాం.' అని.*

*మరి అర్చకత్వం వారసత్వంగా కొనసాగాలా లేదా అన్నది ఈ సమీప సమాజం నిర్ణయించాలా లేక ఇంకెవరైనా నిర్ణయించాలా అన్నది సమాజ నిర్ణయానికే వదిలేయడం సబబు. సమాజం కాంక్షించినంతకాలం కొద్ది మంది ఈ అంశాన్నినిర్ణయించి నిర్దేశించలేరు'.*

ఈ వ్యాసమైతే ప్రచురించారు కాని చంద్రబాబు వైఖరిలో మార్పు రాలేదు. చిన్న మందిరాల్లో అర్చకులు యథాప్రకారం దీన స్థితిలో కొనసాగాల్సిందే. 'బ్రాహ్మణ

బంధు' పేరిట బిరుదును స్వీకరించి సత్కారం పొందిన ఆయనకు ఇప్పుడేమి బిరుదు ఇవ్వాలి?

సమాంతరంగా మరి రెండు అంశాలు కూడా ముఖ్యమంత్రిగారితో సంబంధాలు దెబ్బతినడానికి కారణమైనాయి. మొదటి ఆరునెలలు ఎటువంటి ఇబ్బందులు లేవు. అక్టోబర్‌లో బ్రాహ్మణ సహకార సంస్థ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రిగారు వచ్చారు. ఆరోజు వచ్చిన శ్రీకాకుళం అరుంధతి సంఘం సభ్యులతో చాలాసేపు సంభాషించారు. రెండు గంటల సమయం కేటాయించారు. సభలో చాలా భావోద్వేగంతో బ్రాహ్మణులపై ఆయనకున్న గౌరవాన్ని తెలుపుతూ మాట్లాడారు. రాజకీయంగా వారికి తగిన ప్రాధాన్యాన్ని ఇస్తానని ఈ విషయంలో కృష్ణారావుగారి సూచనలు తీసుకుంటానని తెలిపారు. కాని డిసెంబరుకల్లా ప్రయోజకులు కాని ఆరుగురిని ఎటువంటి సూచనలేకుండా బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్లుగా నియమించారు. ఒక్కమాటైనా చెప్పలేదు.

తెలుగుదేశం పార్టీలో ఈ సామాజిక వర్గం ప్రాధాన్యం చాలా తక్కువ. సమర్ధత గల వ్యక్తులు ఈ సామాజిక వర్గం నుంచి ఈ పార్టీలో లేరు. ఉన్నా హర్షించే స్థితి ఆ పార్టీలో లేదు. డిసెంబరులో వాళ్ళు వచ్చి బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి నా కష్టాలు మొదలైయ్యాయని చెప్పాలి. అవగాహనారాహిత్యంతో లబ్ధిదారుల ఎంపికలో తమకు అధికారం ఉండాలని పట్టుపట్టారు.

తెలుగుదేశంలో వారు ఏర్పర్చుకున్న ఒక వ్యవస్థ చివరకు ఆ పార్టీనే ముంచివేస్తుందనడంలో సందేహం లేదు. పార్టీలో మొత్తం నిర్ణయం అంతా ఒక కోర్ గ్రూప్ తీసుకుంటుంది. అందులో ఉన్న వారంతా వారి సామాజిక వర్గానికి చెందినవారే. ఆశ్చర్యకరమైనదేమంటే వారి పిఎస్ లు కూడా అదే సామాజిక వర్గం నుంచే. కనుక వారు ప్రతి దాన్నీ అనుమానిస్తుంటారు. ప్రతిదానికీ భయపడుతుంటారు. అనవసరమైన గూఢచర్యం చేస్తుంటారు. ఎక్కడ ఏమవుతుందో నన్న అనుమానంతో పార్టీ నడుస్తుంది.

వారు నా కార్పొరేషన్‌లో వేలు పెట్టడం ప్రారంభించారు.

ఒక రోజు బాపట్లలో నియోజకవర్గ సమన్వయ కర్తలకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాను. ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యేని, ఎమ్మెల్సీని

పిలిచాం. ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీకి చెందిన సతీష్ అయితే. ఎమ్మెల్యే వైసీపీకి చెందిన కోన రఘు.

ఉదయం పదిన్నర గంటలకు సమావేశం ప్రారంభమైనా రఘు రాలేదు. నేను ఫోన్ చేశాను. 'ఏమయ్యా సమావేశానికి రాలేదు' అని అడిగాను.

'నాకు సరిగ్గా ఆహ్వానం లేదు'.. అని అన్నారు.

'సరిగా ఆహ్వానం అందలేదు.. అని అంటే?' అని అడిగాను.

'మీరు ఫోన్ చేయలేదు. మీ ఎండి ఫోన్ చేసి ఫలానా చోట మీటింగ్ జరగుతున్నది. అని సమాచారం మాత్రం ఇచ్చాడు. కాని ప్రాపర్‌గా ఆహ్వానించలేదు.' అన్నారు.

'ఏమయ్యా, మా ఉద్దేశం లో తప్పేమీ లేదు. రాతపూర్వకంగా చేశారా, ఫోన్ చేసి చెప్పారా అన్నది ముఖ్యం కాదు. మీరు వస్తే బాగుంటుంది' అని అన్నాను.

'నాకు మరో అరగంట సమయం పడుతుంది సార్' అన్నాడు. 'సరే రండి' అని చెప్పాను

చెప్పిన సమయానికి ఆయన మీటింగ్ కు వచ్చారు.

ఈ లోపు జనార్దన్ ఫోన్ చేశాడు. 'ఏం సార్ మీరు కోన రఘును పిలిచారట కదా' అని అడిగాడు.

'స్థానిక ఎమ్మెల్యే కదా. పిలవడం మన ధర్మం' అన్నాను.

'అదెట్లా నండీ. వేరే పార్టీ వాళ్లను ఎలా పిలుస్తారు?' అని అడిగాడు.

'ఇందులో తప్పేముంది. ఇది మానవవనరులకు సంబంధించిన ప్రభుత్వ సంస్థ. ప్రభుత్వ కార్యకలాపాల్లో స్థానిక ఎమ్మెల్యేని పిలవడం పరిపాటి కదా..' అన్నాను.

'అట్లాగా 'అని జనార్దన్ ఫోన్ పెట్టాడు. అలా ఉంటుంది వారి అనుమానం.

రెండోరోజు కోన రఘు తన హోటల్‌లో కోఆర్డినేటర్స్‌కు గెట్ టు గెదర్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సమావేశంలో ఈ ప్రస్తావన వచ్చింది. 'మమ్మల్ని ఆయన భోజనానికి పిలిచారు వెళ్లాలా సార్..' అని సమన్వయ కర్తలు అడిగారు.

'అది మీ ఇష్టం. నేను నా వ్యక్తిగత స్థాయిలో వెళుతున్నా. అది కూడా ఆయన తన ప్రైవేట్ హోదాలో పిలుస్తున్నారు' అన్నాను.

సాయంత్రానికి అందరూ విందుకు హాజరయ్యారు. అక్కడ బ్రాహ్మణుల సమస్యలు కొద్ది సేపు చర్చించుకున్న తర్వాత అంతా భోజనాలు చేసి తిరిగి వెళ్లారు. జిల్లా సమన్వయ కర్తకు చౌదరి పిఎస్ కుమార్ చౌదరి ఫోన్ చేసి 'ఏం మీ చైర్మన్ అందర్నీ కోన రఘు పార్టీకి తీసుకెళ్లాడట?' అని అడిగాడు. ఈ విషయం నా దృష్టికి వచ్చింది.

అడిగింది ఎవరు?.. 'ఒక పిఎస్. దానికి మేము స్పందించాలా.. పట్టించుకోకు. ఇగ్నోర్ దట్ ఫెలో..' అని నేను చెప్పాను.

బ్రాహ్మణుల సంక్షేమం కోసం అందర్నీ కలుపుకుని పోయి, అనేక పథకాలు ప్రవేశపెట్టి, అందరి అభిప్రాయంతో ప్రజాస్వామికంగా పనిచేయాలని నేను భావిస్తుంటే తెలుగుదేశం పార్టీలో మాత్రం నాపై అనుమానాలు వ్యక్తం చేయడం, నాపై నిఘా పెట్టడం బాధ కలిగించింది.

బహుశా వారు నన్ను తీసేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారేమోననిపించింది.

నేను ఒకే కేంద్ర కార్యాలయం పెట్టి జిల్లాల్లో సమన్వయకర్తలను నియమించాలని అనుకున్నాను. ప్రతి జిల్లాలో కార్యాలయం పెడితే వాటికే ఎక్కువ ఖర్చవుతుందని అనుకున్నాను. 'మీ పార్టీ నుంచి మీలో ఎవరినైనా పెట్టండి' అని ముందు తెలుగుదేశం వాళ్లకే చెప్పాను. 13 జిల్లాలకు 13 మంది సమన్వయ కర్తలు తెలుగుదేశం పార్టీ నియమించిన వారే.

'కార్పొరేషన్ సమావేశాలకు వైసీపీ వాళ్లు వస్తున్నారు' అన్నది నాపై ఫిర్యాదు. స్థానికంగా సమావేశాలు నిర్వహించేది వాళ్లు నియమించిన సమన్వయకర్తలే. 'వారెవర్ని పిలుస్తున్నారో నాకు తెలియదు. అంటే సీరియస్‌గా వారి పార్టీలో ఏదో లోపం ఉన్నదన్నమాట' అని నేను అన్నాను.

ఆ తర్వాత నియోజకవర్గం స్థాయిలో సమన్వయ కర్తలను నియమించాలని అనుకున్నాను. వారితో నియోజకవర్గ స్థాయి బ్రాహ్మణుల సమావేశాలను ఏర్పాటు చేయాలనుకున్నాం. అయితే ఇంత పెద్ద స్థాయిలో నియమించినప్పుడు పార్టీ వాళ్లను

నియమిస్తే గొడవ రేగుతుందని నేను అలా కాకుండా టెలిఫోన్ ఇంటర్వ్యూలు నిర్వహించి నియమించాం. దాదాపు 120 మందిని ఇలా నియమిస్తే తూర్పుగోదావరి జిల్లాలో ఒకరు వైసీపీకి అనుకూలంగా ఉన్న వారు అని తేలింది. కొత్త పేటలో స్థానిక వైసీపీ ఎమ్మెల్యేకోసం పనిచేసిన వ్యక్తిని సమన్వయకర్తగా నియమించారని ఫిర్యాదు వచ్చింది. ఆమెను రాజీనామా చేయమని కోరాను. చేయకపోతే నేను తీసేశాను. నాకు మళ్లీ తెలుగుదేశం కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. 'వైసీపీ వాళ్లను నియమిస్తున్నారట కదా?' అని. 'నాకు తెలియదు. 120 మందిలో ఒకరిద్దరు ఉండొచ్చు. అంతేకాక నా దృష్టికి వచ్చిన ఒకర్ని తీసేశాను' అని చెప్పాను.

అయినప్పటికీ వినకుండా అంతా వైసీపీ వాళ్లను నియమించారని ప్రచారం చేసి నాపై కక్ష కట్టారు.

బ్రాహ్మణ కార్పోరేషన్ విజయవాడకు మారిపోయాక పూర్తి స్థాయి ఎండి అవసరమని భావించి ఏపీపిఎస్ సి సెక్రటరీ వై వెంకట శేష తల్ప సాయిని అడిగాను. సాయి ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ చేసి బార్క్ లో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. భారత రెవిన్యూసర్వీసుకు ఎంపికయ్యారు. నాఅభ్యర్థన మేరకు సాయి బ్రాహ్మణ కార్పోషన్ కు ఎండిగా వచ్చేందుకు అంగీకరించారు. దానిపై ప్రతిపాదన పంపాను. అది ఆమోదించి ఆర్డరు ఇవ్వడం జరిగింది. కాని ప్రత్యామ్నాయం చూపినప్పటికీ ఏపీపీఎస్సి చైర్మన్ సాయిని రిలీవ్ చేయడానికి ఒప్పుకోలేదు. నేనే మార్చిలో చైర్మన్ వద్దకు వెళ్లి దాదాపు రెండు గంటలు ఆయనను ఒప్పించేందుకు ప్రయత్నించాను. జూన్ దాకా రిలీవ్ చేయడం కష్టమన్నాడు. 'తొందర లేదు. మీ పనులన్నీ అయ్యాక మే 15 వరకు రిలీవ్ చేసేలా చూడండి' అని చెప్పి వచ్చాను.

అట్లా ఒప్పించి వచ్చిన తర్వాత చైర్మన్ ప్రభుత్వానికి లేఖ రాసి సాయిని రిలీవ్ చేయడం కష్టమని చెప్పారు. దీనితో నేను చాలా బలంగా ప్రభుత్వానికి లేఖ రాశాను. ఈ వైఖరి సరైంది కాదని. ఏపీపీఎస్సి సెక్రటరీని బదిలీ చేసే జీవో కనుక అమలు చేయకపోతే ప్రభుత్వంలోనే కొందరు మిగతా వారికంటే పెద్దవారిమని భావిస్తున్నట్లు అర్థం చేసుకోవాల్సి ఉంటుందని గట్టిగా రాశాను. నేనున్నంతవరకూ చివరి నాలుగు నెలలూ ఎండి లేకుండానే కార్పోరేషన్‌ను నడిపాను. చివరకు జీఎంకే ఇన్‌ఛార్జిగా ఇచ్చారు.

ఈ లోపు నేను ఐఎస్‌బిలో పనిచేస్తున్న ఒక ఐఐఎం ఫెలోను గుర్తించి అతడిని ఎండిగా నియమించమని కోరాను. మీరు నాకు ప్రభుత్వం నుంచి నాకు కావల్సిన అధికారిని ఇవ్వడం లేదు కనుక ఈయనను నియమించడం మంచిదని చెప్పాను. ఆయన తనకు లక్షా 50 వేలు ఇవ్వమని కోరారు. ప్రభుత్వం నుంచి ఎవర్ని నియమించినా కూడా అంతే ఇవ్వాల్సి ఉంటుంది. అతడికి మూడేళ్లు కాంట్రాక్టు ఇవ్వాలని ప్రతిపాదించాను.

కాని నా ప్రతిపాదనపై ఆర్థిక కార్యదర్శి కొర్రీలు వేశారు. బహుశా ఛీఫ్ సెక్రటరీయే సిఎం కోరిక మేరకు ఈ కొర్రీలు వేయించి ఉంటారని నా అనుమానం. 'ఈ ఎంపికకు ప్రాతిపదిక ఏమిటి?' అని అడిగాడు. దానికి జవాబు కూడా రాసిపెట్టాను. ఈ లోపు నాకు వ్యతిరేకంగా ప్రచారం ఉధృతం అయి నన్ను తీసేశారు.

ఆఖరుకు కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ సిఈఓ నా అల్లుడని ప్రచారం చేశారు. అతడితో నాకు సంబంధం లేదు. సరైన వ్యక్తి గురించి ఆరా తీస్తుంటే వచ్చిన ప్రతిపాదనను అనుసరించి నిర్ణయం తీసుకున్నాము. అందుకే వేమూరి ఆనంద సూర్య తో నాకెంత బంధుత్వం ఉన్నదో, ఈ సిఈఓతో కూడా అంతే సంబంధం ఉందని చెప్పాను.

ఏదైనప్పటికీ వరుసగా నాకు వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాలు, నేను చేసిన ప్రతిపాదనలన్నీ ప్రభుత్వం పక్కన పెట్టడాలు, నాకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలను గమనిస్తే నన్ను పంపించేందుకు వారు రంగం సిద్ధం చేస్తున్నారని గ్రహించగలిగాను. నేను అనుకున్న విధంగానే జరిగింది.

నన్ను తొలగించిన తర్వాత బ్రాహ్మణ వర్గాల మనోభావం దెబ్బతినకుండా, తాను బ్రాహ్మణ వ్యతిరేకిగా ముద్రపడకుండా ఉండేందుకు చంద్రబాబునాయుడు కొన్ని పనులు చేశారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చిన ఎన్నో రోజులకు విశ్వనాథ్‌ను పిలిచి సన్మానం చేయడం, ప్రముఖ వాగ్గేయకారుడు, దివంగత మంగళంపల్లి బాలమురళీకృష్ణ విగ్రహావిష్కరణలో పాల్గొనడం, నన్ను దూషించిన బ్రాహ్మణులకు పదవులు ఇవ్వడం మొదలైనవి జరిగాయి.

కొద్ది రోజుల క్రితం జరిగిన విషయం ఇక్కడ ఒకటి చెప్పాలి.

రాష్ట్ర విభజన తర్వాత ఒక రోజు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ సిఎంను కలుసుకునేందుకు వచ్చారు. అప్పటికి ఆయన వృద్ధాప్యంలో ఉన్నారు. బాగా కష్టపడుతూ వచ్చినట్లు కనిపించింది. ఆ అపాయింట్‌మెంట్ నేనే ఏర్పాటు చేశాను.

సిఎంను ఆయన ఒకటే కోరిక కోరారు. 'జీవితంలో అన్నీ సాధించాను. సంగీతంలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. నాకు భారతరత్న పొందాలని ఉన్నది. నేను చనిపోయే లోపు ఆ అత్యున్నత పురస్కారం అందుకుంటే హాయిగా మరణిస్తాను' అని చెప్పారు.

సిఎం 'సరే' అని అన్నారు. కాని బాలమురళి వెళ్లాక ఆయన చెప్పిన దాన్ని మరిచిపోయారు. కేంద్రానికి కనీసం లేఖ కూడా రాయలేదు. ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని లేఖ పంపించారు.

నిజానికి బాలమురళీ కృష్ణ భారతరత్నకు అన్ని విధాల అర్హుడు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వాగ్గేయకారుడు ఆయన. ఎం. ఎస్ సుబ్బలక్ష్మి, బిస్మిల్లాఖాన్, లతామంగేష్కర్, పండిత్ రవిశంకర్, భీమ్‌సేన్ జోషీ తదితర ప్రముఖులకు భారతరత్న పురస్కారాలు అందాయి. బాలమురళీ కృష్ణ ఎందులో తక్కువ. కాని కుల రాజకీయాల్లో చిక్కుకుపోయిన వ్యవస్థలో ఆయన గురించి చెప్పేవారెవ్వరు? తెలుగువాడు కావడమే ఆయన దురదృష్టమా?

'బాలమురళి కాంస్య విగ్రహం పెట్టాను. పదిలక్షల రూపాయలు కేటాయించాను. మొత్తం బ్రాహ్మణ జాతి అంతా తనకు రుణపడి ఉండాలి' అన్నది చంద్రబాబు అభిప్రాయం. అది ఆయన స్థాయి. బతికున్న వ్యక్తికి భారతరత్న సిఫారసు చేసేందుకు ముందుకు రాని చేతులు, ఆయన పేరును పోనివ్వకుండా చేసిన చేతులు ఈ రోజు ఆయన జయంతి సమావేశంలో విగ్రహానికి దండ ఎలా వేయగలిగాయి?

# [11]

# గీత దాటిన మూర్తి

నేను మే 1, 2013న సిసిఎల్ ఏగా బాధ్యతలు స్వీకరించాను, అప్పటినుంచీ భూమి అంశాలపై దృష్టి కేంద్రీకరించడం ప్రారంభించాను. తెలంగాణ భూ అంశాలపై ఎక్కువ కేంద్రీకరించాను. ఎందుకంటే భూ అంశాలు తెలంగాణలో చాలా సంక్లిష్టమైనవి. సర్వే వ్యవస్థ అంత పకడ్బందీగా ఉండదు. రెండవది, నిజాం వారసులమని ప్రతి వాడూ ఏదో ఒక ఫర్మానా తెచ్చుకుని, ఎక్కడో ఏదో త్రవ్వి త్రవ్వి, భూములు తమవేనని చెప్పుకుంటారు.

కనుక ప్రభుత్వ భూములను పరిరక్షించి, సరిహద్దు గోడల్ని నిర్మించాలని నేను ప్రతిపాదించాను. ఇందుకు రు.30 కోట్లు బడ్జెట్ లో కేటాయించేలా చూశాను.

హైదరాబాద్‌లోనేకాదు మొత్తం రాష్ట్రమంతటా ఎక్కడెక్కడైతే ప్రభుత్వ భూములున్నాయో వాటిని, వివాదాస్పదంగా ఉన్నప్పటికీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న భూములను పరిరక్షించాలన్న ఉద్దేశంతో వాటికి సరిహద్దు గోడలు నిర్మించి వాటిపై గీతలు కూడా గీయించాను. ఆరోజు నేను చేసిన పనులు తర్వాత కాలంలో తెలంగాణలో తెలంగాణ ప్రభుత్వానికి కూడా ఉపయోగపడ్డాయి. నిర్దిష్టంగా ఒక బడ్జెట్ పెట్టుకుని చేశాను.

ఆ రోజుల్లో షేక్‌పేట తహసీల్దార్‌గా చంద్ర కళ అనే మంచి అధికారిణి ఉండేది. ఆమె ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారు.

హైదరాబాద్ తర్వాత నేను బాగా దృష్టి కేంద్రీకరించింది విశాఖపట్టణం.

విశాఖపట్టణంలో నాలుగు ప్రధాన కేసులు నా దృష్టికి వచ్చాయి.

మొట్టమొదటిది దసపల్లా హిల్స్ వ్యవహారం. సర్క్యూట్ హౌజ్ పక్కనున్న ప్రాంతాన్ని దసపల్లా హిల్స్ అంటారు. ఏ రకంగా చూసినా దసపల్లా హిల్స్ ప్రాంతం ప్రభుత్వ భూమే. అందులో సందేహం లేదు. కాని ఏళ్ల తరబడి దాన్ని వివాదాస్పదం చేసి దాన్ని ప్రైవేట్ భూమిగా మార్చారు. ఒక సిసిఎల్ఏ టైమ్ లో దీనిపై చక్కటి ఆదేశాలు కూడా జారీ చేశారు. దానిపై ఆక్రమణదారులు ఈ కోర్టుకు, ఆ కోర్టుకు వెళ్లి లిటిగేషన్‌లో పెట్టారు. ప్రభుత్వం తరఫున సరిగా వాదించేవారు లేకపోయారు. వాళ్ళతో పాటు ప్రభుత్వంలో ఉన్న పెద్దలు చేతులు కలిపి మొత్తం మీద దాన్ని ప్రైవేట్ పరం చేశారు. రాణీ కమలాదేవి అనే వ్యక్తికి ఆ భూమి ఇనామ్ లో ఉన్నదని చెప్పి తమ పరం చేసుకున్నారు.

ఈ అంశంలో చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించిన తహసీల్దార్ ఒకరుంటే ఆయనను నేను సస్పెండ్ చేశాను. నేనున్నంత కాలం అతడి విషయంలో గట్టిగా ఉన్నాను. నేను వెళ్లిన తర్వాత తిరిగి అదే స్థానంలోకి వచ్చాడు.

దీనికి అప్పటికే సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. అక్కడ శేషాద్రి అనే మంచి కలెక్టర్ ఉండేవారు. ఆయనతో రివ్యూ పిటీషన్ వేయించాను. దాన్ని కూడా ఛీఫ్ సెక్రటరీగా నేను పదవీ విరమణ చేసిన తర్వాత కొట్టేశారు. ఆపైన వివరణకోసం కలెక్టరుగా ఉన్న యువరాజు క్యూరేటివ్ పిటిషన్ వేశారు. దానిపై చంద్రబాబు సంతోషం వ్యక్తం చేయలేదని తెలిసింది. ఆ భూమిలో తెలుగుదేశం కార్యాలయాన్ని పెట్టుకోవడంతో పాటు చాలా మందికి ఇచ్చేశారు. అందులో పెద్ద తలకాయలు చాలా మంది ఉన్నారు.

ఈ అక్రమాలపై ఇప్పటికీ పోరాడవచ్చు. క్రింది నుంచి గట్టిగా పకడ్బందీగా సాక్ష్యాధారాలు నిర్మించి, మోసం ఎక్కడ జరిగిందో నిర్ధారించి, క్రిమినల్ కేసు వేసి గెలిచి మళ్లీ కొత్త వాస్తవాలతో పై దాకా పోరాడితే విజయం తప్పక లభిస్తుంది. కాని అందుకు బలమైన రాజకీయ పట్టుదల ఉండాలి. అలాంటిది ఇప్పటి ప్రభుత్వానికి ఉన్నదని అనుకోను. అలా జరిగితే కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి తిరిగి స్వాధీనం చేసుకుని రాష్ట్రం కోసం ఉపయోగించుకోవచ్చు.

రెండవది– భీముని పట్నం కోపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి సంబంధించిన వ్యవహారం. ఈ భూమి కేసులన్నీ 20 ఏళ్లనుంచి 30 ఏళ్ల నుంచీ తగాదాలో

ఉన్నాయి. ఏ భూమి కేసు అయినా సుదీర్ఘ పోరాటం చేయాల్సిందే. ఇది కూడా సుప్రీంకోర్టు దాకా వెళ్లి వాళ్లు గెలిచి వచ్చారు. అది కూడా పక్కా ప్రభుత్వ భూమి. దాదాపు 400 ఎకరాలు ఉంటుంది. అక్కడ ఎర్రమట్టి దిబ్బలున్నాయి కనుక మేము ఇవ్వలేమని వాదించినా ప్రయోజనం లేకపోయింది. ఈ ఎర్రమట్టి దిబ్బలను భారత జియోలాజికల్ సర్వే సంస్థ కూడా చారిత్రక స్థలంగా గుర్తించింది. ఈ సొసైటీ సభ్యులంతా విశాఖకు చెందిన వారు కాదు. దానిపై దర్యాప్తు చేసి పిటిషన్ వేయమని చెప్పాను. కాని అది ఏదశలో ఉందో తెలియదు. గట్టిగా పోరాడి ఉంటే ఇది ప్రభుత్వానికే దక్కేది.

మూడవది, రామకృష్ణ బీచ్ ప్రాంతంలో అదనపు భూమి ఉన్నది. అర్బన్ భూమి సీలింగ్ చట్టం క్రింద ప్రభుత్వానికి వచ్చింది. దానిమీద ఎవరో కన్నేసి డాక్యుమెంట్లు సృష్టించి అది ప్రైవేట్ భూమి అని, తమ కోపరేటివ్ సొసైటీకి వస్తుందని తీసేసుకున్నారు. దీని మీద అసెంబ్లీలో గొడవ జరిగింది. దాడి వీరభద్రరావు ఈ అంశాన్ని లేవనెత్తారు. దీనిపై సిసిఎల్ఏ తో విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆరకంగా ఆ ఫైలు నా దగ్గరకు వచ్చింది. ఈ భూమి కోసం ప్రభుత్వ స్థాయిలో చాలా అక్రమాలు జరిగాయని నాకు అర్థం అయింది. అక్రమ జీవోల వల్లే అక్రమణదారులకు ఆ భూమిపై అధికారం వచ్చింది. దీన్ని మొత్తం అధ్యయనం చేసిన తర్వాత దీనిపై పెద్దగా విచారణ జరిపించనక్కర్లేదని నాకు అనిపించింది. ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేస్తే చాలు అనుకున్నాను. జీవో రద్దు చేస్తే ఆక్రమించిన వారికి టైటిల్ పోయి ప్రభుత్వం స్వాధీనపరుచుకోవచ్చు అని ప్రభుత్వానికి లేఖ రాశాను. దర్యాప్తు కన్నా ఇది ముఖ్యం అని అనిపించింది.

కాని భూఆక్రమణదారు తెలివి ప్రయోగించి జీవో రద్దు చేయకుండా కేవలం దర్యాప్తు మాత్రమే చేయించమని కోరుతూ ప్రభుత్వం నేను పంపిన నివేదిక తిరిస్కరించేలా చేశాడు. ఇక చేసేది లేక నేను వెంటనే దర్యాప్తుకు తేదీలు ఇచ్చాను. ఆక్రమణదారు 'నేను రష్యావెళ్లాను, మరో దేశం వెళ్లాను' అని చెబుతూ తాత్సారం చేయడం ప్రారంభించాడు. 'అలాగా, అయితే మీరు వెళ్లిన విమానం టిక్కెట్లు చూపించండి' అని నోటీసు ఇచ్చాను. తుఫానులా అతడి వెంట పడ్డాను. ఆ వేడికి తట్టుకోలేక అతడు హైకోర్టుకు వెళ్లాడు. 'ఈయన ఇప్పటికే జీవోను రద్దు చేయమని ప్రభుత్వానికి రాశారు. మామీద ఇప్పటికే ఒక అభిప్రాయం ఏర్పర్చుకున్నారు.

కనుక దర్యాప్తు సాగించడానికి వీల్లేదు స్టే ఇవ్వండి.' అని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు స్టే ఇచ్చింది. నేను సిసిఎల్ఏగా ఉన్నంతకాలం విచారణ జరిపించలేకపోయాను.

చీఫ్ సెక్రటరీ అయిన తర్వాత నేను విశాఖ వెళ్లాను. అప్పుడు యువరాజ్ కలెక్టర్‌గా ఉన్నారు. 'యువరాజ్, అదేదో కేసు ఉన్నది. రామకృష్ణా బీచ్ దగ్గర ఆ భూములెలా ఉన్నాయో చూద్దాం పద..' అన్నాను. 'ఉన్నాయి సార్, బ్రహ్మాండంగా ఫ్లాట్లు వచ్చాయి.' అని యువరాజ్ చెప్పారు. పోయి చూస్తే గేటెడ్ కమ్యూనిటీలో అందమైన ఫ్లాట్లతో కూడిన కాలనీ నిర్మాణమై కనిపించింది. ఇక దాన్ని వెనక్కి తీసుకోవడం ఎవరి తరం కాదని అర్థమైంది. అతడు టైటిల్ తెచ్చుకుని, మునిసిపాలిటీ వద్ద అనుమతులు తెచ్చుకుని పెద్ద కాంప్లెక్స్ కట్టాడు. మన కళ్ల ముందే ఇది జరిగింది.

భూమి కేసుల్లో అధికారులు పోరాడితే గెలిచే అవకాశం లేదని నా అనుభవం స్పష్టం చేసింది. ఏ అధికారి అయినా ప్రభుత్వం ప్రయోజనాలను కాపాడాలని ప్రయత్నిస్తే ఆయనకు ఎప్పటికైనా ఓటమి తప్పదు. ప్రభుత్వం మీకు మద్దతు నీయదు. ప్రభుత్వం పైకి మీకు కొంతకాలం మద్దతునీయవచ్చు. మంచి ముఖ్యమంత్రో, మంచి రెవిన్యూ మంత్రో ఉంటే ఇది జరుగుతుంది. కాని భూమి మీద కన్ను వేసిన వారికి దీర్ఘకాల వ్యూహం ఉంటుంది. వారు ఎంతకాలమైనా తాము అనుకున్నది సాధించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలైనా చేస్తారు. గట్టి అధికారి ఉంటే అతడు తిరిగి వెళ్లేవరకూ అతడికి ఫైలు రాకుండా చూసుకుంటారు. అతడు వెళ్లిన తర్వాత తమకు అనుకూలమైన అధికారి వచ్చినప్పుడు ఫైలు చకచకా ముందుకు వెళ్లేలా చూసుకుంటారు. సరైన స్థాయిలో రాజకీయ నాయకులకు ముడుపులు చెల్లించి డీల్స్ చేసుకుంటారు. ఇక ఫైలు ఆగమేఘాలపై కదులుతుంది. జీపీలను మేనేజ్ చేస్తారు. అధికార్లను మేనేజ్ చేసి కోర్టులో ప్రభుత్వ అభిప్రాయం సరిగ్గా చెప్పకుండా చూసుకుంటారు. ఏదో ఒక రకంగా తమకు అనుకూలమైన ఆర్డర్ తెచ్చుకుని ముందుకు వెళతారు. ఇప్పుడు మియాపూర్ కుంభకోణమైనా, విశాఖ కుంభకోణమైనా, దీర్ఘకాలంలో ఆ భూమిని ప్రభుత్వం పరిరక్షించలేదని తెలుసుకోవాలి. మధ్యమధ్యలో మంచి అధికారులు వచ్చినా వారు ఏమీ చేయలేరు.

చివరిది, ఎంవిఎస్ మూర్తికి చెందిన గీతం యూనివర్సిటీ భూమి.

నేను సిసిఎల్ఏ గా ఉన్న సమయంలో గీతం యూనివర్సిటీ నుంచి ఒక అభ్యర్థన వచ్చింది. 'తమ యూనివర్సిటీకి అనుబంధంగా 34 ఎకరాల భూమి ఉన్నది. మాకు కేటాయిస్తే మా సంస్థ బాగా అభివృద్ధి అవుతుంది' అని కోరారు.

అప్పటికి రాష్ట్ర విభజనపై ఆమోద ముద్ర పడింది. సాధారణంగా అయితే ఈ భూమి విలువ చాలా ఉంది కనుక దాన్ని అలా కేటాయించడం సాధ్యపడదు. ఇక రాజధాని ఎక్కడో నిర్ణయం కాలేదు కనుక భూమిని వివిధ సంస్థలకు కేటాయించేందుకు జాగ్రత్తగా కాపాడుకోవాలి. అయినా దాన్ని భూ కేటాయింపుల కమిటీకి నివేదించాం. కమిటీ గీతం అభ్యర్థనను తిరస్కరించింది. ఈ భూమి ప్రజా ప్రయోజనాలకు అవసరం కనుక కేటాయించేందుకు కుదరదని స్పష్టం చేశాం.

ఎంవిఎస్ మూర్తి నాపై ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. నేను లొంగలేదు.

ఒకరోజు ఒక జర్నలిస్టు మూర్తి తరపున రాయబారానికి వచ్చారు.

అంతే కాదు, సిఎం ఆఫీసు నుంచి ఒత్తిడి పెరగడం ప్రారంభమయ్యింది.

ఒక సీనియర్ కాంగ్రెస్ నేత కూడా నాపై ఒత్తిడి తెచ్చాడు. 'మీరేమైనా రాయండి. కాని ఫైలు మాత్రం సిఎం ఆఫీసుకు పంపండి' అని కోరారు.

డబ్బు దగ్గర రాజకీయ ప్రయోజనాలు ఉండవు. మనీ ఈజ్ సెక్యులర్.

నాకు తెలుసు ఈ ప్రభుత్వం మూడు నెలల కంటే ఎక్కువ ఉండదని. ఎంవిఎస్ మూర్తికి ఈ భూమి రావడానికీ రాకపోవడానికీ మధ్య ఈ ఫైలు మాత్రమే ఊగిసలాడింది.

ఎంత ఒత్తిడి తెచ్చినా నేను ఫైలు పంపలేదు. ఈ విషయంలో శాశ్వతంగా బుద్ధి చెప్పాలని భావించి, హైదరాబాద్‌లో సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్‌ను, ఆదాయపన్ను కమిషనర్‌ను, కస్టమ్స్ కమిషనర్‌ను, ఇతర డిపార్ట్‌మెంట్ వాళ్లను పిలిచాను. 'మీకు విశాఖలో ఏమైనా భూమి కావాలా?' అని అడిగాను. వారికి నిజంగా అవసరం ఉన్నది. సెంట్రల్ ఎక్సైజ్ వాళ్లు మూడు ఎకరాలు అడిగారు. ఆదాయపన్ను వాళ్లు మరో రెండెకరాలు అడిగారు. సామాజిక సంక్షేమ శాఖ హాస్టల్ నిర్మాణానికి ఒక ఎకరం కావాలంది. ఇలా రకరకాల శాఖలు తమ అవసరాలను

వెల్లడించాయి. ప్రభుత్వ భూమిని, ప్రభుత్వ శాఖలకు కేటాయించేందుకు ఎవరి అనుమతి తీసుకోనవసరం లేదు... అందుకే ఈ 34 ఎకరాలు ఫలానా ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తున్నానని నేనే ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వానికి రాటిఫికేషన్ కొరకు పంపాను. ఫలానా ఫలానా విభాగాలు తమ అవసరాలకు భూమి కావాలని అడిగాయని, అందుకు తగ్గట్లుగా భూమిని కొలిచి ఆయా శాఖలకు కేటాయించి భూమిని స్వాధీనపరచవలసిందిగా నేను విశాఖ కలెక్టర్‌కు గట్టిగా చెప్పాను.

ఈ లోపు గీతం యూనివర్సిటీ వాళ్లు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. తాను యూనివర్సిటీ కోసం ఆ భూమిని అడిగానని, తనకివ్వకుండా ఉండేందుకే ఈ ప్రభుత్వ శాఖలకు కేటాయించారు అన్నది ఆయన అపీల్. కాని అప్పటికే భూమిని ప్రభుత్వ సంస్థలకు స్వాధీనం చేయడం జరిగిపోయింది. ఆ సంస్థలేవీ నిర్మాణాలు చేయలేదు. ఎందుకంటే స్టే ఉన్నదని ఆగిపోయాయి.

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ప్రభుత్వమే చూసుకుంటుందని నేను మిన్నకుండిపోయాను. మూర్తి ఒకటి రెండు సార్లు నా చుట్టూ తిరిగారు.

జిల్లా కలెక్టర్ 'ఏమి చేద్దాం సార్' అని అడిగారు. 'నీవు ఏం చేయగలిగితే అది చేయ్' అన్నాను ఎందుకంటే నేను కేసు బలంగా బిగించి పెట్టాను. దాన్ని సులభంగా విస్మరించలేరని నాకు తెలుసు.

నా ఛీఫ్ సెక్రటరీ పదవీకాలం పూర్తయ్యాక మళ్లీ కదల్చే ప్రయత్నం చేశారు.

2017 మే 17న కేబినెట్‌లో ఈ విషయం తీసుకువచ్చి ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూమిని రద్దు చేయాలని చంద్రబాబునాయుడు ప్రభుత్వం ప్రతిపాదించింది.

ప్రభుత్వానికి చెందిన భూములను కేటాయించేందుకు మార్గదర్శక సూత్రాలున్నాయి. ఒకటి – ప్రభుత్వ విభాగాలకు ప్రాధాన్యతనీయాలి. రెండవది – ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధాన్యతనీయాలి. మూడవది. అర్హులైన ప్రైవేట్ పార్టీలకు ఇవ్వాలి.

ఇలా మార్గదర్శక సూత్రాలున్నప్పుడు ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలకు, ప్రభుత్వ విభాగాలకు ఇచ్చిన భూమిని రద్దు చేసి ఇంకొకరికి కేటాయించాలని ప్రయత్నం చేయడం ఎంత ఘోరం.

మొదట చంద్రబాబు ఈ భూమిని ప్రభుత్వ రంగ సంస్థలకు రద్దు చేసి గీతంకు ఇవ్వాలన్న మూడ్‌లోనే కేబినెట్‌కు తీసుకువెళ్లాడు. గీతం తరుపున వాదించారు. 'మీకు తెలుసు కదా. గీతం యూనివర్సిటీ ఎంత ప్రతిష్ఠాత్మకమైనదో. ఆయన ప్రక్కనే ఉన్న భూమిని అడిగితే రాజశేఖర్ రెడ్డి కావాలని కక్ష కట్టి టార్గెట్ చేసి ఆ భూమి రాకుండా చేశారు' అని చంద్రబాబు చెప్పారని తెలిసింది.

దీనికి రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు అడ్డుపడ్డారు. 'మీరంటున్నది కరెక్టు కాదు సార్. ఇది రాజశేఖర్ రెడ్డి పీరియడ్‌లో జరిగింది కాదు. కిరణ్ కుమార్ రెడ్డి కాలంలో తీసుకున్న నిర్ణయం. ఇప్పుడు దాన్ని మార్చి మనం ఇవ్వడానికి ప్రయత్నించడం బాగుండదు. కరెక్టు కాదు' అని చెప్పారు.

సిఎం ఏమీ అనలేకపోయారు. 'కనీసం కేటాయింపులను రద్దు చేద్దాం' అని రద్దు చేయించారు. గీతంకు ఇవ్వలేదు కాని ప్రభుత్వ సంస్థలకు భూమి ఇవ్వడాన్ని రద్దు చేశారు.

తమ వ్యాపారాలను అక్రమంగా విస్తరించేందుకే కాపాడుకునేందుకే చాలా మంది రాజకీయాల్లో చేరుతారు.

నన్ను బ్రాహ్మణ కార్పోరేషన్ పదవి నుంచి తీసేశాక ఎంవిఎస్ మూర్తి 'దరిద్రం వదిలిపోయింది' అని వ్యాఖ్యానించారు. నిజమే. మరి వైజాగ్ లో 34 ఎకరాల దరిద్రంఉంది కదా మరి!

[12]

# రాజధాని రాజకీయం

జూన్ 2013లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత అందరికీ రాష్ట్ర విభజన తప్పదన్న విషయం అర్థమైంది.

రాజధాని ఎక్కడుంటే బాగుంటుందన్న విషయంపై చర్చలు ప్రారంభమయ్యాయి. అప్పుడు రఘువీరారెడ్డి రెవిన్యూ మంత్రి.

'ఈ అంశాన్ని పరిశీలించి రాజధాని ఎక్కడుండాలో సూచించండి.' అని నాకు చెప్పారు.

నేను అప్పుడు సిసిఎల్ఎగా ఉన్నాను. అన్ని జిల్లాలనుంచి ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములున్నాయో వివరాలు తెప్పించాను. విశాఖలో అచ్యుతాపురం వద్ద, విజయవాడలో నూజివీడు దగ్గర, గుంటూరు వినుకొండ–మాచెర్ల దగ్గర, ప్రకాశంలో దొనకొండ దగ్గర పెద్ద ఎత్తున భూమి లభ్యమవుతుందని తెలిసింది. ఇక నెల్లూరు, అనంతపురం, ఇతర సీమ జిల్లాల్లో కూడా భూమి బాగానే లభ్యమవుతున్నది. కర్నూలులో అంత లేదు.

వీటన్నిటినీ పరిశీలించి ఒక కాన్సెప్ట్ నోట్ తయారు చేశాను. ఇంకా శివరామకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేయనే లేదు.

నేను ప్రభుత్వ భూములు లభించడమే ప్రాతిపదికగా తీసుకోకుండా రాజధాని ఏర్పాటుకు ఇతరత్రా కారణాలను, ఏర్పడబోయే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పరిస్థితులను కూడా పరిశీలించాను.

రాజధాని అనేది అన్ని ప్రాంతాలకూ ఆమోదయోగ్యంగా ఉండాలి. రాయలసీమ, ఉత్తరాంధ్ర మనోభావాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి అని నేను భావించి దొనకొండ ప్రాంతం రాజధానికి అనువైన ప్రాంతమని సూచించాను.

దొనకొండ ప్రాంతంలో ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఇది కోస్తాంధ్రలో భాగం. ఐనా రాయలసీమకు ఆమోదయోగ్యం. ఎందుకంటే ప్రకాశం జిల్లా ఏర్పడినప్పుడు దొనకొండ కందుకూరు డివిజన్‌నుంచి వచ్చింది. అది నెల్లూరులో భాగం. మార్కాపురం, ఎర్రగొండ పాలెం ప్రాంతాలకు రాయలసీమతో సంబంధం ఉన్నది. దొనకొండ మార్కాపురానికి చాలా దగ్గర. దొనకొండ రాయలసీమ, ఆంధ్రకు బాగా ఆమోదయోగ్యం అవుతుంది. అక్కడ భారీ ఎత్తున ప్రభుత్వ భూమి లభ్యమవుతుంది కనుక భూమిపై ఖర్చు దాదాపు తగ్గిపోతుంది. అది చాలా పేద ప్రాంతం. ప్రభుత్వ పెట్టుబడులు ఇలాంటి ప్రాంతంలో పెట్టబడినప్పుడే ఆ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుంది. అక్కడే రెండో ప్రపంచ యుద్ధ కాలంలో నిర్మించిన ఎయిరోడ్రోమ్ ఉన్నది. దాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చుకోవచ్చు. దర్శిబ్రాంచ్ కెనాల్ నుంచి, వెలిగొండ రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలను తెచ్చుకోవచ్చు.

నేను పరిపాలనకు అనువైన రాజధాని గురించే ఆలోచించాను కాని మెగా సిటీ కావాలని అనుకోలేదు. విశాఖ, విజయవాడ, తిరుపతి, కర్నూలు వీటిని ఆర్థికప్రయోజనాల రీత్యా బలోపేతం చేసేందుకు ప్రయత్నించాలి.

అమెరికాలో చేసిన ప్రయోగాలు నాదృష్టిలో ఉన్నాయి. అక్కడ అన్ని రాష్ట్రాల రాజధానులు చిన్న నగరాలు. పెద్ద నగరాలు కావు. న్యూయార్క్ స్టేట్ కు న్యూయార్క్ రాజధాని కాదు. అబర్న్ అన్నది రాజధాని. కాలిఫోర్నియాకు లాస్ ఏంజెల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో ఇవేవీ రాజధానులు కావు. సాక్రమెంటో రాజధాని. అమెరికాకు న్యూయార్క్ రాజధాని కాదు. వాషింగ్టన్ డిసి అన్నది రాజధాని. కనుక పరిపాలనకు అనువైన రాజధాని మెగాసిటీ కానక్కర్లేదు. అదొక చాలా ప్రశాంతంగా ఉండే నగరం కావాలి. పరిపాలనకు అనువైన రాజధాని అంటే ఏమేమి అవసరం? సెక్రటేరియట్, సిబ్బందికి కావల్సిన క్వార్టర్లు. ప్రజలకు సామీప్యత ఉండాలి. రైల్వే లైను ఉన్నది. మంచి రహదారుల నెట్ వర్క్ ఏర్పాటు చేసుకుంటే అన్ని విధాల

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అందుబాటులో వుంటుంది. అవన్నీ దృష్టిలోపెట్టుకుని కాన్‌సెప్ట్ నోట్ తయారు చేసి పంపించాను. దాని గురించి ప్రచారం కూడా జరిగింది.

దాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాను. అక్కడి నుంచి భారత ప్రభుత్వానికి పంపినట్లు ఆపైన తెలిసింది.

ఈ లోపు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి నేను ఛీఫ్ సెక్రటరీ అయ్యాను. నేను దొనకొండలో రాజధాని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన విషయం వారికి తెలిసిపోయింది. నన్ను వాళ్లు నమ్మలేదు. అప్పటికే శివరామకృష్ణన్ కమిటీని నియమించినప్పటికీ చంద్రబాబు నిపుణులతో కాకుండా వ్యాపారస్తులు, పార్టీ నేతలతో మరో కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఉన్నవారంతా అనుభవం లేని వారు. మొదట్లో నన్ను కమిటీకి సిఎస్‌గా సభ్య కన్వీనర్‌గా పెట్టారు. ఈలోపు ఎవరో వెళ్లి నేను దొనకొండను ప్రతిపాదించానని చెప్పారు. దీనితో సిఎం నన్ను ఈ కమిటీ నుంచి తీసేశారు. 'సిఎస్ గా మీరు చాలా పనులు చేయాలి కదా.. ఈ కమిటీలో మీరు వద్దు లెండి' అన్నారు.

నేను చాలా జాగ్రత్తగా ఉన్నాను. అనవసరంగా నన్ను నిందిస్తారని భావించాను. శివరామకృష్ణన్ కమిటీకి ఎంత దూరంగా ఉండాలో అంత దూరంగా ఉన్నాను. ఆయనను కలిస్తే నేను ప్రభావితం చేశానని ప్రచారం చేస్తారని తెలుసు.

రెండు మూడు నెలల తర్వాత ఒక రోజు శివరామకృష్ణన్ అనుకోకుండా సిఎం దగ్గర తటస్థ పడ్డారు. ఇక తప్పించుకోలేకపోయాను. ఛీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావును అని నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

'ఓహ్ మీరా కృష్ణారావు. నేను మీ గురించి విన్నాను, మీ కాన్సెప్ట్ నోట్ గురించి చదివాను. చాలా బాగున్నది' అని వ్యాఖ్యానించారు. సిఎం ముఖం చిన్నబోయింది.

తెలుగుదేశం ఎంపి రాయపాటి సాంబశివరావు ఆరోజే నామీద కామెంట్ చేశారు. రాజధానిని 'దొనకొండ తీసుకువెళ్లాలని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి చూస్తున్నారు' అని.

'నేను సిఎస్ మీదే కామెంట్ చేశాను. అక్కడ ఆయనకు భూములున్నాయి అందుకే అక్కడికి రాజధానిని తీసుకెళ్లానుకుంటున్నారు.' అని ఆయన విలేకరుల సమావేశంలో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

నేను ఛీఫ్ సెక్రటరీగా ఉన్నాను కాని ప్రతిస్పందించలేదు. లేకపోతే ఆరోజే గట్టిగా జవాబు చెప్పేవాడిని.

ఈ లోపు చంద్రబాబు ఆలోచనలో ఉన్న రాజధానిని ఆచరణలో పెట్టడం ప్రారంభించారు. నిజానికి ఆయన నియమించిన కమిటీ ఎక్కడా ఏమీ తేల్చలేదు. కాని లీకులు రావడం ప్రారంభమయ్యాయి. లీకులు సృష్టించడమే ఆయన వ్యవస్థలో భాగం. నూజివీడు దగ్గర అటవీ ప్రాంతాన్ని డీ నోటిఫై చేసి రాజధాని నిర్మిస్తారని ఒక రోజు లీకు సృష్టించారు. గుంటూరు–విజయవాడల మధ్య నాగార్జున యూనివర్సిటీ భవనాల్లో రాజధాని పెడతారని మరో రోజు లీకు సృష్టించారు. మంగళగిరి వద్ద అటవీభూములను కూడా డీ నోటిఫై చేసి రాజధాని నిర్మిస్తారని ఇంకో రోజు వదంతులు వ్యాపించాయి. నూజివీడు దగ్గర రాజధాని వస్తుందేమోనని మొదట వాళ్లవాళ్లంతా భూములు కొనుక్కున్నారు. కాని అక్కడేమో సమస్య వచ్చి పడింది. దీనితో లీకులుఇచ్చి అక్కడ భూమి రేట్లు పెంచి అమ్ముకునేలా చూశారు. నూజివీడులో భూముల క్రయం వల్లే విజయవాడలో కాల్‌మనీ రాకెట్ పుట్టిందని అంటారు. ఈ కాల్‌మనీతో విజయవాడ వాళ్లు అక్కడ భూములు కొనుక్కున్నారు. తర్వాత దాన్ని డబ్బులు చేసుకుని వెలగపూడి వద్దకు వెళ్లి కొనేసుకున్నారు.

జూన్ 2 నుంచి సెప్టెంబర్ వరకూ రకరకాల రాజధానుల పేర్లు వినపడ్డాయి. దానికి నేను ఫ్లోటింగ్ క్యాపిటల్ అని పేరుపెట్టాను.. సెప్టెంబర్ 3న అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టినప్పుడుకూడా విజయవాడ, దాని చుట్టుప్రక్కల అన్నారు కాని ఆ ప్రాంతం ఏదో చెప్పలేదు. సెప్టెంబర్ ఆఖరున సేకరణ నియమాలను నిర్ణయించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించేంతవరకూ విజయవాడ, చుట్టుప్రక్కల ఉన్నవారంతా రక రకాల ఊహాగానాలతో పెట్టుబడులు పెట్టి బాగా దెబ్బతిన్నారు.

ఈ దెబ్బతినడానికి ప్రధాన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రజలపై ప్రభుత్వం చాలా అన్యాయంగా ట్రిక్కులు ప్లే చేసింది. భూముల కొనుగోళ్లు, అమ్మకాలను ప్రోత్సహించి,

మధ్యతరగతిని మోసగించడం ద్వారా కొందరికి ప్రయోజనం చేకూర్చేందుకే ఈ వదంతులకు ఆస్కారం కల్పించారు. తుళ్లూరు మండలంలో రాజధాని వస్తుందని ముందస్తు సమాచారం ఉన్నవారు వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టి స్పెక్యులేటివ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా కోట్ల రూపాయలు ఆర్జించేందుకు తోడ్పడేందుకే ప్రభుత్వం ఈ సయ్యాటలాడి ఉంటుంది.

చివరకు ఎటువంటి అధ్యయనం చేయకుండా వెలగపూడిలో రాజధానిని నిర్ణయించారు. శివరామకృష్ణన్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనల్ని తెలుసుకుని ఏ ప్రాంతాన్నీ సూచించలేదు కాని ఈ ప్రాంతం మాత్రం వద్దని చెప్పింది. స్పష్టంగా చెప్పింది. ఇక్కడ ఏర్పాటు చేయడానికి ఎటువంటి శాస్త్రీయమైన అధ్యయనం చేయలేదు. అది చంద్రబాబుకు తీరని నష్టంగా, ఘోరవిపత్తుగా మారుతుంది.

రాజధాని కోసం భూములు పణంగా పెట్టిన రైతులు పెద్ద ఎత్తున నష్టపోతారని చెప్పడానికి వెనుకాడనక్కర్లేదు.

ఒకటి, ఆయన పరిపాలనకోసమే రాజధాని ప్లాన్ చేయలేదు. ఆయన మెగాపొలిస్ ప్లాన్ చేశాడు. పరిపాలన రాజధాని కావాలంటే 500-600 ఎకరాల కంటే అవసరం లేదు.. కోర్ ఆఫీసులు పెట్టి వదిలేయాలి.

చంద్రబాబు ప్లాన్ చేస్తున్న అమరావతి అనే మెగాపొలిస్ కోసం 32వేలఎకరాలు సేకరించారు. ల్యాండ్ పూలింగ్ లో తీసుకుని ఆ రైతుల్లోఎలాంటి భ్రమ ఏర్పాటు చేశారంటే, వాళ్లందరికీ విపరీతమైన రేట్లు వస్తాయని అంచనాలు వేసుకుని, భ్రమలో పడి తమ భూములు ఇచ్చేశారు. వాళ్లనుకున్న స్థాయిలో లాభాలు రావాలంటే ఇది ఏ హైదరాబాద్ స్థాయి నగరమో, మద్రాస్ స్థాయి నగరమో కావాలి. ఎప్పటికి అవుతుంది?

వస్తుందని అనుకున్నా, అది కావడానికి 30 ఏళ్లు పడుతుందా, 50 ఏళ్లు పడుతుందా 100 ఏండ్లు పడుతుందా చెప్పలేం.

రాజధానికి చంద్రబాబు వస్తుందనుకున్న స్థాయిలో విలువ రావాలంటే అది ఎప్పుడూ సాధ్యపడదు. ఆయన పులిమీద స్వారీ చేస్తున్నారు.

రాజధాని అనే గాలిబుడగ పేలి పోవడానికి ఎంతో కాలం పట్టదు.

నాలుగున్నర ఏండ్ల తరువాత  చూస్తే చిన్న స్థాయిలో తాత్కాలిక ఆఫీసు భవనాలు తప్పితే, పక్కాగా ఏమైనా పెట్టుబడులు వచ్చాయా ఎవరైనా చెప్పగలరా?

సింగపూర్ కంపెనీలు నిర్మాణాలు చేసినా, ఈ 30 వేల ఎకరాలకు వారనుకున్న స్థాయిలో లాభాలు ఆర్జించడానికి అదనపు విలువ కల్పించలేరు. నిజానికి సింగపూర్ కంపెనీలు ప్రవేశించడానికి ఎన్నోఅడ్డంకులున్నాయి.

అమరావతిలో సింగపూర్ టౌన్ షిప్ పేరిట 1600 ఎకరాల కోర్ కాపిటల్ ఏరియా అభివృద్ధి సింగపూర్ కంపెనీకి ఇచ్చారు. దానికోసం సింగపూర్ ప్రభుత్వం వచ్చి మాస్టర్ ప్లాన్ ఉచితంగా ఇస్తామని చెప్పి ఇచ్చింది.

ఆ పై కోర్ క్యాపిటల్ ఏరియా అభివృద్ధికి రెండు ప్రభుత్వాలు ఒప్పందం కుదుర్చుకునేందుకు ముందుకు వచ్చాయి. ఆ తర్వాత వెనక్కు తగ్గాయి. తమ కంపెనీలకు ప్రాజెక్టు ఇవ్వమని చెప్పారు. ప్రభుత్వ కంపెనీలే అవి. కాని వాటి తీరు వేరు.

దాన్ని స్విస్ ప్రపోజల్ క్రింద పెట్టారు. నిజానికి సింగపూర్ కంపెనీలకు భూములు అప్పజెప్పడం స్విస్ ఛాలెంజ్ క్రింద రాదు. అది పెద్ద మైనస్ పాయింట్ అవుతుంది. ఈ పద్ధతి వల్ల టెండర్ల ప్రక్రియలో పారదర్శకత ఉండదని, న్యాయంగా జరిగే అవకాశాలు లేవని కేల్కర్ కమిటీ తన నివేదికలో వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఈ ప్రక్రియను ఆమోదించినప్పటికీ కొన్ని మార్గదర్శకాలు పేర్కొంది. అందులో ఒకటి కచ్చితంగా ఒక కంపెనీ తనంతట తాను అభివృద్ధికి ముందుకు రావాలి.

స్విస్ ఛాలెంజ్ అంటే నిర్వచనం – ప్రతిపాదన కోరకుండా వారంతటవారు వచ్చేది. ఉదాహరణకు ఫలానా కంపెనీ ముందుకు వచ్చి తమ దగ్గర ఎవరి దగ్గరా లేని విశిష్టమైన ప్లాన్ ఉందని, కొత్త పద్ధతిలో ప్రాజెక్టును అమలు చేస్తాం వచ్చాం అని ముందుకు వస్తే దాన్ని పరిశీలించి తృప్తి చెందిన తర్వాత అప్పుడు దాన్ని టెండరింగ్ కు పంపాలి.

'ఫలానా కంపెనీ ప్రతిపాదనతో వచ్చింది. ఈ ప్రతిపాదన ప్రకారం ప్రభుత్వానికి వందకోట్లో, 200 కోట్లో ఆదాయం. దీనికన్నా ఎక్కువ వాటా ఎవరైనా ఇస్తారా?' అని బహిరంగంగా ప్రకటించాలి. ఏదైనా మరో కంపెనీ వచ్చి తాను

కూడా అదే పద్ధతిలో చేస్తానని అంతకంటే అధిక మొత్తం ఇస్తామని చెబితే ఆ మొత్తానికి చేయాల్సిందిగా తొలుత ప్రతిపాదన చేసిన కంపెనీని అడగాల్సి ఉంటుంది. అందుకు ఆ కంపెనీ అంగీకరిస్తే దానికి పనులు అప్పజెప్పాలి

ఇక్కడేమి జరిగింది? సింగపూర్ ప్రభుత్వంతో మొదటినుంచీ తెలుగుదేశం ప్రభుత్వం అంట కాగింది. మాస్టర్ ప్లాన్ తయారు చేయించుకుంది. వాళ్ల కంపెనీలు సిఆర్ డిఏతో తమ ప్రాజెక్టు నివేదిక తయారీలో సమాచారాన్ని పంచుకున్నాయి. స్విస్ ఛాలెంజ్ విధానమంటే ఎవరైనా తమంతట తాము (suomoto) ప్రతిపాదన ఇవ్వాలి. ఇక్కడ సింగపూర్ కంపెనీలు అందుకు భిన్నంగా ప్రభుత్వ నోటిఫికేషన్‌కు అనుగుణంగా ప్రతిపాదన ఇచ్చారు. చంద్రబాబు ఎంచుకున్న ప్రక్రియ చట్టరీత్యా, సాంకేతికత రీత్యా సరైంది కాదు. అలాంటి వ్యవస్థను ఆయన కొద్ది మంది లాభం కోసమే చేపట్టారని, అది క్రమేణా భారీ కుంభకోణంగా మారుతుందని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రెండు, సింగపూర్ వాళ్లు తమ కొచ్చే ఆదాయంలో ఎంత వాటా ప్రభుత్వానికి ఇస్తారో చెప్పారు. ముందు 5 శాతం అని చెప్పారు. ఆ తర్వాత మనవాళ్లు బేరాలకు దిగితే మొదటి దశలో 5, తర్వాతి దశలో 7.5, ఆపైన 12 అని ఏదో నిర్ణయించారు. అది కూడా ముందు చెప్పకుండా ప్రకటన చేశారు. దానికి దరఖాస్తుచేసుకున్న వాళ్లను అనర్హులుగా ప్రకటించారు. గ్లోబల్ టర్నోవర్ రు. 2వేల కోట్లు లేదని, నెట్ వర్త్ లేదని, అది లేదు, ఇది లేదని తిరస్కరించారు. సింగిల్‌బిడ్ మీద సింగపూర్ కంపెనీలకు ఇచ్చేశారు. ఇది సరైనదెలా అవుతుంది? ఇంత చేసే బదులు నిజంగా సింగపూరే కావాలనుకుంటే ఎటు తిరిగీ బిడ్డింగ్‌లో పోతున్నందువల్ల అంతర్జాతీయ బిడ్డింగ్ చేయడానికి అడ్డంకులేమున్నాయి? సాధారణ టెండరింగ్ పద్ధతిలో అంతర్జాతీయ బిడ్డింగ్ చేయొచ్చు. కాని అలా చేయలేదు.

మూడవది, సింగపూర్ ప్రభుత్వం గురించి చెప్పాలంటే చాలా నమ్మకమైన ప్రభుత్వం, నిజాయితీ గల ప్రభుత్వం, అవినీతి లేదు. సమర్థవంతమైన ప్రభుత్వం అని చెబుతారు. అక్కడ ఉమ్మేస్తే తంతారు, పేపర్ వేస్తే పట్టుకుపోయి జైల్లో వేస్తారు, అటువంటి ప్రభుత్వంతో మేం పెట్టుకుంటున్నాం అని చెప్పుకుంటారు.

వాళ్ల అంతర్గత విషయాల్లో ఇవన్నీకరెక్టే. ఎవరూ కాదనలేరు.

కాని ఇతర దేశాలతో వ్యవహరించేటప్పుడు సింగపూర్ ప్రభుత్వవ్యవహార శైలి ఏమిటి? అని తెలుసుకున్నారా? ఆ కంపెనీ పూర్వచరిత్ర ఏమిటి? తెలుసుకునే ప్రయత్నం చేశారా?

సింగపూర్‌కు ఇంకో కోణం ఉంది, అది మరిచిపోకూడదు. ఈ రోజు అంతర్జాతీయ మనీలాండరింగ్ కేంద్రం సింగపూర్. స్విట్జర్లాండ్, హాంకాంగ్‌ల కంటే ఎక్కువ మనీ లాండరింగ్ అక్కడ జరుగుతుంది. ఇండోనేషియాలో జరిగిన అవినీతి సొమ్ము అంతా దాచుకునేది సింగపూర్ లో. అక్కడ అవినీతి చేసిన వాళ్లు సింగపూర్‌కు వచ్చి పౌరసత్వం తీసుకుని అక్కడే ఉంటారు. అటువంటి దేశాన్ని తెలుగుదేశం సర్కార్ ఒక పవిత్రమైన దేశంగా నెత్తికెక్కించుకుంటే ఎవరు నమ్ముతారు?

సింగపూర్ అంతర్గతంగా బాగానే కనిపించవచ్చు. కాని బయటదేశాల విషయానికి వస్తే దానికి ఎటువంటి నీతి నియమాలు లేవు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారా? లేదే?. కనుక టెండర్ పద్ధతిని మానేసి ట్రాక్ రికార్డును పట్టించుకోకుండా సింగపూర్ కంపెనీలకు ఎందుకు పట్టం కట్టాలి?

మూడవది, 1691 ఎకరాలను కోర్ కాపిటల్ నిర్మాణానికి రాసిచ్చిన కంపెనీల్లో అసెండాస్–సింగ్ బ్రిడ్జి ప్రైవేట్ లిమిటెడ్, సెంబ్ కార్ప్ డెవలప్ మెంట్ లిమిటెడ్ ఉన్నాయి

సెంబ్‌కార్ప్ పై ఇప్పటికే అంతర్జాతీయంగా అవినీతి ఆరోపణలున్నాయి. బ్రెజిల్ పెట్రోబాస్ అనే పెద్ద చమురు కంపెనీ అధికారులకు డ్రిల్ల్ షిప్ లను నిర్మించే కాంట్రాక్టులు పొందేందుకు భారీ ముడుపులు చెల్లించారనేది ఈఆరోపణ. బ్రెజిల్ లో ఒక జాతీయ చమురు కంపెనీపై ఇప్పటి వరకూ వచ్చిన అతి పెద్ద అవినీతి ఆరోపణ ఇది. దానిపై దర్యాప్తు జరుగుతోంది.

మనం రాజధాని కాంట్రాక్టు వారికిచ్చేముందు వారి నేపథ్యం పరిశీలించారా? లేదు.

బ్రెజిల్‌లో ఉన్న భారత రాయబారికి రాసి పెట్రోబాస్, సెంబ్ కార్ప్ కంపెనీలను విచారించి సత్యాసత్యాల గురించి తెలుసుకోవాలి. రిపోర్టు తెప్పించుకోవాలి. అది జరగలేదు

ఇన్నిఅవకతవకలతో దీన్ని ఎలా ముందుకు తీసుకువెళతారు?

మూడవది, సింగపూర్ కంపెనీలకు, ప్రభుత్వానికీ మధ్య తగాదే ఏర్పడితే మధ్యవర్తిత్వం లండన్‌లో జరగాలని నిర్ధారించారు. ఏ చిన్న వాగ్దానాన్ని మన ప్రభుత్వం నెరవేర్చకపోయినా, మన అధికారులు లండన్ కు వెళ్లాలి.

మొత్తం భూమిని సేకరించి ఇవ్వాలని సింగపూర్ కంపెనీల అన్నాయి. కాని భూమి సేకరణలో సమస్యలున్నాయి. రైతులు కొంతమంది సహకరించాలి.

బయటి మౌలిక సదుపాయాలన్నీ అభివృద్ధి చేయాలని ఆ కంపెనీలు షరతుల విధించాయి. ఈ మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీ పెట్టుబడులు కావాలి. ఎప్పుడు అభివృద్ధి చేస్తారు?

సింగపూర్ వాడేమీ చంద్రబాబుపై, ఆంధ్రప్రదేశ్‌పై ప్రేమాభిమానాలతో వచ్చి పనిచేయడం లేదు. వ్యాపారం కోసమే వస్తున్నాడు. వాడు చెప్పింది ఏది చేయకపోయినా, వాడు మనను అంతర్జాతీయ మధ్యవర్తిత్వానికి లాగుతాడు. అక్కడ భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఇంత రిస్క్ తీసుకుని, ఇంత తొందరపడి వాడికి కాంట్రాక్టు ఇచ్చి వాడి చేతుల్లో చిక్కుకుపోవాల్సిన అవసరం ఏమున్నది?

అసలు రాజధాని ప్రాంతం అక్కడ పెట్టాలని ఎంపిక చేయడమే తప్పు. అది శాస్త్రీయంగా జరగలేదు. శాస్త్రీయంగాచేసిన శివరామకృష్ణన్ కమిటీ వద్దన్న చోట రాజధానిని నిర్ణయించారు. దూరదృష్టి గల ఏ నాయకత్వమైనా శాస్త్రీయంగా వ్యవహరించాలి. ప్రజల్లో అన్ని వర్గాలతో చర్చించాలి. నిర్ణయంలో వారిని భాగస్వాములు చేయాలి. కాని రాజధాని ఎంపిక నిర్ణయం కేవలం కొన్ని వర్గాలను సంతృప్తి పరిచేందుకు హ్రస్వదృష్టితో తీసుకున్న నిర్ణయంలా కనపడుతోంది.

పరిపాలనకోసమే రాజధాని అనుకుంటే సులభంగా అయ్యేది అని తెలిసినా ఆదిశలో చర్యలు తీసుకోలేదు. గాలిలో మేడలు కట్టే విధంగా మెగాపోలిస్ కోసం ప్రయత్నిస్తున్నారు. దాని కోసం రైతుల్లో ఏవో భ్రమలు కల్పించి 32 వేల ఎకరాలు తీసుకున్నారు. దానికి తగ్గట్లుగా ఊహాత్మక లాభాలు రాకపోతే వాళ్లందరూ మీదపడితే ఏం చేయగలరు? ప్రభుత్వం భారీగా మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ లోపు ఎంత సామాజిక, సాంస్కృతిక విధ్వంసం జరుగుతుంది అక్కడ? వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన రాజేందర్ సింగ్ వచ్చి అక్కడ రాజధాని పెట్టడమే తప్పు అన్నాడు. సిఎం ఇల్లు తో సహా రాజధాని, రహదారులన్నీ వరద ప్రాంతాల్లో ఉన్నాయని ఆయన అన్నారు.

ఇదంతా చూస్తే చంద్రబాబు మొత్తం రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపించడం లేదు అని అనిపిస్తున్నది.

అంతేకాదు, అమరావతి మైకంలో పడి చంద్రబాబు మిగిలిన ప్రధాన నగరాలను విస్మరించారు. ఆయన విశాఖ, తిరుపతి తదితర నగరాలపై దృష్టి కేంద్రీకరించడం లేదు. చుట్టుప్రక్కల ఉన్న విజయవాడ, గుంటూరులను కూడాపట్టించుకోవడం లేదు. అమరావతి ఇప్పుడున్న పద్ధతిలో అభివృద్ధి కావడం వల్ల గుంటూరు, విజయవాడ ప్రజలకుకూడా ఒరిగింది ఏమీ లేదు. గుంటూరు, విజయవాడ కూడా ప్రయోజనం పొందాలి అంటే మంగళగిరిలో స్పెషల్ బెటాలియన్ భూమిలో రాజధాని కట్టి ఉంటే సెక్రటేరియట్, అసెంబ్లీ భవనాలు, ఇతర భవనాలను కట్టి ఉంటే, విజయవాడ, గుంటూరు జంటనగరాల్లాగా బ్రహ్మాండంగా అభివృద్ధి అయి ఉండేవి. అది కాకుండా 30 కిలోమీటర్ల దూరంలో పంటపొలాల్లో రాజధాని నిర్మిస్తే, ఇక్కడ రెండు నగరాలను వదిలిపెట్టి అక్కడ మెగాసిటీ నిర్మించాలని కలలు కంటే, అది అసలు ఎప్పుడు పూర్తి కావాలి?

రాజధాని విషయంలో కేంద్రం తొలుత సానుకూలంగా కనిపించినప్పటికీ తర్వాతి కాలంలో జరుగుతున్న అంశాలను తెలుసుకున్న తర్వాత అది ప్రతికూలంగా మారుతున్నదని సమాచారం. కేంద్రం నిధులైతే ఇచ్చింది కాని అక్కడ నిర్మాణాలు పూర్తి చేస్తే కదా మళ్లీ నిధులు అడిగేది.

దొనకొండ రాజధాని అయితే ఇంత అస్తవ్యస్త పరిస్థితులు తలెత్తేవి కావు. లేదా అతిసారవంతమైన మాగాణి భూములు, భూమి నేల సామర్థ్యం బలహీనతను దృష్టిలో ఉంచుకుని అమరావతి ప్రాంతం అనువైన ప్రాంతం కాదని శివరామకృష్ణన్ కమిటీ చేసిన హితవును పట్టించుకున్నా ఈ పరిస్థితి వచ్చేది కాదు. నిపుణులు సూచించిన విధంగా పరిపాలనా రాజధాని కోసం చూడకుండా, ప్రభుత్వ వ్యవహారాలను భారీగా ఒకే చోట కేంద్రీకృతం కాకుండా చూసుకోవాలని చెప్పిన

హితవును పాటించకుండా, మహా నగరం ఏర్పాటు చేయాలన్న దూకుడులో వెళ్లినందువల్ల ఎటూ కాని పరిస్థితిలో పడతామనే నా భయం.

'సింగపూర్ వెళ్లే భూమి కోటా ఏమైనప్పటికీ అది వ్యవసాయ భూమి నుంచే వస్తుంది. రాజధాని ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా ప్రభావితం అయ్యే వారే కాకుండా, ఆదాయం లేని లక్షలాది కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఈ కుటుంబాల భద్రత, సంక్షేమానికి హామీ ఇవ్వడం ఆచరణాత్మకంగా అసాధ్యం... ఆంధ్రప్రదేశ్‌లో నూతన రాజధాని ప్రాజెక్టు కోసం సంపూర్ణమైన రాజకీయ సమర్ధన లేదు..' అని శివరామకృష్ణన్ తాను మరణించడానికి కొద్ది రోజుల ముందు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. రాజధాని ప్రాజెక్టు మీద ఆంధ్రప్రదేశ్ రాజకీయ శక్తినీ, ఆర్థిక వనరులను తాకట్టు పెట్టే ఆత్మహత్యా సదృశమైన పని చేయవద్దని ఆయన హితవు పలికారు.

పరిస్థితి ఎలా మారిందంటే వచ్చే ఎన్నికలు సమీపించే నాటికి ఆరునెలల ముందు వాతావరణం తెలుసుకుని అమరావతి ప్రాంతంలో కొన్న భూములను అయినకాడికి అమ్ముకుని బయటపడాలనే ఉద్దేశంతో చాలా మంది ఉన్నారు. ఈ విషయం నాకు విజయవాడ విమానాశ్రయంలో ఒక తెలుగుదేశం నాయకుడే చెప్పారు.

ప్రపంచ బ్యాంకు నుంచి 5 వేల కోట్లు తేవాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. అది ముందుకు పోవడం లేదు. ప్రపంచ బ్యాంకు వాళ్లు భూసమీకరణ స్వచ్ఛందంగా లేదని ఆ అంశంపై ప్రస్తుతం వారి పరిశోధన చేస్తున్నారు. ఈ మొత్తం వచ్చేది అనుమానమే.

కాని ఇన్ని అవకతవకలు, అస్తవ్యస్త పరిస్థితులు, అక్రమాలను చూసిన తర్వాత కేంద్రం ప్రపంచ బ్యాంకు సహాయానికి అంగీకరిస్తుందా? జరుగుతున్న విషయాలను కేంద్రం గమనించదనుకోవడం అమాయకత్వం కాదా?

# 13

## ఆంధ్రప్రదేశ్‌కు అవతరణ దినోత్సవం లేదా?

జూన్ 2న రెండు రాష్ట్రాలు విడిపోయాయి. తెలంగాణ కొత్త రాష్ట్రంగా అవతరించింది కనుక జూన్ 2 ఆ ప్రాంతానికి ఒక మహత్తరమైన రోజు. అధికారంలోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం జూన్ 2న చాలా పెద్ద ఎత్తున అవతరణ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించింది.

కాని తెలంగాణ నుంచి విడిపోయిన శేష ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం ఎప్పుడు? జూన్ 2న ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయలేదు. అంతేకాక విభజన అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగాజరిగింది కనుక జూన్ 2న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సంబరాలు జరుపుకోవడంలో అర్థం లేదు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నవంబర్ 1న జరిగేది. కాని అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు. ఇప్పుడా విశాలాంధ్ర లేదు. కనుక నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం జరుపుకోవడం అర్థరహితం.

కాని ఆంధ్రప్రదేశ్ ఏదో ఒకరోజు అవతరణ దినోత్సవం జరుపుకోవాలి కదా.. అని నేను అనుకుని ఆ మేరకు ఫైలును సర్క్యులేట్ చేశాను. 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం అవతరించింది కనుక అక్టోబర్ 1కి ప్రాధాన్యత ఉన్నది. ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ కర్నూలు వచ్చారు. ప్రముఖ కవి శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అని రాసిన గీతాన్ని అభేరి రాగంలో ప్రముఖ గాయని

టంగుటూరి సూర్యకుమారి ఆ సందర్భంగా ఆలపించారు. దాన్నే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక గీతంగా నిర్ణయించింది.

అక్టోబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం జరుపుకోవాలన్న నా ప్రతిపాదనను ముఖ్యమంత్రి అంగీకరించలేదు. 'నో' అని సమాధానం వచ్చింది. చివరకు ఆ ఫైలు బుట్ట దాఖలైంది.

చంద్రబాబునాయుడుకు ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకోవడం ఇష్టం లేదు. ఆంధ్రప్రదేశ్‌కూ ఒక గుర్తింపు ఉండాలి అన్న విషయం ఆయన అంగీకరించలేదు.

ఎంతసేపూ రాష్ట్రం విడిపోయిన రోజు జూన్ 2న నవ నిర్మాణ దీక్ష జరిపి కాంగ్రెస్‌ను తిట్టాలి. అదే ఎజెండా కావాలి అన్నది ఆయన ఉద్దేశం.

రాజకీయాలు తప్ప ఒక నిర్దిష్టమైన ప్రయోజనం కోసం ఆయన దృష్టి పెట్టిన సందర్భాలు చాలా తక్కువ. భద్రాచలం విషయంలోనూ అదే జరిగింది. రాష్ట్ర విభజనకు ముందు చంద్రబాబు కానీ, ఆంధ్రా నాయకత్వం కానీ కొంత గట్టిగా వ్యవహరించి ఉంటే భద్రాచలం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేది. భద్రాచలం తమకు కావాలని, దాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చి ఉంటే ఆ ప్రాంత ప్రజలంతా ఆంధ్రప్రదేశ్‌తో ఉండేవారు. భద్రాచలం రెవిన్యూ డివిజన్ మొదట తూర్పుగోదావరి జిల్లాలో ఉండేది. ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్రాలు విలీనమైన తరువాత కొంతకాలానికి నీలం సంజీవరెడ్డి హయాంలో భద్రాచలంను తూర్పుగోదావరి నుంచి ఖమ్మంలో కలిపారు. ఇప్పుడు భద్రాచలం ఆంధ్రాకు వెళితే తాము పనులు కావాలంటే ఏ రాజమండ్రికో, కాకినాడకో వెళ్లాల్సి ఉంటుందని ప్రజలు భావించారు. అందుకే వారు ఖమ్మంలో ఉండిపోవాలని నిర్ణయించుకున్నారు. నిజానికి వారికి తూర్పుగోదావరి జిల్లాతో అనుబంధం ఉన్నది. విభజనకు ముందు చంద్రబాబు మిగిలిన ఆంధ్రా నాయకులు ముందుచూపుతో వ్యవహరించి భద్రాచలంను ప్రత్యేక జిల్లాగా ప్రకటిస్తామని చెప్పి ఉంటే పరిస్థితులు వేరుగా ఉండేవి. కాని రాజకీయాలే తప్ప నిర్దిష్టమైన ఆలోచన ఎక్కడిది?

పోలవరం కోసం విభజన సమయంలో నాలుగు మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో చేరేందుకు చంద్రబాబునాయుడు గారే కారణమని భావించేవాణ్ణి. కాని తరువాత

తెలిసింది ప్రధానంగా కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అప్రమత్తంగా ఉండడం కారణం అని . ఆయనే బిల్లు రూపొందించారు కనుక మరో ఆరునెలలు వేచి ఉంటే, నాలుగు మండలాలు ఏపీలో చేర్చేందుకు కేంద్రం అంగీకరించదని, తెలంగాణ అడ్డుకాలు వేసేదని జైరాం రమేశ్‌కు తెలుసు. జైరాం రమేశ్ స్వయంగా ఏపీ భవన్‌కు వచ్చి చంద్రబాబునాయుడుకు సలహా ఇచ్చినందువల్లే ఇవాళ పోలవరంకు అడ్డంకులు తొలిగాయి. తెలంగాణ ఏర్పాటుకు ముందే ఈ ఆర్డినెన్స్ జారీ చేయాల్సిన అత్యంత ఆవశ్యకత ఉన్నదని, తెలంగాణ అసెంబ్లీ ఏర్పడితే ఆర్డినెన్స్ జారీ చేయడం ఏ మాత్రం సాధ్యపడదని తాను హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ కు చెప్పి ఒప్పించినట్లు జై రాం రమేశ్ తాను విభజన ఘట్టంపై రచించిన 'గడచిన చరిత్ర–తెరిచిన అధ్యాయం' అన్న పుస్తకంలో చెప్పారు. కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు కూడా ఈ విషయంలో కీలక పాత్ర పోషించారని చెప్పక తప్పదు.

# [13]

# చంద్రబాబు పని శైలి

చంద్రబాబు పనితీరు చాలా విచిత్రంగా ఉంటుంది.

ఏపని చేయాలనుకున్నా, ఎవర్ని నియమించాలనుకున్నా, ముందు రోజు ఆ విషయంపై లీకులు ఇస్తాడు. ఈ లీకుల్ని ఆయనకు అనుకూలంగా ఉన్న పత్రికలు, టీవీ ఛానెల్స్ ప్రచారం చేస్తాయి. దానిపై వచ్చిన ప్రతిస్పందన బట్టి ఆయన నిర్ణయం తీసుకుంటారు. ఇది ఆయన సాధారణంగా అనుసరించే పద్ధతి.

లేక ఆ నిర్ణయం వివాదాస్పదంగా, సంక్లిష్టంగా మారితే అందుకు బాధ్యతను ఎవరో ఒకరి పై తోసేసి తాను మాత్రం సురక్షితంగా ఉండాలని ప్రయత్నిస్తారు. చాలా సార్లు నిర్ణయాలకు బాధ్యతను అధికారులపైనే తోసేస్తారు. ఇది ఇప్పుడే కాదు, గతంలో కూడా ఆయన ఇదే పద్ధతిని అనుసరించాడు.

ఉదాహరణకు గతంలో అదనంగా మద్యపు షాపులు ఇవ్వాలని నిర్ణయించారు. అప్పుడు పెద్ద గందరగోళం చెలరేగింది. మర్నాడు ఇది ఎవరు ఎందుకు చేశారు. అని ఆయన ఆరా తీసినట్లు, కమిషనర్‌పై ఆగ్రహించినట్లు పత్రికల్లో పతాకశీర్షికల్లో వార్తలు వచ్చాయి. మూడో రోజు తర్వాత ఆ కమిషనర్‌ను ఆ పదవి నుంచి తీసేసి పోస్టింగ్ ఇవ్వకుండా ఎక్కడో సర్దుబాటు చేశారు.

నిజానికి అదనంగా మద్యపు షాపులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది ఆయనే. కాని ప్రతికూల ప్రచారం వచ్చినందుకు అధికారిపై చర్య తీసుకున్నారు. ఇలా చాలా విషయాల్లో జరిగింది. నన్ను సిఎస్‌గా నియమించే విషయంలో కూడా ఆయన ఇదే పద్ధతి అనుసరించారు.

నన్ను ఛీఫ్ సెక్రటరీగా, రాముడును డీజీపిగా, మరొకర్ని ఇంటలిజెన్స్ ఐజిగా నియమించనున్నట్లు లీక్‌లు వచ్చాయి.

రెండో రోజు ఈ జాబితా తీసుకుని గవర్నర్‌కు ఇవ్వాలి. గవర్నర్ ఆమోదం తెలపాలి. రెండో రోజు ఆ జాబితా చూసి 'ఆ ఐజి ఇంటలిజెన్స్ పేరు తీసేయండి. ఈయనమీద నెగటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చింది..' అని ముఖ్యమంత్రి అన్నారు.

'బతుకు జీవుడా' అనుకున్నాను. నిన్న సాయంత్రం నా పేరు ఉందన్నారు. ఉదయం పేపర్ లో కూడా వార్త వచ్చింది. అదృష్టవశాత్తు నా మీద వ్యతిరేక ఫీడ్ బ్యాక్ రాలేదు. సాయంత్రం జరిగిన ఆంతరంగిక చర్చల్లో ఒక ముఖ్యుడు మీ పట్ల ఏమీ వ్యతిరేక సమాచారం ఇవ్వలేదనుకుంటాను.. అని ఒక మిత్రుడు అన్నాడు. దీనితో ఊపిరి పీల్చుకున్నాను.

ఈ పద్ధతి చాలా రోజుల తర్వాత అజయ్ కల్లం విషయంలో కూడా జరిగింది.

ఆయనకు ఛీఫ్ సెక్రటరీగా మొదట నెల రోజులు నియమించి తర్వాత ఆరునెలలు పొడిగించాలని ముందు నిర్ణయించారు. సాయంత్రం వరకు ఆయనే ఛీఫ్ సెక్రటరీ అన్న విషయం అందరూ అనుకున్నారు. కాని రాత్రి పొద్దుపోయిన తర్వాత ఆంధ్రజ్యోతి బ్యూరో ఛీఫ్ మాధవ్ నాకు మెసేజ్ పెట్టి కొత్త ఛీఫ్ సెక్రటరీగా దినేశ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు చెప్పారు. బహుశా రాత్రిపూట జరిగిన చర్చల్లో అజయ్ కల్లంను సిఎస్‌గా పంపకూడదని నిర్ణయించి ఉంటారు. ఆ తర్వాత కేంద్రం అజయ్ కల్లంకు ఆరు నెలలు పొడిగింపుకు సుముఖంగా లేదని, నెలరోజుల కోసం సిఎస్‌గా ఇచ్చే బదులు నేరుగా దినేశ్‌కుమార్‌కు ఇవ్వాలనుకుంటున్నామని లీకులు సృష్టించారు.

దీనితో అజయ్ కల్లం సిఎంను కలిశారు. 'అదేమిటి సార్, నిన్నటిదాకా ఆరునెలలు పొడిగిస్తామని అనుకున్నారు కదా.. ఇప్పుడు నెల రోజులకోసం అయినా సిఎస్‌గా ఇవ్వకపోతే ఎలా.. కనీసం నన్ను ముందు అనుకున్న విధంగా ఒక నెల సిఎస్‌గా నియమించండి..' అని అడిగారు. సిఎం అందుకు కాదన లేక అజయ్ కల్లంకు నెల రోజుల పాటు సిఎస్‌గా అవకాశం ఇచ్చారు. అదే జీవోలో అజయ్ కల్లం రిటైర్ మెంట్ తర్వాత దినేష్ కుమార్ ను నియమిస్తున్నట్లు తెలిపారు. మార్చి 1న అజయ్ కల్లం సిఎస్ అయ్యారు. ఫిబ్రవరి 24 వరకు కూడా దినేశ్‌కు తాను

సిఎస్ అవుతానని నమ్మకం లేదు. ఆ రోజు ఆయనను సెక్రటేరియట్‌లో నేను కలిశాను. అజయ్ కల్లంకు నెలరోజులకోసం సిఎస్ గా ఇచ్చి తర్వాత ఆరునెలలు పొడిగించేటట్లున్నారు అన్న సమాచారం ఆయనకు అందింది. తెలిసింది. ఆరునెలల తర్వాత నాకు ఇస్తామంటున్నారు. ఆరునెలల తర్వాత ఏమి జరుగుతుందో, ఇస్తారో లేదో ఏం తెలుసు అని ఆయన అనుకున్నారు. కాని వారం రోజుల్లోనే ఇతరేతర కారణాల వల్ల చంద్రబాబు మనసు మారి దినేశ్ వైపు మొగ్గు చూపారు.

సరే దినేశ్‌కుమార్ కూడా సిఎస్ గా రావడానికి తన వంతు గట్టి ప్రయత్నాలు చేశారనుకోండి. అది వేరే విషయం కాని ఈ ఉదంతం కూడా చంద్రబాబు అనుసరించే పద్ధతిని స్పష్టం చేస్తుంది. ఉద్దేశ పూర్వకంగా లీకులు ఇవ్వడం, ఫీడ్ బ్యాక్ తెప్పించుకుని నియామకాలు చేయడం, ఎవర్ని దెబ్బ కొట్టాలో వారిని కొట్టడం, నిర్ణయాలు తీసుకోవడం చేస్తుంటారు. ఇష్టం లేని వారి మనో స్థైర్యం దెబ్బతీసే లీకులు ఇచ్చి బాగా ప్రచారం చేసి దెబ్బతీస్తారు. వేటు వేస్తారు.

నన్ను బ్రాహ్మణ కార్పోరేషన్‌నుంచి తీసేటప్పుడు కూడా ఇదే పద్ధతి అనుసరించారు. సాధారణంగా అధికారులకు సిసిఐ రూల్స్ అమలు అవుతాయి కనుక ఏమీ మాట్లాడకుండా ఊరుకుంటారు. కాని నాకు రిటైర్ అయిన తరువాత అలాంటివేవీ వర్తించవు కనుక వెంటనే ప్రతిస్పందించాను.

చంద్రబాబు శైలి గురించి, వ్యక్తిత్వానికి సంబంధించి రెండు విషయాలు అర్థం చేసుకోవాలి. ఒకటి, తాను చాలా కష్టపడుతున్నానని, 24 గంటల పాటు పనిచేస్తున్నారని, తనలా ఎవరూ పనిచేసేవారు లేరని ప్రచారం చేసుకోవడం, అలా కనిపించేందుకు ప్రయత్నించడం చంద్రబాబు తరుచూ చేస్తుంటారు. ఆయనకు అనుకూలంగా ఉన్న పత్రికలు దానికి అత్యధిక ప్రచారం చేస్తుంటాయి.

నా ఉద్దేశం ప్రకారం చంద్రబాబు 50 శాతం తక్కువ పనిచేస్తే రాష్ట్రం 200 శాతం ఎక్కువ అభివృద్ధి చెందుతుంది. ఆయన సాధ్యమైనంత మేరకు కుటుంబంతో గడపడం, మనుమడితో గడపడం చేస్తే మిగతా వారంతా హాయిగా పనిచేస్తారు. ఎప్పుడూ తన మనుమడితో సమయం గడిపేందుకు తీరిక లేదు అని వాపోతుంటారు. అలా వాపోవాల్సిన అవసరం లేదు. ఆయన కుటుంబానికి కూడా సమయం కేటాయిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది.

ఎందుకంటే చంద్రబాబు పని చేయడం వల్ల అదనంగా వచ్చే ఫలితం ఏమీ ఉండదు. ఎటువంటి అదనపు విలువ చేర్చకుండా ఆయన అధికంగా పనిచేసేందుకు ప్రయత్నిస్తే మాత్రం ఏం లాభం? నిజంగా మిగిలిన వాళ్లు పనిచేయడానికి ఇది ఆటంకంగా మారుతుంది.

రెండవది ఆయన ఆచరణీయమైన రీతిలో గడువులు నిర్దేశించుకోకపోవడం. అనవసరంగా చేయాల్సిన సమయం కంటే ముందు చేయాలని భావించి లేని పోని హడావిడి చేస్తుంటారు. ఉదాహరణకు యూరోపియన్ సంస్థలు షెల్, ఎంజీ కాకినాడలో ఎఫ్ ఎస్ ఆర్ యు (ఫ్లోటింగ్ స్టోరేజి, రిగ్యాసిఫికేషన్ యూనిట్) లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. సముద్రంలోనే లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ ను నిల్వచేసి ఆ తర్వాత దాన్ని సరఫరా చేస్తారు. ఢిల్లీలోని తాజ్ మాన్ సింగ్ హోటల్ లో కంపెనీ ప్రతినిధులతో సమావేశం జరిగింది. 'ఎన్ని రోజుల్లో మీరీ ప్రాజెక్టు పూర్తి చేస్తారు?' అని చంద్రబాబు అడిగారు. నేను మనసులో వీళ్ళు రెండేళ్ళలో ప్రాజెక్టు పూర్తయ్యేటట్లైతే నాలుగేళ్లూ చెప్పితే బాగుండును. వెంటనే చంద్రబాబునాయుడుగారు రెండేళ్లలో చేయలేరా అంటాడని అనుకున్నాను. కాని ఆ కంపెనీ వాళ్లు రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని సరైన సమయం చెప్పారు. ఏడాదిలో ఎందుకు పూర్తి చేయకూడదని చంద్రబాబు అడిగారు. అంత తక్కువ సమయంలో వీలు కాదని వాళ్లు చెప్పారు. దీనిపైనే గంటసేపు ఉత్తి చర్చ జరిగింది. చివరకు ఇప్పటి వరకూ ఆ ప్రాజెక్టు ప్రారంభం కానే లేదు. తమకు లాభసాటి కాదని షెల్, ఎంజీ కంపెనీలు ఉపసంహరించు కున్నాయి.

రాజధానిలో తాత్కాలిక సెక్రటేరియట్ నిర్మాణం విషయంలో కూడా ఇదే జరిగింది. అందుకు ఆరునెలలు పడుతుందని కాంట్రాక్టు తీసుకున్న సంస్థ చెప్పింది. లేదు రెండు, మూడునెలల్లో పూర్తి చేయాలని చంద్రబాబు నిర్దేశించారు. తాను ప్రతి వారం వచ్చి తనిఖీ చేస్తానని చెప్పారు. చంద్రబాబునాయుడు ప్రతి వారం వెళ్లడం వల్ల అక్కడ జరిగే పనిలో వచ్చే మార్పు ఏమీ ఉండదు. పైగా ఆయన తాను ఇచ్చిన సమయానికి నాలుగు గంటలో, అయిదు గంటలో ఆలస్యంగా వెళతారు. వాళ్లంతా ఆ నాలుగు గంటలు వేచి చూస్తూనే ఉంటారు. తర్వాత రెండు గంటల పాటు సమీక్ష జరుపుతారు. అంటే ప్రతివారం ఆరు గంటలు వృధా అవుతుంది. ఏమైనప్పటికీ చివరకు తాత్కాలిక సెక్రటేరియట్ కాంట్రాక్టర్ తొలుత చెప్పిన

సమయానికే పని పూర్తి చేశారు. చంద్రబాబు ప్రతి వారం రావడం వల్ల వచ్చిన ఉపయోగమేమిటి? ఎవరికీ అర్థం కాలేదు.

ఇప్పుడు పోలవరం ప్రాజెక్టును కూడా ఇదే విధంగా సమీక్ష చేస్తానంటారు. సమీక్ష చేయడంలో తప్పేమీ లేదు. ఒక సరైన కాల పరిమితిని ఇచ్చి హేతుబద్ధంగా వ్యవహరించి, పాత మినిట్స్ దగ్గర పెట్టుకుని సమీక్షించడం చంద్రబాబు చేయరు. తనను తాను బిజీగా ఉంచుకునేందుకు సమీక్ష పేరుతో జరుగుతున్న పనులు ఆలస్యమయ్యేందుకు కారణమవుతారు. మాటిమాటికీ ఒకేరకమైన సమీక్షలు, అదే అంశాలను పదే పదే మాట్లాడడం సోదిలా అనిపిస్తుందని కూడా ఆయనకు తట్టదు. ఆయన వల్ల చాలా మంది నిజంగా పనిచేసేవాళ్ల సమయం వృధా అవుతుంది. మండల స్థాయిలో ఉదయమే లేవడం, గంటలు గంటలు ఆయన చెప్పింది వినడం ప్రతి వాడికీ అలవాటైపోయింది. చంద్రబాబు తాను ఎంతో క్రియాశీలకంగా కష్టపడి చేస్తున్నాను అని బిల్డప్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తారు. దాని వల్ల ప్రయోజనం ఏమీ ఉండదని ఆయనకు అర్థం కాదు. ఇటీవల ఒక ప్రముఖ పారిశ్రామికవేత్తను ఏదో సందర్భంలో కలిశాను. ఎప్పుడో ముఖ్యమంత్రిగా ఉన్న వెంగళరావును ఆయన గుర్తు చేసుకున్నారు. తాను ఆదిలాబాద్‌లో ప్లాంట్ పెడతానని ముందుకు వచ్చినప్పుడు వెంగళరావు 15 రోజుల్లో అందుకు వీలు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నారట. నిజానికి వెంగళరావు ప్రతి అంశంపై చంద్రబాబు లాగా సమయం వృధా చేసే వారు కాదు. నేను ఖమ్మం కలెక్టర్‌గా ఆయన కేంద్ర మంత్రి. ఆయన పని విధానాన్ని దగ్గరగా చూచే అవకాశం లభించింది. చాలమంది సీనియర్ ఆఫీసర్లు ఆయనను ముఖ్యమంత్రిగా ఉన్న సమయాన్ని చాలా ఆత్మీయతతో గుర్తు చేసుకునేవారు. కాని ఆయన హయాంలో పనులు చకచకా సాగిపోయాయి. పనులు బాగా సాగడానికి ఇంతగా శ్రమించాల్సిన అవసరం లేదు. చంద్రబాబు నాయుడు వల్ల జరగాల్సిన పనులు జరగకపోగా వ్యతిరేక ఫలితాలు వస్తున్నాయన్న అంశం ఆలోచించుకోవాలి. తెలుగుదేశం వాళ్లకు కూడా ఈ విషయంలో తల బొప్పి కట్టిపోయిందంటారు.

నిజానికి చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, ఇప్పటికీ ఎంతో తేడా ఉన్నది. ఆ కాలంలో ఆయనకు అద్భుతమైన టీమ్ ఉండేది. ఒక టీమ్‌గా అది బాగా పనిచేసింది. ఆయన కూడా తాను నేర్చుకోవాలనే మనస్తత్వాన్ని

ప్రదర్శించేవారు. తనకు అన్నీ తెలుసుననే మనస్తత్వాన్ని ప్రదర్శించేవారు కాదు. ఏ చిన్న మీటింగ్ అయినా ల్యాప్‌ట్యాప్ పెట్టుకుని ప్రజంటేషన్ చేసేవారు. ఏదో ఒకటి చేయాలన్న తపన, వినయం కనపడేవి. ఈ టీమ్ గతంలో అంత బాగా లేదు. ఇప్పుడు మాత్రం తాను సర్వజ్ఞుడినన్న అభిప్రాయం ఆయనలో కలిగింది. నాకు విద్యుత్ గురించి తెలిసినంతగా మీకు కూడా తెలియదు అని ఆయన విద్యుత్ అధికారులతోనే అనే స్థితికి వచ్చారు.

పైగా అప్పుడు హైదరాబాద్ నగరం అభివృద్ధి కావడానికి వేచి ఉన్న నగరంలా కనపడింది. ఆయన ఆ అవకాశాన్ని వినియోగించుకుని విజయవంతం అయ్యారు. ఇవాళ అలా అభివృద్ధి కోసం వేచి చూసే నగరమే లేదు. అంతా మొదటి నుంచి నిర్మించాల్సిన అవసరం ఉంది. అక్కడే ఆయన విఫలమవు తున్నారు. గతంలో ఉన్న విజన్ కొంత తప్పుద్రోవ పట్టింది. హైదరాబాద్, చెన్నై స్థాయిలో ఒక పెద్ద గ్రీన్ ఫీల్డ్ రాజధానిని నిర్మించాలని ఆయన ఆలోచిస్తున్నారు. అది సరైన విజన్ కాదు. పలు రకాల వైవిధ్య లక్షణాలున్న ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రంలో అభివృద్ధికి వికేంద్రీకరణే సరైన వైఖరి. అధికారంలో లేనప్పుడు తనకు సాయం చేసిన వారికి ఇప్పుడు మళ్లీ తగిన రీతిలో ప్రతిఫలాలు అందేలా చూడాలని భావించడం కూడా లక్ష్యాలను నీరుకారుస్తోంది. సరే, చంద్రబాబు తొలి విడత పాలన సమయంలో పుత్రుడి జోక్యం లేదు. ఇప్పుడది కొత్త పరిణామం. నేనున్నంత కాలం దాని ప్రభావం ప్రత్యక్షంగా లేదు కాని పరోక్షంగా ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా అధికారయంత్రాంగంపై ఉంది.

తనకు అన్నీ తెలుసునన్న అభిప్రాయం ఉండడం వల్ల అధికారులు కూడా ఏమీ మాట్లాడలేకపోతున్నారు.. కృష్ణా నదీ జలాలను బకింగ్ హామ్ ద్వారా పైకి పంపించి, పంపులు పెట్టి పైకి కొట్టి సోమశిలలో నింపుతాననో ఏదో చెబుతున్నారు.. అది ఎంతగా సాంకేతికంగా సాధ్యపడుతుందన్న విషయం మాత్రం ఎవరూ మాట్లాడరు. పైగా ఎలా తయారయ్యారంటే, ఆయనను మెప్పించేందుకు 'వాట్ ఆన్ ఐడియా సర్ జీ' అన్న స్థాయిలో ప్రశంసిస్తున్నారు. దీనితో తాను చెప్పింది కరెక్టని చంద్రబాబు అనుకుంటున్నారు. 'గోదావరి నీళ్లు కృష్ణా లో కలిపాము, ఎప్పుడూ ఇలా జరగ లేదు, మేమే చేశాం, ఇదో పవిత్ర సంగమం' అని ఎన్ని సార్లు చెప్పారో, ఎన్ని తడవల ప్రారంభోత్సవాలు పూజలు చేశారో? కాని పవిత్ర సంగమం

ఎప్పుడో జరిగిపోయింది. తెలుగు గంగ పేరుతో ఎన్టీఆరే మొదలు పెట్టారు. సోమ శిల ప్రాజెక్టులో కృష్ణా నదీ జలాలు కలిపినప్పుడే పవిత్ర సంగమం ఏర్పడింది. అది వదిలేసి, ఇప్పుడేదో కొత్తగా చేస్తున్నామని ప్రచారార్భాటం సృష్టిస్తున్నారు. మళ్లీ దీన్ని తీసుకువెళ్లి ఎక్కడో కలిపే బదులు, పైన సోమశిలలో నీళ్లు కలుపుకుని పంపించవచ్చు. ఈ అంశాలపై సరిగా దృష్టి కేంద్రీకరించకుండా అవాస్తవమైన అంశాలు ఎక్కువ మాట్లాడుతున్నారు.

నేను మొదట్లోనే చెప్పాను. కొత్తగా వెలగపూడి వద్ద రాజధాని పెడుతున్నప్పుడు తొలి ప్రాధాన్యత విజయవాడకు వెలగపూడితో రైల్వే లైన్ ద్వారా అనుసంధానం చేయడం అని. అది చాలా చిన్న అంశం. కృష్ణా కెనాల్ ద్వారా వెలగపూడికి రైల్వేలైన్ తీసుకువచ్చి గుంటూరు దగ్గర కలిపేయవచ్చు. రెండు లైన్లూ కలుస్తాయి. ఇది చిన్న ప్రాజెక్టు. గట్టిగా అడిగితే భారత ప్రభుత్వం కూడా 'నో' అనేది కాదు. ఆఫీసుకు వెళ్లేవారికి కూడా ఇబ్బందులు ఉండేవి కావు. తొలుత ఫోకస్ చేసి అది పూర్తి చేసుకోవచ్చు కదా.. కాని అలా చేయకుండా విజయవాడలో మెట్రో, హైపర్ లూప్ రైళ్లు, గూడూరు నుంచి విశాఖ వరకు హై స్పీడ్ బుల్లెట్ రైళ్లు అని ఆచరణీయం కాని వాటి గురించి మాట్లాడుతుంటారు. నిధులు లేని ఆలోచనలను వెల్లడిస్తుంటారు. అరచేతిలో స్వర్గాన్ని చూపిస్తుంటారు. చెట్టు చిటారున ఉన్న పండ్ల పై కంటే, క్రిందికి వ్రేళ్లాడుతున్న పండ్లను ముందు తెంచుకోవాలని ఆయనే ఎన్నో సార్లు అన్నారు. కాని ఆయన దృష్టి ఎప్పుడూ అందని పండ్లపైనే చిటారుకొమ్మపై ఉంటుంది. వాటికోసం రాళ్లు విసురుతుంటారు.

మరో అంశం చంద్రబాబు నాయుడు హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయం ఒక రాజ్యాంగేతర శక్తిగా, అంతులేని అధికారాలున్న రాజకీయ అధికార కేంద్రంగా మారిందనడంలో సందేహం లేదు. సీఎంఓ ఏమాత్రం పారదర్శకత, బాధ్యత లేకుండా నడుస్తుండటం వల్ల పరిపాలనపై ప్రతికూల ప్రభావం పడుతోంది. సీఎంఓ బాధ్యతాయుతంగా పనిచేసేలా పరిపాలనా సంస్కరణలు తీసుకురావాలని నేను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశాను. సమాంతర సచివాలయంగా మారిన సీఎంఓ పారదర్శకంగా పనిచేయడం లేదు. "ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయం లో కూడా ప్రధానికి సలహాలు ఇచ్చిన, నోట్ రాసిన వారి సంతకాలు ఉంటాయి. గవర్నర్ కార్యాలయంలో గవర్నర్‌కు సలహా ఇచ్చిన వారి సంతకం

ఉంటుంది. ఎలాంటి రికార్డులు, బాధ్యత, జవాబుదారీతనం లేకుండా పనిచేస్తున్న ఏకైక కార్యాలయం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక్కటే. పారదర్శకత, బాధ్యత, జవాబుదారీతనం లేవనడానికి ఇదే నిదర్శనం" అని నేను తెలిపాను. ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ)లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యదర్శి, కార్యదర్శి, అదనపు కార్యదర్శి ఉన్నారు. అందరూ ప్రభుత్వ ఖజానా నుంచి జీతభత్యాలు తీసుకుంటున్నారు. అందువల్ల వారు నిర్వర్తించే విధులన్నీ పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాలి. అయితే, ప్రస్తుతం సీఎంఓ అధికారులు రికార్డులు నిర్వహించకుండా తమకు అనుకూలంగా కొన్ని అనధికారిక నోట్స్ నిర్వహిస్తూ పనులు పూర్తికాగానే వాటిని చించివేస్తున్నారు. దీన్నిబట్టి సీఎంఓ ఎలాంటి మాన్యువల్స్ (రికార్డులు) నిర్వహించడం లేదని, జవాబుదారీతనంతో పనిచేయడం లేదని స్పష్టమవుతోంది. ఎలాంటి నియంత్రణ లేని ఈ తరహా సీఎంఓ పనితీరు వల్ల ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలుగుతోంది. సచివాలయంలో కార్యదర్శులు, ఇతర అధికారుల్లాగే సీఎంఓ అధికారులు కూడా సర్వీస్ రూల్స్ ప్రకారం రికార్డులు నిర్వహించాలి. సీఎంఓ అధికారులు ఏయే ఫైళ్లు తెప్పించుకున్నారు? ముఖ్యమంత్రికి ఏయే సలహాలు ఇచ్చారు? ఏయే విభాగాలకు ఏమేం రాసి పంపించారు? అనే వివరాలను భద్రపరిచే విధానం ఉంటే ఫైళ్ల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారు. ఈ జవాబుదారీతనం లేకపోవడం వల్లే సీఎంఓ అధికారులు రాజ్యాంగేతర శక్తులుగా మారి ప్రోటోకాల్‌ను కాలరాస్తున్నారు. ఉన్నతాధికారులను పక్కన పెట్టి కిందిస్థాయి వారి నుంచి నేరుగా తమకు కావాల్సిన రీతిలో ఫైళ్లు తెప్పించుకుంటున్నారు. తమ సంతకాలు లేనందున భవిష్యత్తులో వివాదాల్లో ఇరుక్కోమనే ధైర్యంతో సీఎంఓ అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు.

"ముఖ్యమంత్రి పరిశీలన కోసం ఫైల్ పంపండి (పుటప్ ఫైల్) అని రాయడానికే సీఎంఓ అధికారులు ఉన్నట్లయితే ఇందుకు ఐఏఎస్ అధికారులు అవసరం లేదు. ఎలాంటి బాధ్యత, జవాబుదారీతనం లేకుండా కేవలం ఫైల్ పుటప్ అని రాసి విభాగాలకు పంపించడం ద్వారా సీఎంకు సహాయపడటానికే అయితే సెక్షన్ ఆఫీసర్లు సరిపోతారు. సీఎంఓలో తీసుకునే నిర్ణయాలు ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాలి. సీఎంఓ పారదర్శకంగా

పనిచేసేలా, ప్రతి రికార్డునూ భద్రపరిచేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకుని సంస్కరణలు అమల్లోకి తీసుకురావాలి. నా లేఖపై తీసుకున్న చర్యలను నాకు తెలియజేయాలి" అని సీఎంకు రాసిన లేఖలో నేను పేర్కొన్నాను. దీనిపైన నేను హైకోర్టులో కేసు వేశాను. అది పెండింగ్‌లో ఉంది.

సమాచార హక్కు చట్టం ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వ పాలనా క్రమంలో రహస్యం, గోప్యత అన్న పదాలకు తావు లేదు. ముఖ్యమంత్రి, ఆయన కార్యాలయం ఎటువంటి బాధ్యత లేకుండా తిరుగులేని అధికారం అనుభవించడం అనేది వ్యవస్థతో చెలగాటమాడటమే.

నా అభిప్రాయం లిఖిత పూర్వకంగా తెలిపిన తర్వాత ఆయన తాను చీఫ్ సెక్రటరీగా ఉన్నప్పుడు ఈ విషయం ఎందుకు చెప్పలేదు? అని ముఖ్యమంత్రి అడిగారని తెలిసింది. ఎవరైనా ఏ సలహా ఎవరికైనా చెబితే విన్న వారికి ఆ సలహా రుచిస్తుందని అనిపించాలి కదా.. అయినా ఇచ్చిన సలహాలను పాటిస్తే కదా.. ఎవరైనా ముందుకు వెళ్లేది. తమది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని, తాను మాత్రమే ప్రజలకు జవాబుదారీ అని భావించి తమకు ఎవరి సలహాలు అవసరం లేదనుకునే నేతలకు చెప్పడం మన అమాయకత్వమే అవుతుంది.